అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 4-5-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 123 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

సిట్ దర్యాప్తుపై అసంతృప్తి

- ప్రాసిక్యూషన్ సాక్ష్యాలలో వైరుధ్యాలు
- నరోడా గామ్ కేసులో ప్రత్యేక కోర్టు వ్యాఖ్య



అహ్మదాబాద్ : నరోడా గామ్ హింసపై సిట్ జరిపిన దర్యాప్తుపై ప్రత్యేక కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రాసిక్యూషన్ సాక్ష్యాలలో వైరుధ్యాలు ఉన్నాయనీ, అవి విశ్వసించదగినవిగా లేవని తెలిపింది. కోర్టు ఆదేశాల ప్రతి మంగళవారం అందుబాటులోకి వచ్చింది. హింసకు కుట్ర జరిగిందంటూ సంఘటన జరిగిన ఆరున్నర సంవత్సరాల తర్వాత సాక్షులు తెలిపారనీ, అయితే ...5లో



పత్రికా స్వేచ్ఛలో 161వ స్థానం

ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో భారత్

- గతేడాదికంటే 11 స్థానాలు వెనక్కి
- మీడియా రంగానికి అత్యంత ప్రమాదకరమైన దేశం : ఆర్ఎస్ఎఫ్

న్యూఢిల్లీ : మీడియా స్వేచ్ఛలో భారత్ 161 స్థానానికి పడిపోయింది. గతేడాది 150వ స్థానంలో నిలవగా.. 11 స్థానాలు దిగజారి 161 ర్యాంకుకు చేరింది. మొత్తం 180 దేశాల్లోని పరిస్థితులను అధ్యయనం చేసిన పారిస్‌కు చెందిన స్వతంత్ర ఎన్‌జీఓ రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్, రిపోర్టర్స్ సాన్స్ ఫ్రాంటియర్స్ (ఆర్ఎస్ఎఫ్) బుధవారం గ్లోబల్ ప్రెస్ ఫ్రీడమ్ ఆఫ్ ఇండెక్స్‌ను విడుదల చేసింది. ఈ సూచిలో బంగ్లాదేశ్ 163 స్థానంలో ఉండగా, పాకిస్తాన్ భారత్ కన్నా మెరుగ్గా 150వ స్థానంలో నిలవడం గమనార్హం. తాలిబన్‌ల స్వాధీనంలో ఉన్న ఆఫ్ఘనిస్తాన్ కూడా 152వ స్థానంలో నిలిచింది. భూటాన్ 90వ ర్యాంకు సాధించగా, శ్రీలంక 135వ ర్యాంకులో ఉన్నట్టు ఆర్ఎస్ఎఫ్ తెలిపింది.

భారత్ 161 స్థానానికి పడిపోవడంపై ఆర్ఎస్ఎఫ్ ఈ వివరణ నిచ్చింది. 2014లో ప్రధాని మోడీ అధికారం చేపట్టిన నాటి నుంచి జర్నలిస్టులపై దాడులు పెరిగాయని ఆర్ఎస్ఎఫ్ పేర్కొంది. మీడియాలో రాజకీయ పక్షపాత ధోరణి, మీడియా యాజమాన్యాలు ఏకీకృతం కావడం ఇవన్నీ భారత్‌లో మీడియా స్వేచ్ఛను అడ్డుకుంటున్నాయని తెలిపింది.


దేశంలోని హిందీ భాషలో మూడొంతుల మంది పాఠకులకు కేవలం నాలుగు వార్తాపత్రికలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రాంతీయ భాషల విషయానికొస్తే.. కోల్‌కతాలో ఆనంద్ బజార్ పత్రిక, ముంబయిలో లోక్‌మాత్, దక్షిణాదిలో మలయాళ మనోరమలు ప్రచురితమవుతున్నాయి. టీవీ రంగంలోనూ మీడియా యాజమాన్యాలు ఏకీకృతం కావడం కనిపిస్తున్నది. అలాగే ఆల్ ఇండియా ...5లో

పుతిన్‌పై హత్యాయత్నం ?

- క్రెమ్లిన్‌పై ఉక్రెయిన్ దాడి..డ్రోన్‌లను కూల్చివేసిన మాస్కో
- తమకేం తెలియదన్న కీవ్



మాస్కో, కీవ్ : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసాన్ని లక్ష్యంగా చేసుకున్న రెండు డ్రోన్‌లను కూల్చివేసినట్టు రష్యా బుధవారం తెలిపింది. రష్యా అధ్యక్షునిపై జరిగిన "తీవ్రవాద" హత్యా యత్నంగా ఈ చర్యను అభివర్ణించింది. "రెండు మానవ రహిత వాహనాలు క్రెమ్లిన్ వైపునకు రాగా, వాటిని నిర్వీర్యం చేశాం." అని క్రెమ్లిన్ ఒక ప్రకటనలో పేర్కొంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత బుధవారం తెల్లవారు ...2లో



దోషులకు రక్ష.. బాధితులపై కక్ష

భారీ వర్షంలోనూ కొనసాగిన రెజ్లర్ల ఆందోళన



భారీ వర్షంలోనూ రెజ్లర్ల ఆందోళన కొనసాగుతున్నది. లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్న వారికి మద్దతుగా విద్యార్థులు బుధవారం నిర్వహించిన ర్యాలీపై ఢిల్లీ పోలీసులు విరుచుకుపడ్డారు. వేధించిన దోషి స్వేచ్ఛగా తిరుగుతుంటే.. ప్రశ్నించిన విద్యార్థులపై పోలీసులు దాడి చేశారు. తద్వారా రెజ్లర్లను పరోక్షంగా హెచ్చరించారు. అయినప్పటికీ రెజ్లర్లు మొక్కవోని దీక్షతో తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు.

- మద్దతుగా విద్యార్థుల ర్యాలీ.. పోలీసుల దాడి
- విద్యార్థినులను సైతం ఈడ్చిపారేసిన ఢిల్లీ పోలీసులు
- దాడిని ఖండించిన మల్లయోధులు, విద్యార్థి నేతలు
- రెజ్లర్ల వద్దకు పిటి ఉష

న్యూఢిల్లీ : జంతర్ మంతర్ వద్ద రెజ్లర్లు చేస్తున్న ఆందోళన 11వ రోజూ కొనసాగింది. నటులు, క్రీడాకారులు, రాజకీయ నాయకులు సహా ప్రముఖ నాయకులు వారి ఆందోళనకు మద్దతు తెలుపుతున్నారు. కాగా, ఆందోళన శిబిరాన్ని సందర్శించిన భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పిటి ఉష ఆందోళనకారుల ఆగ్రహాన్ని ఎదుర్కొన్నారు. పిటి ఉష తిరిగి వెళుతుండగా... ఆమెకు వ్యతిరేకంగా నినాదాలు ...2లో

విద్యార్థులపై పోలీసుల దాడి

ఎస్ఎఫ్ఐ ఖండన

బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా, రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులు మార్చ్ చేపట్టారు. మార్చ్‌కు అనుమతి లేదనే పేరుతో విద్యార్థులను పోలీసులు ఈడ్చిపారేశారు. ఇందులో పలువురు విద్యార్థినులు గాయపడ్డారు. అదే సమయంలో చాలా మంది బాలికల బట్టలు చిరిగిపోయాయి. ఢిల్లీ పోలీసులు 144వ సెక్షన్ విధించారు. ఎస్ఎఫ్ఐ సెంట్రల్ సెక్రటేరియట్ సభ్యురాలు ఐషీ ఘోష్‌తో సహా పలువురు విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని భౌతికంగా దాడి చేశారు. విద్యార్థినుల పట్ల పోలీసులు అసభ్యంగా ప్రవర్తించారనీ, దాడి చేశారని ఎస్ఎఫ్ఐ నేత ఐషీఘోష్ విమర్శించారు. పలువురు ...2లో



రాజ్యాంగ పదవికి గౌరవ మర్యాదలు ఇవ్వడం లేదు

రాష్ట్ర ప్రభుత్వంపై గవర్నర్ తమిళిసై ఆగ్రహం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అత్యున్నత రాజ్యాంగ పదవికి ఇవ్వాల్సిన గౌరవ మర్యాదలను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదని రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయ ప్రారంభోత్సవానికి తనకు ఆహ్వానం రాలేదని తెలిపారు. రాష్ట్ర ప్రథమ పౌరురాలిగా ప్రభుత్వం ఎప్పుడూ ప్రొటోకాల్ పాటించలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. జీ-20 సమావేశాల్లో భాగంగా హైదరాబాద్ గచ్చిబౌలిలో ఏర్పాటు చేసిన సీ-20 సమావేశాల్లో గవర్నర్ మాట్లాడారు. తాను తెలంగాణకు సేవ చేయడానికే వచ్చాననీ, రాజకీయాలు చేయడానికి కాదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచీ తనపై వ్యతిరేక వైఖరి ప్రదర్శిస్తోందని విమర్శించారు.



షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ వెల్లడి

వివరాలు 5లో..

నీరాకేఫ్ ప్రారంభం

అవమానించిన చోటే ఆత్మగౌరవం : మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- వారం రోజుల్లో నీరా, తాటిముంజలతో ఐస్‌క్రీం
- 'రక్షిత మోకు'కు పరిశోధనలు చేస్తున్నామని వెల్లడి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'కల్లులో కల్తీ ఉందని, నీరాలో ఆల్కహాల్ ఉందని గౌడ వృత్తిని అవమానించారు. అవమానించిన చోటే గౌడన్న ఆత్మగౌరవం కాపాడేలా వేదామృతమైన ...5లో

భద్రాద్రిలో రేలా పండుగ ప్రారంభం

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహణ

- అపురూపం ఆదివాసీల ఆటాపాట
- సాంస్కృతిక ఉత్సవాలను ప్రారంభించిన పద్మశ్రీ సకిని రామచంద్రయ్య
- రాష్ట్ర నలుమూలల నుంచి హాజరైన ఆదివాసీ కళాకారులు



నవతెలంగాణ-భద్రాచలం

డప్పు దరువు దద్దరిల్లింది..! ఘల్లు ఘల్లు మంటూ గజ్జలు సవ్వడి చేశాయి..! డోలు, సన్నాయి మేళాలు హోరెత్తాయి..! అడుగడుగు కలుపుతూ లయబద్ధంగా నాట్యం సాగింది..! సంప్రదాయ సంస్కృతి సాక్షాత్కారమైంది..! రంగు రంగుల వస్త్రాలు కండ్లను జిగేల్ మనిపించాయి..! అపురూప వేషధారణలు మనస్సును హత్తుకున్నాయి..! ఇలాంటి ఎన్నో ఆదివాసీల ఆటపాటలు.. ఔరా అనిపించేలా ఆదివాసీ సాంస్కృతిక జాతర 'రేలా పండుం' అబాల గోపాలన్ని మరిపించింది. ఈ నెల 5,6 తేదీల్లో జరుగుతున్న తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) ...2లో

నేడు బీఆర్ఎస్ జాతీయ కార్యాలయం ప్రారంభం

ఏర్పాట్లు పూర్తి : మంత్రి ప్రశాంత్ రెడ్డి

న్యూఢిల్లీ : బీఆర్ఎస్ రాజకీయ ప్రస్థానంలో మరో మైలురాయి పడనుంది. రాజకీయ విస్తరణలో భాగంగా దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంలో నూతన భవనాన్ని బీఆర్ఎస్ గురువారం ప్రారంభించనుంది. శాస్త్రోక్త కార్యక్రమాల అనంతర పార్టీ అధినేత కేసీఆర్ మధ్యాహ్నం 1:05 గంటలకు పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. ఆడంబరాలకు దూరంగా జరగనున్న ఈ ప్రారంభోత్సవంలో కేసీఆర్‌తో పాటు కొద్దిమంది మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు మాత్రమే పాల్గొననున్నారు. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు కొందరు కార్యకర్తలు ఢిల్లీకి చేరుకున్నారు.



బీఆర్ఎస్ భవన ప్రారంభోత్సవంలో భాగంగా గురువారం ఉదయం 05:30 గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభంకానున్నాయి. పూర్ణాహుతి కార్యక్రమం ముగిశాక ...5లో

విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు

24 లక్షల మందికి ప్రయోజనం

- బడులు ప్రారంభమయ్యే నాటికి అందించేలా చర్యలు
- జూన్ మొదటివారంలోగా మన ఊరు-మనబడి పనులు పూర్తి చేయాలి : విద్యాశాఖ అధికారులకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వర్క్‌బుక్స్‌ను, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు నోట్ పుస్తకాలను ఉచితంగా అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు తీసుకున్న గొప్ప నిర్ణయమిదని పేర్కొన్నారు. బుధవారం సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో విద్యాశాఖ పనితీరుపై ఆమె సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని 24 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని మంత్రి తెలిపారు. వర్క్‌బుక్స్‌ను, నోట్ పుస్తకాలను పాఠశాల ప్రారంభమయ్యే నాటికి అందజేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆమె ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులందరికీ బైలింగ్వల్ (తెలుగు, ఇంగ్లీష్ రెండు మాధ్యమాల) పాఠ్యపుస్తకాలను పాఠశాలలు పున్ణ ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు అందజేయాలని కోరారు. గతేడాది పాఠ్య పుస్తకాల పంపిణీ కోసం రూ.132 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. రానున్న విద్యా సంవత్సరానికి రూ.200 కోట్లు ...5లో

డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని తిరిగి ప్రవేశపెట్టాలి

అది జీవశాస్త్రానికి వెన్నెముక

- ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల నుంచి తొలగించటం అన్యాయం
- జేవీవీ మీడియా సమావేశంలో పలువురు వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల్లో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని పునరుద్ధరించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాకేష్ మిశ్రా మాట్లాడుతూ "డార్విన్ పరిణామ సిద్ధాంతం జీవశాస్త్రానికి వెన్నెముక. అది హైస్కూల్ నుంచి విద్యార్థినీ విద్యార్థులకు బోధించాలి. జీవశాస్త్రంలో దాని అనువర్తనాలు అనేకం. పునరాలోచించి డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని తిరిగి ప్రవేశపెట్టాలి. సిలబస్ ఎక్కువగా ఉన్నదని దానిని తొలగించడం అన్యాయం. ఈ పరిణామ సిద్ధాంతం లేకుండా కోవిడ్‌ను ఎదుర్కోగలిగేవారమా? ఈ సిద్ధాంతం ఏ మతానికి వ్యతిరేకం కాదు. అది వసుధైక కుటుంబ భావన... " అని తెలిపారు. జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) మాజీ డిప్యూటీ డైరెక్టర్ మెహతాబ్ బాఘ్మీ మాట్లాడుతూ డార్విన్ పరిణామ సిద్ధాంతం అనేక ఆధారాలతో చెప్పబడిందని తెలిపారు. ఐసీఏఆర్ ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ సోమ మర్ల మాట్లాడుతూ... 5లో



తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనాలి

- నష్టపోయిన పంటలకు పరిహారమివ్వాలి : సీఎం కేసీఆర్‌కు జూలకంటి లేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఐకేపీ కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. అకాల వర్షాల కారణంగా నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు బుధవారం ఆయన లేఖ రాశారు. యాసంగిలో ఐకేపీ కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభ మయ్యాయని తెలిపారు. కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లాలోని అనేక కేంద్రాలను స్వయం గా పర్యటించి పరిశీలించిన విషయాలను సీఎం దృష్టికి తెస్తున్నానని వివరించారు. తగు చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పట్టాల్లేక తడిసి ముద్దై మొలకెత్తుతున్నదని పేర్కొన్నారు. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక కేంద్రాల్లో ధాన్యం వర్షం నీటిలో కొట్టుకుపోతున్నదని తెలిపారు. గోనెసంచుల కొరత తీవ్రంగా కనిపిస్తున్నదని వివరించారు. పది లారీలకు పంపాల్సిన గోనెసంచులను కేవలం ఒకట్రెండు లారీలకు మాత్రమే సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీలను అన్‌లోడ్ చేయడంలో రైస్‌మిల్లర్ల దగ్గర కొంత జాప్యం జరుగుతున్నదని తెలిపారు. ఏరోజుకారోజు కొనుగోలు చేయకపోవడంతో ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం గుట్టలు గుట్టలుగా పేరుకు పోతున్నదని వివరించారు. దీంతో వారాలపాటు రైతులు పడిగాపులు కాయాల్సి వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ కనీస సదుపాయాల్లేవని పేర్కొన్నారు. భద్రత లేక దొంగతనాలు జరుగుతున్నాయని తెలిపారు. ధాన్యం తూకం వేయడానికి తేమను సాకుగా చూపుతున్నారని పేర్కొన్నారు. తరుగు తీయడం, బిల్లుల్లో కోతలు పెట్టడం ద్వారా రైతులకు తీవ్ర నష్టం కలుగుతున్నదని వివరించారు. మార్కెట్లలో ప్రత్యక్ష దోపిడీకి పాల్పడుతున్నట్టు స్పష్టంగా కనుబడుతున్నదని తెలిపారు. కోతకొచ్చిన వివిధ రకాల పంటలు, తోటలు కూడా ఈ అకాల వర్షాలకు దెబ్బతినడంతో ఆ రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు, అకాల వర్షాలు, రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయి అధికారుల్లో కదలిక లేక రైతులు మనోవ్యధకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఐకేపీ కేంద్రాల్లో సరిపోయినన్ని గోనెసంచులు, లారీలు, పట్టాలను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కనీస సౌకర్యాలను కల్పించాలని కోరారు. నష్టపోయిన అన్ని పంటల వివరాలను సేకరించి నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని సూచించారు.

భద్రాద్రిలో రేలా పండుగ ప్రారంభం


(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర 3వ మహాసభలను పురస్కరించుకొని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ, రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ గిరిజనుల కళాకారుల ప్రదర్శనలు భద్రాద్రి నడి బొడ్డునున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం సాయంత్రం అంగ రంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వీటిని ప్రముఖ ఆదివాసీ డోలు వాయిద్య కళాకారులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక కళలు సంస్కృతికి పునాద ని, ఆదివాసీ సంస్కృతి కళలేనని తెలిపారు. ఆదివాసీ సంస్కృతి జీవన విధానం, కళలు, పాటలు అత్యంత పురాతనమైనవని, మనిషి జీవనం ప్రారంభమైన నాటివన్నారు. మానవ సమాజంలోని అత్యంత పురాతనమైన ప్రకృతి తోటి, శ్రమతోటి మమేకమైన ఆదివాసీ కళలు, సంస్కృతిని, సాహిత్య వారసత్వాన్ని నేటి సమాజం ఆద రించి అభివృద్ధి పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. అంతరిం చి పోతున్న ఆదివాసీ కళలను, నృత్యాలను వాయిద్యా పరికరాలను సమా జంలో సజీవంగా ఉంచటం కోసం, భావితరాలకు వాటిని పరిచయం చేయ టం కోసం ఇటువంటి ఉత్సవాలు బాగా ఉపయోగపడతాయని తెలిపారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్ మాట్లాడుతూ.. ప్రపంచీకరణ నేపథ్యంలో ఆదివాసీ సంస్కృతి, కళలు, పాటలు, వాయిద్య పరికరాలకు సరైన గుర్తింపు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచీకరణ ఆధునిక సాహిత్యం మరోవైపు మతోన్మాద ఆధిపత్య భావ జాలం ఆదివాసీ సంస్కృతిని ఆదివాసీ కళలను మింగేస్తున్నాయన్నారు. ఆదివాసీ హక్కుల పైన దాడి జరుగుతున్న విధంగానే వారి సాంస్కృతిక సంపదపై, కళల పై.. ఆధిపత్య భావజాలం దాడి చేస్తుందని అన్నారు. రాష్ట్రంతో పాటు భారత దేశంలోని అనేక ఆదివాసీ తెగల భాషలకు లిపిలేని కారణంగా ఆదివాసీల జీవన సంస్కృతి, వారి సాహిత్య నృత్యాలు, పాటలు భావితరాలకి అందుబాటులోకి రాలేకపోతున్నాయని తెలిపారు. వాటిని రక్షించేందుకు ఆదివాసీ భాషలకు లిపిని కనిపెట్టి వారి సాంస్కృతిక జీవనాన్ని తద్వారా ఆర్థిక, రాజకీయ జీవితాలను అభివృద్ధి పరచాల్సిన అవసరం ఉందని చెప్పారు. దాని కోసం టీఏజేఎస్ పోరాడు తుందని తెలిపారు. భూమిపై హక్కులు, గిరిజన యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు, గిరిజన గ్రామాల అభివృద్ధి, గిరిజన ప్రజల సంక్షేమం, గిరిజన చట్టా ల అమలు, ప్రభుత్వ విధానాల వల్ల గిరిజనులకు ఎదురవుతున్న కష్టాలు, ఇబ్బం దులపై భద్రాచలంలో జరిగే సంఘం రాష్ట్ర మహాసభలో చర్చించి నిర్ణయాలు చేస్తామని, వాటి ద్వారా పోరాటాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రారంభ కార్యక్రమానికి తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం సాంస్కృతిక విభాగం రాష్ట్ర కన్వీనర్ నేస్రం రాజు అధ్యక్షత వహించగా రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు పాయం రవి వర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కారం పుల్లయ్య టీఏజీఎస్ జిల్లా అధ్యక్షులు వజ్జ సురేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు సున్నం గంగ, ఆహ్వాన సంఘం నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పుతిన్‌పై హత్యాయత్నం ?

(మొదటిపేజీ తరువాయి)

జాములోపు ఈ ఘటన చోటు చేసుకుంది. కూల్చివేసిన డ్రోన్ భాగాలు క్రెమ్లిన్ ఆవరణలోనే పడ్డాయి. అయితే ఎవరూ గాయపడలేదని ఆ ప్రకటన తెలిపింది. పుతిన్‌ను హతమార్చేందుకు ఉక్రెయిన్ తీసుకున్న చర్యే ఇదని మాస్కో పేర్కొంటోంది. కాగా, దీంతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఉక్రెయిన్ స్పష్టం చేస్తోంది. "క్రెమ్లిన్‌పై డ్రోన్ దాడులతో ఉక్రెయిన్‌కు ఎలాంటి సంబంధం లేదు." అని అధ్యక్ష భవన ప్రతినిధి మిఖాయిల్ పొడొలాక్ స్పష్టం చేశారు. ఇదొక ప్రణాళిక ప్రకారం అమలు చేసిన తీవ్రవాద చర్య అని రష్యా అంతకుముందు వ్యాఖ్యానించింది. బుధవారం పుతిన్ తన నివాసంలో పనిచేసుకుంటున్నారని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తెలిపారు.



స్వీడన్ పెట్టుబడులకు స్వాగతం

ఆ దేశ రాయబారి జాన్‌తెస్లెఫ్‌తో సమావేశంలో మంత్రి కేటీఆర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే స్వీడన్ కంపెనీలకు తెలంగాణ అత్యుత్తమ గమ్యస్థానమని పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడి పెట్టే స్వీడన్ కంపెనీలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు. భారత్‌లోని స్వీడన్ రాయబారి జాన్ తెస్లెఫ్ ఆధ్వర్యం లో వచ్చిన ఆ దేశ వ్యాపార, వాణిజ్య ప్రతినిధులు, పలు కంపెనీల అధిపతులతో బుధవారం సచివాలయంలో మంత్రి కేటీఆర్ సమావేశమయ్యారు. రాష్ట్ర పారిశ్రామిక విధానాలు, ప్రభుత్వ ఆలోచన విధానాన్ని వారికి కేటీఆర్ వివరించారు. పెట్టుబడి అవకాశాల గురించి చెప్పారు. ముఖ్యంగా టెక్నాలజీ, తయారీ రంగాల్లో స్వీడన్ కంపెనీలు పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఈ దిశగా భారతదేశంలో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తిగా ఉన్న కంపెనీలను తెలంగాణకు ఆహ్వానించారు. స్వీడన్ రాయబారి ప్రతినిధి బందంలో భాగంగా వచ్చిన ఆ దేశానికి చెందిన కంపెనీల ప్రతినిధులు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాల పట్ల సంతప్తిని వ్యక్తం చేశారు. పారిశ్రామిక అనుకూల ప్రభుత్వ విధానాలను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఎనిమిదేండ్ల కాలంలో హైదరాబాద్ నగరం రూపురేఖలు సంపూర్ణంగా మార్చేలా తీసుకొచ్చిన మౌలిక వసతుల కల్పన అంశాన్ని ప్రస్తావించారు.

హైదరాబాద్ నగరంలో ఉన్న వ్యాపార అనుకూల వాతావరణంతో మరిన్ని పెట్టుబడులను తెలంగాణకు రప్పించేందుకు ప్రయత్నం చేస్తానని మంత్రి కేటీఆర్‌కు స్వీడన్ రాయబారి జాన్ తెస్లెఫ్ హామీ ఇచ్చారు. భారత దేశంలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చే కంపెనీల బందంతో కలిసి పనిచేసేందుకు ఇన్వెస్ట్ మెంట్ ఫెసిలిటేషన్ మెకానిజం పేరుతో తాము ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నామని, ఇది స్వీడన్ వ్యాపార వాణిజ్య సంస్థలతో పాటు పలు కంపెనీలతోనూ కలిసి పని చేస్తుందని వివరించారు. రాష్ట్రంలో ఉన్న పెట్టుబడి అవకాశాలపైనా తమ రాయబార కార్యాలయం నిరంతరం పరిశీలన చేస్తున్నదని, స్వీడన్ కంపెనీలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నామని మంత్రి కేటీఆర్‌కు జాన్ తెస్లెఫ్ తెలిపారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో వార్డు స్థాయి పాలన

- 150 వార్డుల్లో కార్యాలయాల ఏర్పాటు
- ఈనెలాఖరు నుంచి అమల్లోకి...

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలో త్వరలో వార్డు స్థాయి పరిపాలన అందించనున్నట్టు పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు చెప్పారు. దీనికోసం జీహెచ్‌ఎంసీ పరిధిలోని 150 వార్డుల్లో కార్యాలయాలు ఏర్పాటు చేసి, పరిపాలనను వికేంద్రీకరిస్తామన్నారు. దీనివల్ల ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలు లభిస్తాయని అన్నారు. బుధవారంనాడిక్కడి బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో పురపాలక, జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్తగా ఏర్పడే వార్డు కార్యాలయంలో పదిమంది మంది అధికారులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారనీ, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ స్థాయి అధికారి ఇంచార్జిగా ఉంటారని తెలిపారు. స్థానిక ప్రజలు సర్కిల్, జోనల్ ఆఫీసులకు వెళ్లకుండా వార్డు కార్యాలయంలోనే సేవల్ని పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సిటిజన్ ఫ్రెండ్లీగా జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయాలు ఉండాలనీ, ప్రతి వార్డు ఇంకో వార్డు కార్యాలయంతో అనుసంధానం కావాలని సూచించారు. ఈ నెలాఖరునాటికి వార్డు పాలనా వ్యవస్థను సిద్ధం చేయాలనీ, వచ్చే రెండు వారాల్లో వార్డు కార్యాలయాల్లో ఉంచాల్సిన సిబ్బందితో కూడిన బందాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ బృందాలకు వార్డు పాలన వ్యవస్థ ఉద్దేశాలు, లక్ష్యాలు, అది పనిచేసే తీరుకు సంబంధించిన అంశాల్లో పక్కా ప్రణాళికతో శిక్షణ ఇవ్వాలని చెప్పారు. వార్డు కార్యాలయాలన్నీ ఏకరూపంగా ఉండేట్టు చూడాలనీ, సిటిజన్ ఫ్రెండ్లీ డిజైన్‌ను రూపొందించాలని కోరారు. సమావేశంలో పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్, జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ దానకిషోర్‌తో పాటు పలు విభాగాల పాల్గొన్నారు.



తిరువనంతపురం.కేరళ సచివాలయం గోల్డెన్ జూబ్లీ సందర్భంగా బుధవారం ఆర్‌ఎస్‌ఎస్..కమ్యూనలిజం అండ్ ఇండియన్ పాలిటిక్స్ అంశంపై జరిగిన సెమినార్‌లో సీపీఐ(ఎం) జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడారు. బీజేపీ,ఆర్‌ఎస్‌ఎస్‌లు దేశంలో ఏ విధంగా మతవిభజన రాజకీయాలు చేస్తున్నాయో వివరించారు.

దోషులకు రక్ష.. బాధితులపై కక్ష

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ఈ సందర్భంగా బజరంగ్ పునియా మాట్లాడుతూ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ జైలుకు వెళ్లే వరకు తాము ఇక్కడే ఉంటామని మరోసారి స్పష్టం చేశారు. కేంద్ర క్రీడా మంత్రి (అనురాగ్ ఠాకూర్) హామీతోనే తొలుత తమ ఆందోళనను ముగించామనీ, అథ్లెట్లందరూ లైంగిక వేధింపుల గురించి చెప్పారని వినేష్ ఫోగట్ తెలిపారు. ఒక కమిటీ వేసి చేతులు దులుపుకున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. జంతర్ మంతర్ వద్ద కూర్చోవడానికి మూడు-నాలుగు నెలల ముందు తాము ఒక అధికారిని కలిశామని చెప్పారు. మహిళా అథ్లెట్లు లైంగిక వేధింపులకు ఎలా గురవుతున్నారో, మానసికంగా ఎలా హింసించబడుతున్నారో ఆ అధికారికి వివరించామన్నారు. అయినా ఎలాంటి చర్యలూ తీసుకోకపోవ డంతో ధర్నాకు దిగామని వివరించారు. చాలాకాలంగా తన అధికారాన్ని, పదవి ని దుర్వినియోగం చేస్తున్న శక్తివంతమైన వ్యక్తికి వ్యతిరేకంగా నిలబడ్డామని అన్నా రు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత మహా వీర్ ఫోగట్ మాట్లాడుతూ బ్రిజ్ భూషణ్ అబద్దాలు చెబుతున్నారని అన్నారు.

సీల్డ్ కవర్‌లో బ్రిజ్ భూషణ్‌పై అదనపు సమాచారం

బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించి అదనపు సమాచారాన్ని సీల్డ్ కవర్‌లో సమర్పించ డానికి మహిళా రెజ్లర్ల తరపు న్యాయ వాదిని సుప్రీంకోర్టు అనుమతించింది. ఏడుగురు రెజ్లర్లు దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం సుప్రీంకోర్టు విచారించింది. సీల్డ్ కవర్‌ను ఢిల్లీ పోలీసులకు ఇవ్వాలని తెలిపింది. మహిళా రెజ్లర్ల ఆరోపణలపై దర్యాప్తు చేయడంలో ఢిల్లీ పోలీసులు ఏమీ చేయడం లేదని మహిళా రెజ్లర్ల న్యాయవాది తెలిపారు.

బ్రిజ్ భూషణ్ రాజీనామా చేయాలి

హర్యానాలోని బీజేపీ -జేజేపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న రంజిత్ చౌతాలా సైతం బ్రిజ్ భూషణ్ రాజీ నామా చేయాలని డిమాండ్ చేశారు. దీనికి బీజేపీ ఎంపీ మేనకా గాంధీ మద్దతు తెలిపారు. బ్రిజ్ భూషణ్, ఆయన ఇద్దరు కుమారులు, అల్లుడు, అల్లుడి బావమరిది రెజ్లింగ్ అసోసి యేషన్‌లో వివిధ పదవులు నిర్వహిస్తు న్నారని కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ దిగ్విజయ్ సింగ్ ట్వీట్‌లో ప్రశ్నించారు. ఇది కుటుంబ వాదం కాదా? అని ప్రధాని మోడీని ప్రశ్నించారు.

విద్యార్థులపై పోలీస్ చర్యను ఖండించిన రెజ్లర్లు

విద్యార్థులతో ఢిల్లీ పోలీసులు అసభ్యంగా ప్రవర్తించడాన్ని రెజ్లర్లు ఖండించారు. వేధించిన వ్యక్తి స్వేచ్ఛగా తిరుగుతున్నాడని, ఆయనను పట్టుకోకుండా మహిళా రెజ్లర్లకు మద్దతుగా వస్తున్న విద్యార్థులను పోలీసులు పట్టుకుంటున్నారని విమర్శించారు. ఇది ఇబ్బందికరంగా ఉందని పేర్కొన్నారు.

విద్యార్థులపై పోలీసుల దాడి

విద్యార్థులను పోలీసులు చితక బాదారు. ఈ దేశంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా నశించిందని, మహిళా రెజ్లర్లను వేధించిన వ్యక్తికి రక్షణ లభిస్తున్నదని విమర్శించారు. బ్రిజ్ భూషణ్ సింగ్‌ను ఇంకా ఎందుకు అరెస్టు చేయలేదని ఐషీ ఘోష్ ప్రశ్నించారు.రెజ్లర్లకు మద్దతుగా నిరసన తెలిపిన ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులపై ఢిల్లీ పోలీసుల హింసాత్మక చర్యలను ఎస్‌ఎఫ్‌ఐ తీవ్రంగా ఖండిం చింది. ఈ మేరకు ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూక్ బిస్వాస్‌లు ప్రకటన విడుదల చేశారు. నిరసనలో పాల్గొన్న విద్యార్థుల పైనే కాక, రెజ్లర్ల కుటుంబ సభ్యులపైనా పోలీసులు దాడి చేశారని పేర్కొన్నారు. విద్యార్థుల శాంతియుత ఆందోళనపై ఢిల్లీ పోలీసుల క్రూరమైన అణిచివేతకు వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసనలకు ఎస్‌ఎఫ్‌ఐ పిలుపు ఇస్తుందని అన్నారు.

ప్రయాణీకులతో రైల్వే జీఎమ్ మాటామంతీ

- సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ వరకు

ఎమ్ఎమ్‌టీఎస్‌లో ప్రయాణం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎమ్ఎమ్‌టీఎస్ రైళ్ల సేవల్ని మరింత విస్తృత పర్చాలని పలువురు ప్రయాణీకులు కోరారు. తక్కువ ఖర్చుతో భద్రతతో కూడిన ప్రయాణం లభిస్తున్నదని హర్షం వ్యక్తం చేశారు. బుధవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి మేడ్చల్ వెళ్లే ఎమ్ఎమ్‌టీఎస్ రైలులో ప్రయాణం చేశారు. ప్రయాణీకులతో మాట్లాడారు. మహిళలు, విద్యార్థులు, కూలీలు, నిరుద్యోగులు, ఉద్యోగులతో ఆయన సంభాషించారు.

ఎమ్ఎమ్‌టీఎస్ సర్వీసుల సేవల గురించి ప్రయాణీకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈ సేవల్ని మరింత పెంచాలని ప్రయాణీకులు కోరారు. రైల్వే స్టేషన్ల లోని సౌకర్యాలపైనా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మల్కాజ్‌గిరి, దయానంద్‌నగర్, సఫిల్‌గూడ, రామకృష్ణాపురం, అమ్ముగూడ, కావల్రీ బ్యారక్స్, అల్వాల్, బొల్లారం, గుండ్లపోచంపల్లి, గౌడవల్లి, మేడ్చల్ స్టేషన్లలో సౌకర్యాలను పరిశీలించారు. అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. జీఎమ్ వెంట హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ శరత్‌చంద్రయాన్ కూడా ఉన్నారు.

ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడిగా అజయ్ బంగా

ప్రకటించిన ఎగ్జిక్యూటివ్ బోర్డు

వాషింగ్టన్: ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడిగా భారతీయ అమెరికన్ వ్యాపారవేత్త అజయ్ బంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు 25 మంది సభ్యులతో కూడిన ప్రపంచ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ బోర్డు బంగాను నాలుగు గంటలపాటు ఇంటర్వ్యూ చేసింది. అనంతరం ఆయన్ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు ప్రకటించింది.

కార్మికుల రక్తంలో నుంచి పుట్టిందే ఎర్రజెండా

- వచ్చే మేడే నాటికి బీజేపీని గద్దె దించుతాం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-నేలకొండపల్లి

కష్టజీవులు, కార్మికుల రక్తంలో నుంచి పుట్టిందే ఎర్రజెండా అని, రాజకీయ పార్టీల కార్యాలయాల్లో నాయకులు తీర్మానం చేసి రంగులతో అద్దింది కాదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం రాయగూడెం గ్రామంలో మంగళవారం రాత్రి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. తొలుత పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తమ్మినేనికి ఘనస్వాగతం పలికారు. ఎర్రజెండాలు చేతబట్టి ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ప్రధాన సెంటర్లో జెండాను తమ్మినేని ఆవిష్కరించారు. అనంతరం నాయకులు దుగ్గి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిస్టులు ఉద్యమాలతో సాధించిన అనేక హక్కులు, చట్టాలను దేశంలో బీజేపీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి భారీగా నిధులు తగ్గించిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరల భారంతో పేదోడు బతికే పరిస్థితి లేదన్నారు. కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతోందని విమర్శించారు. బీజేపీ రాజకీయ లబ్ది కోసం మతాల మధ్య చిచ్చు పెడుతూ ఘర్షణ వాతావరణం సృష్టిస్తుందన్నారు. పౌర హక్కులకు భంగం కలిగిస్తూ ప్రశ్నించిన వారిపై దేశద్రోహులనే పేరుతో అక్రమ కేసులు బనాయించి జైలుపాలు చేస్తుందన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరుస్తూ అనాగరికమైన మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేసేందుకు యత్నిస్తోందన్నారు. దేశాన్ని అధోగతి పాలుచేస్తున్న బీజేపీని ఇంటికి సాగనంపాలన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ వ్యతిరేక శక్తులను కూడగట్టి రానున్న మేడే నాటికి దాన్ని గద్దె దించడం ఖాయమన్నారు. చట్టసభల్లో పేదల పక్షాన గొంతెత్తి నిలదీసేది, అడిగేది, కడిగేది కమ్యూనిస్టులు మాత్రమేనని చెప్పారు. రానున్న కాలంలో దేశంలో, రాష్ట్రంలో బీజేపీ వ్యతిరేక శక్తులతో కలిసి ఉద్యమాలను మరింత ఉధృతం చేసి ఎర్రజెండాను యథాస్థానానికి తీసుకొచ్చేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ముఖ్యమంత్రిపై ఒత్తిడి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. 13 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, ధరణి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మధ్యతరగతి ఉద్యోగులు, టీచర్లు, ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు చెప్పారు. గ్రామపంచాయతీ కార్మికులను రెగ్యులర్ చేయాలని, రైతులకు రుణమాఫీ చేయాలని, పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని, దళితబంధు పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, మండల కార్యదర్శి కె.వి రామిరెడ్డి, నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, ఏటుకూరి రామారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, భూక్య కృష్ణ, దేగల వెంకటేశ్వరరావు, మారుతి కొండలరావు, శీలం అప్పారావు, పోతనబోయిన పెరుమాళ్ళు, శాఖ కార్యదర్శి లింగనబోయిన కొండలరావు, సురేష్, దుగ్గి నరసింహారావు, వీరబాబు పాల్గొన్నారు.

వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

- ఉన్నత విద్యామండలి వద్ద టీఆక్టా జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో 11 సర్కారు విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్ల సంఘం (టీఆక్టా) జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఉన్నత విద్యా మండలి కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మెన్ డాక్టర్ ఎం రామేశ్వరరావు, కన్వీనర్ డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 11 విశ్వవిద్యాలయాల్లో 1,335 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారని చెప్పారు. వారందరినీ కూడా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 16 ప్రకారం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. అదే పద్ధతిలో విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులందర్నీ రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఆక్టా నాయకులు జి వెంకటేశ్వర్లు, రాజేష్ ఖన్నా, సతీష్ కుమార్, జయశ్రీ, వి. హర్షిత, శ్రీనివాస్, పల్లా రేష్మారెడ్డి, సోమేశ్, సుదర్శన్, శరత్, కర్ణాకర్, సంయుక్త, పద్మ, ఆదిత్య మూర్తి, పద్మశ్రీ, శిరీష, కళ్యాణి, మను, రాధిక, జితేందర్, హరీష్, ఉదయ శంకర్, వంశీ శంకర్, మసూద్, వెంకటేష్, ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

1. A.A. శివకుమార్, M/s. శ్రీబాలాజి ఇంటర్నేషనల్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ నం.B-1767/TEL/PER/100/5/10036/2022 అను నేను 3.05.2023 నుండి నా సంస్థను మూసివేయాలని ఉద్దేశిస్తున్నాను. 2. దీనికి సంబంధించి నా కంపెనీపై ఏదేని కంప్లైంట్ కలిగి ఉన్నచో సదరు ప్రకటన ప్రచురణ తేదీ నుండి 30 రోజులలోగా తెలియజేయవలెను. ఫిర్యాదు కాపీలను ప్రొటెక్టర్ జనరల్ ఆఫ్ ఎమిగ్రాంట్స్, విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ, 9వ అంతస్తు, అక్బర్ భవన్, సత్య మార్గ్, చాణక్యపురి, న్యూఢిల్లీ-110021కు కూడా పంపవచ్చును.

సం/- A. A. శివకుమార్, ప్రొప్రైటర్
శ్రీ బాలాజీ ఇంటర్నేషనల్
నెం.1-2-137 to 154
మినర్వకాంప్లెక్స్, సికింద్రాబాద్-500003
తెలంగాణ, ఇండియా.

బహిరంగ ప్రకటన
(ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్, 2016లోని సెక్షన్ 102 యొక్క ఉప-సెక్షన్ (1)క్రింద)
శ్రీమతి సూకల సావిత్రి యొక్క రుణదాతలు శ్రద్ధ వహించుట కొరకు

సంబంధిత వివరాలు		
1	వ్యక్తిగత/ పర్సనల్ గ్యారెంటర్ పేరు	శ్రీమతి సూకల సావిత్రి
2	తండ్రి పేరు	శ్రీ ఎస్ఎస్‌వివి వెంకటేశ్వ రావు
3	వ్యక్తిగత/ పర్సనల్ గ్యారెంటర్ చిరునామా	ఫ్లాట్ నెం.502, మూర్తి మాన్షన్, కల్యాన్ నగర్, హైదరాబాద్-500038
4	ఐబిసిలోని సెక్షన్ 95 క్రింద చేసిన ఇన్సాల్వెన్సీ రిజొల్యూషన్ దరఖాస్తు తేది (మారటోరియం ప్రారంభమయ్యే తేది)	27.05.2022
5	డెటార్‌పై ఇన్సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రారంభించు ఉత్తర్వుల వివరాలు	సిపి(ఐబి) నెం.181/95/హెచ్‌డిబి/2022 తేది.28.04. 2023 (కాపీ 02.05.2023 నుండి ఆర్‌పికి అందుబాటులో కలదు)
6	రిజొల్యూషన్ ప్రొఫెషనల్‌గా వ్యవహరిస్తున్న ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్ పేరు మరియు రిజిస్ట్రేషన్ నెంబరు	శ్రీ.మురళీ మోహన్ చెవుటూరి
7	బోర్డుతో నమోదుచేసుకొన్నట్లు ఇంటిరిమ్ రిజొల్యూషన్ ప్రొఫెషనల వారి చిరునామా మరియు ఇ-మెయిల్	డోర్ నెం.1-2-59719, ఫ్లాట్ నెం.201, డ్రీమ్ హోమ్ వసిష్ట అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్ నెం.9, బరాఫ్ బాగ్ కాలనీ, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్, తెలంగాణ. E: mohan.chevuturi@gmail.com
8	రిజొల్యూషన్ ప్రొఫెషనల్ వారితో సంప్రదింపుల కొరకు ఉపయోగించవలసిన చిరునామా మరియు ఇ-మెయిల	పై పేర్కొన్నది
9	క్లెయింలు దాఖలు చేయుటకు చివరి తేది	19.05.2023
10	(ఎ) సంబంధిత ఫారాలు మరియు (బి) అధీకృత ప్రతినిధుల వివరములు ఇక్కడ లభించును.	ఎ) వెబ్ లింక్: https://www.ibbi.gov.in/home/downloads బి) వర్తించదు

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా 28-04-2023న శ్రీమతి సూకల సావిత్రి యొక్క వ్యక్తిగత ఇన్‌సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రాసెస్ ప్రారంభమైనదిగా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్-1 ఆదేశించింది. శ్రీమతి సూకల సావిత్రి యొక్క క్రెడిటర్లను రుజువులతో వారి క్లెయింలను 19-05-2023న లేదా ముందుగా ఎంట్రీ నెం. 8లో పేర్కొన్న చిరునామాలో రిజొల్యూషన్ ప్రొఫెషనల్‌కు దాఖలుచేయవలెనని తెలియజేయడమైనది. క్రెడిటర్లు రుజువులతోవారి క్లెయింలను నేరుగా, పోస్టుద్వారా లేదా ఎలక్ట్రానిక్ విధానం ద్వారా దాఖలుచేయాలి.

తేది: 04-05-2023
ప్రదేశం: హైదరాబాద్

సం/- మురళీ మోహన్ చెవుటూరి
రిజొల్యూషన్ ప్రొఫెషనల్
IBBI/IPA-003/IP-N00307/2020-21/13464

LIC HFL ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
304,మూడో అంతస్తు, మైత్రివనం, అమీర్‌పేట్, హైదరాబాద్-500 038.

స్వాధీనతా ప్రకటన
(రూల్ 8(1) ప్రకారం) (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, దిగువ పేర్కొన్న సంతకందారు మరియు ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, 304,మూడో అంతస్తు, మైత్రివనం, అమీర్‌పేట్, హైదరాబాద్-500 038 యొక్క అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్షన్ 13(2) ప్రకారం మరియు దీనితో పాటు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్,2002లోని రూల్3 ప్రకారం సంక్రమించిన అధికారాల ప్రకారం దిగువ పేర్కొన్న రుణగ్రహీతకు బకాయిలను నోటీసు ముట్టిన తేదీ నుంచి 60 రోజుల్లో వడ్డీ/ కాస్ట్‌తో పాటుగా కలుపుకొని తిరిగి చెల్లించాలని కోరుతూ డిమాండ్ నోటీసు పంపడం జరిగింది.

1) రుణగ్రహీత పేరు: 1) శ్రీరంగా వినోద్ తల్వార్ మరియు 2) శ్రీ విజయ్ లక్ష్మణ్ తల్వారు
అకౌంట్ నెంబర్లు: 710500001370 & 710400011959
డిమాండ్ నోటీసు తేది:10-02-2023
లాంఛనప్రాయంగా స్వాధీనతా తేది: 29-04-2023
బకాయి ఉన్న రుణం మొత్తం: రూ.43,94,128.80 (రూపాయలు నలభై మూడు లక్షల తొంభై నాలుగు వేల ఒక వంద ఇరవై ఎనిమిది మరియు ఎనభై పైసలు మాత్రమే) తేది:10-02-2023 నాటికి వర్తింపదగు భవిష్య వడ్డీని కలుపుకొని 10-02-2023 తేదీ నుంచి తిరిగి చెల్లించాలి.
స్థిరాస్తి యొక్క వివరణ: ఆస్తికి సంబంధించి రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం.501, ఐదో అంతస్తు, "బాలాజీ నిలయం విహార్" ఎంసిఎల్ నెం.3-12-117/10/501,బిఎల్‌బి-12, ప్లాట్ నెంబర్లు 82&91, సర్వే నెం.9/1, దీనియొక్క ప్లింత్ ఏరియా 1323చ.అ. (కామన్ ఏరియాతో పాటుగా) అవిభాజ్యమైన స్థలం యొక్క విస్తీర్ణంలో వాటా 42.15చ.గ. లేదా 35.23చ.మీ.మొత్తం విస్తీర్ణం 861చ.గ. లేదా 719.7చ.మీ. పిఎస్ కాలనీ, మధురా నగర్, రామాంతపూర్ గ్రామం, ఉప్పల్ మండలం మరియు మున్సిపాలిటీ, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ, దీని యొక్క రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.4218/12, తేది:19-04-2012, సదరు ఆస్తి శ్రీ తల్వారు రంగా వినోద్, తండ్రి: శ్రీ టి.సత్య మోహన్ రావుకు చెందినది. దీని యొక్క హద్దులు: ఫ్లాట్ నెం.501 యొక్క హద్దులు: ఉత్తరం: కారిడార్& ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, తూర్పు: ఓపెన్ టు స్కై, పడమర: ఓపెన్ టు స్కై, ప్లాట్ యొక్క హద్దులు: ఉత్తరం: 20' వెడల్పు రోడ్డు, దక్షిణం: 40'వెడల్పు రోడ్డు, తూర్పు: పొరుగువారి యొక్క నివాసం, పడమర: పొరుగువారి యొక్క నివాసం.

పైన పేర్కొన్న రుణగ్రహీత బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు, ఇందుమూలంగా రుణగ్రహీతకు ప్రత్యేకంగా మరియు సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా దిగువ పేర్కొన్న సంతకందారు పైన పేర్కొన్న ఆస్తిని పైన పేర్కొన్న యాక్ట్‌లోని సెక్షన్ 13(4) మరియు దీనితో పాటుగా సంబంధిత రూల్స్‌లోని సెక్షన్ 8 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని పైన పేర్కొన్న తేదీలో తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. రుణగ్రహీతకు ప్రత్యేకించి మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా హెచ్చరించేదేమనగా పైన పేర్కొన్న ఆస్తికి సంబంధించి ఎలాంటి లావాదేవీలను నిర్వహించకూడదు, సదరు ఆస్తి ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వద్ద ఛార్జ్ చేయబడినవి మరియు పైన పేర్కొన్న రుణగ్రహీత వద్ద నుంచి వడ్డీ మరియు భవిష్య వడ్డీ, వ్యయాలను కలుపుకొని తిరిగి చెల్లించుటకు లోబడి ఉంటుంది. రుణగ్రహీతకు తెలియజేయునది ఏమనగా, సదరు యాక్ట్‌లోని సెక్షన్ 13 సబ్‌సెక్షన్ 8 ప్రకారం సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి విడిపించుకునేందుకు లభ్యమయ్యే కాలపరిమితి, తదితర వివరాలను పొందవచ్చును.

తేది:04-05-2023
ప్రదేశం: హైదరాబాద్

సం/- అధీకృత అధికారి
ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

సమాజ చైతన్యాభిలాషులు జర్నలిస్టులు

- హైబిజ్ టీవీ మీడియా అవార్డుల ప్రదానోత్సవంలో హోంమంత్రి మహమూద్ అలీ
- బెస్ట్ బిజినెస్ రిపోర్టర్‌గా చిట్యాల మధుకర్‌కు అవార్డు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

జర్నలిస్టులు సమాజ చైతన్యాన్ని కాంక్షిస్తారనీ, వారి సేవల్ని రాష్ట్రప్రభుత్వం గుర్తించిందని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ప్రత్యేక నిధుల్ని విడుదల చేసి, కష్టకాలంలో అండగా నిలుస్తున్నారని చెప్పారు. బుధవారం మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో వరల్డ్ ప్రెస్ ఫ్రీడం డే సందర్భంగా హైబిజ్ టీవి మీడియా అవార్డ్స్- 2023 కార్యక్రమం జరిగింది. దీనికాయన ముఖ్య అతిథిగా హాజరై ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో విశేష సేవలు అందించిన జర్నలిస్టులకు అవార్డులు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ రూ. 42 కోట్ల నిధులను కేటాయించారని తెలిపారు. అనారోగ్య కారణాలతో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందించారని వివరించారు. అనేక అవరోధాలు ఎదురవుతున్నా జర్నలిస్టులు వెనకడుగు వేయకుండా కష్టించి పనిచేస్తున్నారని అభినందించారు. ఈ సందర్భంగా ప్రింట్ జర్నలిజం తెలుగు విభాగంలో బెస్ట్ బిజినెస్ రిపోర్టర్‌గా చిట్యాల మధుకర్‌కు అవార్డును అందచేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలో రాణిస్తున్న అనిల్ కుమార్, దాస్ కేశవరావు, ఈమని కృష్ణారావులకు లెజెండ్ అవార్డులను అందచేశారు. కార్యక్రమంలో పాల్గొన్న చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో జర్నలిస్టులు వార్తాసేకరణ కోసం పోటీ పడుతున్నారని అన్నారు. ఒకప్పటి జర్నలిజంకు ఇప్పటి జర్నలిజంకు చాలా వ్యత్యాసం ఉన్నదని విశ్లేషించారు. హైబిజ్ టీవీ మీడియా అవార్డుల్లో పలు కేటగిరీల్లో 65 మందికి అవార్డులను అందజేశారు. బెస్ట్ ప్రింట్ జర్నలిస్టుగా గుండాల కష్ణ, బెస్ట్ కార్టునిస్ట్‌గా మత్యుంజయ్, బెస్ట్ ఫోటోగ్రాఫర్‌గా గోపి బందిగే, బెస్ట్ ప్రింట్ అడ్వర్టైయిజ్‌మెంట్‌లో రాజిరెడ్డి, సీనియర్ ఎంప్లాయి రాములు తదితరులకు అవార్డులు అందచేశారు. కార్యక్రమంలో టీఎస్ఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి, లైఫ్ స్పాన్ సంస్థ ఎమ్‌డి నరేంద్రరామ్ నంబుల, పౌల్ట్రీ ఇండియా అధ్యక్షులు పి చక్రధర్‌రావు, భారతీ సిమెంట్స్ మార్కెటింగ్ డైరెక్టర్ ఎమ్ రవీందర్ రెడ్డి, క్రెడాయ్ జనరల్ సెక్రటరీ వీ రాజశేఖర్ రెడ్డి, హైబిజ్ టీవీ సీఈఓ జే సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

సౌత్ ఇండియన్ బ్యాంక్ (SOUTH INDIAN Bank)
ఎల్‌బి నగర్, కొత్తపేట్ బ్రాంచ్, 1-2-84/1, ప్రశాంతి ఆర్కేడ్, కొత్తపేట్, ఎల్‌బి నగర్ మున్సిపాలిటీ, హైదరాబాద్, పిన్-500 035. ఫోన్: 040-24140433, ఇ-మెయిల్ ఐడి: br0546@sib.co.in

బంగారం వేలం

ఇందుమూలంగా ద సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి తెలియజేయునది ఏమనగా దిగువ పేర్కొన్న రుణగ్రహీత పొందిన గోల్డ్ లోన్‌కు సంబంధించి పొందిన బకాయిలను తిరిగి చెల్లించాలని కోరుతూ విక్రయానికి సంబంధించిన సేల్ నోటీసు(లు) పంపడం జరిగింది. రుణగ్రహీత బ్యాంక్ నుంచి పొందిన రుణాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు, ఇందుమూలంగా రుణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా దిగువ పేర్కొన్న సంతకందారు బంగారు ఆభరణాల యొక్క ఆన్‌లైన్ వేలాన్ని "ఎక్కడ ఎలా ఉందో అలాగే" & "ఎక్కడైతే ఎలా ఉందో అలాగే" & "రికోర్స్ విధానం లేకుండా" నిర్వహించనున్నారు. ఆన్‌లైన్ విధానంలో రుణగ్రహీత పేరు: లాజురామ్ పి, గోల్డ్ లోన్ నెంబర్ 0546653000059727 కు సంబంధించి https://egold.auctiontiger.net ద్వారా 05-05-2023 తేదీన మధ్యాహ్నం గం.12-00 నుంచి గం.3-00 వరకు వేలం నిర్వహించబడును.

అదనపు సమాచారం కోసం దయచేసి ఆక్షన్ టైగర్ వారిని 6359575981/ 9023724780 సెల్ నెంబర్‌లలో సంప్రదించాలి.

సం/- మేనేజర్
ద సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్

Canara Bank (A Government of India Undertaking, Syndicate)
దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచ్, హైదరాబాద్.
ఫోన్:73829 32171
Email: cb1179@canarabank.com

బంగారం వేలం విక్రయ ప్రకటన

ఇందుమూలంగా దిగువ పేర్కొన్న వ్యక్తులకు తెలియజేయునది ఏమనగా వారి యొక్క లోన్ అకౌంట్‌లకు సంబంధించిన బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. వారి యొక్క చిరునామాలకు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా పంపించిన నోటీసులు బట్వాడా కాకుండా బ్యాంక్‌కు తిరిగి వచ్చాయి. ఇందుమూలంగా వారికి అభ్యర్థించునది ఏమనగా బకాయి ఉన్న మొత్తాన్ని చార్జీలతో పాటుగా కలుపుకొని తిరిగి చెల్లించి వారి యొక్క బంగారు ఆభరణాలను 04-05-2023 తేదీలోగా లేదా అంతకంటే ముందుగా విడిపించుకోవాలి. ఒకవేళ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనట్లయితే తనఖాపెట్టిన సెక్యూరిటీలను బ్యాంక్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించి బకాయిలను రాబట్టుకునేందుకు తేది:05-05-2023, సాయంత్రం గం.4-00కు లేదా మరేఇతర సౌకర్యవంతమైన తేదీలో ఇకపై ఎలాంటి నోటీసు ఇవ్వకుండా బ్యాంక్ వారి నిర్ణయం మేరకు విక్రయించబడునని తెలియజేయడమైనది.

క్ర.సం.	రుణం పొందిన తేది	లోన్ నెంబర్	రుణగ్రహీత పేరు & చిరునామా
1 2 3 4 5	08-04-2021 06-01-2018 24-04-2020 07-09-2020	1179608000241 1179261005832 1179753000196 1179755000121 125001314029	వి.ఆదినారాయణ, ఇంటి నెం.12 1 231, కృషి నగర్, బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్-500068.
6	27-08-2020	1179768000339	వరుణ్ రోడ్ లైన్స్, ఇంటి నెం.12 1 15/73, ప్లాట్ నెం.73, శ్రీనివాస ఎన్క్లేవ్, నాగోల్, హైదరాబాద్.

తేది:03-05-2023, ప్రదేశం: హైదరాబాద్ — అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

JADCHERLA EXPRESSWAYS PRIVATE LIMITED
Applicant Company
(CIN: U45200TG2005PTC096719)
Reg.Office: 3rd Floor 'C' Block, TSR Towers, 6-3-1090, Rajbhavan Road, Hyderabad, Telangana - 500082
Tel. +91 40 40062583/84
Mail id-corporateaffairs@jadcherlaexpressways.com

NOTICE OF REDUCTION OF SHARE CAPITAL
(CA 49/66/HDB/2022 under Section 66 & 52 of the Companies Act, 2013)

The Honorable National Company Law Tribunal "NCLT" Hyderabad Bench – I vide its Order dated April 12, 2023 has approved the scheme of "Reduction of Share Capital" of the Company approving the Minutes set forth herein below:

"The Paid-up Equity Share Capital of Jadcherla Expressways Private Limited henceforth is INR 1,64,87,31,350/- (Rupees One Hundred Sixty Four Crores Eighty Seven Lakhs Thirty One Thousand Three Hundred and Fifty only) divided into 16,48,73,135 (Sixteen Crores Forty Eight Lakhs Seventy Three Thousand One Hundred and Thirty Five Only) Equity Shares of INR 10 (Rupees Ten only) each from INR 2,10,04,02,530/- (Rupees Two Hundred and Ten Crores Four Lakhs Two Thousand Five Hundred and Thirty Only) divided into 21,00,40,253 (Twenty One Crores Forty Thousand Two Hundred and Fifty Three Only) Equity Shares of Rs.10/- (Rupees Ten Only) each. At the date of Registration of this Minute 16,48,73,135 (Sixteen Crores Forty-Eight Lakhs Seventy-Three Thousand One Hundred and Thirty-Five Only) Equity Shares of Rs.10/- (Rupees Ten Only) each have been issued and are deemed to be fully paid up and remaining 4,51,67,118 (Four Crore Fifty-One Lakhs Sixty-Seven Thousand One Hundred and Eighteen) Equity shares of INR 10/- (Rupees Ten only) each shall stand extinguished."

This advertisement is being published as per the directions of the NCLT, in its Order dated April 12, 2023.

Further the Certified Copy of the Order was filed by the Company with and registered by Registrar of Companies, Hyderabad, Telangana on April 28, 2023.

For **JADCHERLA EXPRESSWAYS PRIVATE LIMITED**
Sd/-
Suchi Agrawal
Company Secretary
Membership No: A22632

Date: 2.5.2023
Place: Hyderabad

మినీవర్కర్లు, టీచర్లు, ఆయాలకు 15 రోజుల సెలవులివ్వాలి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మినీవర్కర్లు, ఆయాలు లేని టీచర్లకు, టీచర్లు లేని ఆయాలకు మే నెలలో 15 రోజుల వేసవి సెలవులు ఇవ్వాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్‌కు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఆ శాఖ కమిషనర్‌కు ఆ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.పద్మ, పి.జయలక్ష్మి, కోశాధికారి కె.సునీత లేఖ రాశారు. 'మినీవర్కర్లు లేని టీచర్లు, టీచర్లు లేని ఆయాలకు సెలవులపై రాష్ట్ర సర్కారు జారీ చేసిన సర్క్యులర్‌లో స్పష్టత లేదు. గతేడాది వారికి 15 రోజుల సెలవులు ఇచ్చింది. ఈ ఏడాది కూడా ప్రభుత్వం అదే విధంగా నిర్ణయం చేస్తుందని వారు ఆశపడ్డారు. కానీ, నేటి వరకు కూడా విడిగా సర్క్యులర్ రాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఆయాలు లేకుండా మినీ వర్కర్ల వ్యవస్థను నిర్మించడం, నేటికీ రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా ఆలస్యం చేస్తున్నది. ఈ సమస్యలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి. అంతే తప్ప సెలవుల్లేకుండా పని చేయించుకోవడం సబబు కాదు. అందరితో సమానంగా వారికి కూడా గతేడాది ఇచ్చినట్టు 15 రోజుల సెలవులు ఇవ్వాలి' అని లేఖలో పేర్కొన్నారు. ఆ లేఖకు గతేడాది జారీ చేసిన సర్క్యులర్‌ను కూడా జతపరిచారు.

ఫారం-జి (మళ్లీ జారీ చేయబడింది)
ఆసక్తి వ్యక్తీకరణ కోసం ఆహ్వానం
మంటోవాణి ది ధర్తి ప్రయివేట్ లిమిటెడ్ ఆపరేటింగ్ ఇన్ ప్రొవైడింగ్ సపోర్ట్ సర్వీసెస్ ఫర్ డ్రెడ్జింగ్ ఎట్ గుజరాత్ (ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ బోర్డు ఆఫ్ ఇండియా (ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016లోని ఒ రెగ్యులేషన్ 36ఎ(1) ప్రకారం)

సంబంధిత వివరాలు		
1.	పాన్/సిఐఎన్/ఎల్ఎల్‌పి నెం.తో పాటు కార్పొరేట్ డెటార్ పేరు	మంటోవాణి ది ధర్తి ప్రయివేట్ లిమిటెడ్ PAN - AALCM9501C CIN - U74999TG2018PTC125502
2.	రిజిస్టర్డ్ కార్యాలయం చిరునామా	6-3-1113/2, రెండో అంతస్తు,డిడిఐఎల్ భవన్,బిఎస్ మక్తా,బేగంపేట్,హైదరాబాద్, టిఎ-500016, ఇండియా.
3.	యుఆర్ఎల్ వెబ్‌సైట్	అందుబాటులో లేదు
4.	అత్యధికంగా స్థిరాస్తులు ఆస్తులు ఉన్న ప్రదేశం మరియు వివరాలు	జఫ్రాబాద్ (గుజరాత్)
5.	ఇన్‌స్టాల్ చేయబడిన మెయిన్ ప్రొడక్ట్/ సేవలు	వర్తించదు
6.	గత ఆర్థిక సంవత్సరంలో విక్రయించిన సేవలు/ ఉత్పత్తులు మరియు పరిమాణం	2021-22 ఆర్థిక సంవత్సరం ప్రొవిజనల్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్ ప్రకారం రూ.232 కోట్లు
7.	పనిచేస్తున్న వారి సంఖ్య/ వర్క్‌మెన్	30
8.	గత ఆర్థిక సంవత్సరం యొక్క వివరాలు అనగా (షెడ్యూల్స్‌తో పాటుగా) రెండు సంవత్సరాలు, క్రెడిటార్ల యొక్క జాబితాలు, తదనంతరం ఈవెంట్ల యొక్క తేదీలు మరియు వివరాలు అందుబాటులో ఉన్నవి	పూర్తి వివరాల కోసం సంప్రదించాల్సిన ఇ-మెయిల్: irp.mddpl@gmail.com
9.	కోడ్‌లోని సెక్షన్ 25 (2)(హెచ్)ప్రకారం రిజల్యూషన్ అప్లికెంట్స్ యొక్క అర్హత	పూర్తి వివరాల కోసం సంప్రదించాల్సిన ఇ-మెయిల్: irp.mddpl@gmail.com
10.	ఆసక్తి వ్యక్తీకరణను పొందేందుకు చివరి తేది	24,జనవరి,2023 (ఒరిజినల్) 12,మే, 2023 (రివైజ్ చేయబడింది)
11.	ప్రాస్పెక్టివ్ రిజల్యూషన్ అప్లికెంట్స్ యొక్క ప్రొవిజనల్ లిస్ట్ జారీ యొక్క తేది	03,ఫిబ్రవరి,2023 (ఒరిజినల్) 13,మే,2023 (రివైజ్ చేయబడింది)
12.	ప్రొవిజనల్ లిస్ట్‌కు సంబంధించి అభ్యంతరాలను పొందేందుకు మరియు సమర్పణకు చివరి తేది	08,ఫిబ్రవరి,2023 (ఒరిజినల్) 16,మే,2023 (రివైజ్ చేయబడింది)
13.	ఇఓఐ సమర్పణకు ప్రాసెస్ ఇ-మెయిల్ ఐడీ	irp.mddpl@gmail.com


పైన పేర్కొన్న టైమ్‌లైన్స్ అడ్జుడికేటింగ్ అథారిటీ ప్రకారం అదనంగా 90 రోజుల వరకు సిఐఆర్‌పి పిరియడ్‌ను 270 రోజులకు వరకు పొడిగింపునకు లోబడి ఉంటుందని తెలియజేయనైనది.

శ్రీ కృష్ణ కొమరవోలు
రిజల్యూషన్ ప్రొఫెషనల్ (ఆర్‌పి)
IBBI Registration No.: IBBI/IPA-002/IP-N00562/2017-2018/11699
చిరునామా : ఇంటి నెం.7-1-214, ఫ్లాట్ నెం.409,ధరమ్‌కరమ్ రోడ్డు, అమీర్‌పేట్, హైదరాబాద్-500016, మంటోవాణి ది ధర్తి ప్రయివేట్ లిమిటెడ్. (కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్ ప్రకారం)

తేది:03-05-2023
ప్రదేశం:హైదరాబాద్

సంపాదకీయం

కర్'నాటక' ఎజెండా!



మత విద్వేష రాజకీయమే ఎజెండాగా కర్నాటకలో బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసింది. ఉచితాలను రేవడి కల్చర్‌గా, రాష్ట్ర ప్రభుత్వాలకు గుదిబండగా ప్రధాని అభివర్ణించి రెండు రోజులు తిరక్కుండానే... ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రోజూ అరలీటరు

> కర్నాటక స్టేట్ వింగ్ ఎగైనెస్ట్ రెలిజియస్ ఫండమెంటలిజం అండ్ టెర్రర్ (కె-స్విఫ్ట్) పేరుతో మైనారిటీలపై విరుచుకుపడేందుకు కొత్తగా మరో గూండాల దళాన్ని ఏర్పాటు చేస్తామని నిస్సిగ్గుగా ఎజెండాలో పెట్టేశారు! రోజుకు అరలీటరు పాలు, ఏటా 3 గ్యాస్ సిలిండర్లు ఫ్రీగా ఇస్తామని హామీలు గుప్పించారు. రేవడి కల్చర్ అంటూ తిట్టిపోసే ఆ పార్టీ నేతలు ఈ హామీలను ఎలా సమర్థించుకుంటారు? హామీలను జుమ్లాలుగా అభివర్ణించిన ఆ పార్టీ నేతలు ఈ హామీలైనా అమలు చేస్తారా? అన్న ప్రతిపక్ష పార్టీల ప్రశ్నలకు ఏమని సమాధానం చెబుతారు?

పాలు ఉచితం అంటూ మేనిఫెస్టోలో ఊదరగొట్టడం ఆ పార్టీ రెండు నాల్కల ధోరణికి నిదర్శనం. దక్షిణాదిన బీజేపీ పాలనకు ముఖద్వారంగా భావించే కర్నాటకలో అడ్డగోలుగా ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి, రాజీనామా చేయించి, అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ మతతత్వ విషం చిమ్మేందుకు, కార్పొరేట్లకు సాగిల పడేందుకు సకల ప్రయత్నాలు చేసింది. ముస్లింలలో వెనుకబడిన పేదలకిచ్చే నాలుగు శాతం రిజర్వేషన్లను రద్దుచేసి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు లింగాయతులు, ఒక్కలిగల్లో పేదలకు 2శాతం చొప్పున కేటాయిస్తూ ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని మే 9 వరకూ నిలిపివేయాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించింది. హిజాబ్ ధరించి వచ్చిన విద్యార్థినులు పాఠశాలల్లోకి రాకుండా అడ్డుకోవడం, లవ్ జీహాద్ పేరిట విషం చిమ్మటం, ఆలయాల వద్ద ముస్లిములు వ్యాపారం చేయకూడదని, హలాల్ చేసిన మాంసం కొనుగోలు చేయొద్దని, టిప్పు సుల్తాన్ వ్యతిరేకత... ఇలా ఎన్నో మత విద్వేష చర్యలకు పూనుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్‌లకు దోచిపెట్టే విధానాలతో... విపరీతమైన భారాలు మోస్తున్న కష్టజీవుల కడుపు మంటలే ప్రధాన ఎజెండాగా ముందుకొచ్చాయని... ఇటీవల జరిగిన ప్రీ పోల్ సర్వేలు చెబుతున్నాయి. బీజేపీ ఓటమి తప్పదని అంచనా వేస్తున్నాయి.

ఈ నేపథ్యంలోనే కాషాయ పార్టీ మరింతగా విద్వేష విషాన్ని దట్టించేందుకు ఎన్ఆర్‌సి, ఉమ్మడి పౌర స్మృతిని పార్టీ ఎన్నికల ఎజెండాగా ముందుకు తెచ్చింది. ఎన్ఆర్‌సిని కర్నాటకలో అమలు చేస్తామని, అనధికారికంగా ఉంటున్న వారినందరినీ తరిమేస్తామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు ప్రకటించారు. కర్నాటక స్టేట్ వింగ్ ఎగైనెస్ట్ రెలిజియస్ ఫండమెంటలిజం అండ్ టెర్రర్ (కె-స్విఫ్ట్) పేరుతో మైనారిటీలపై విరుచుకుపడేందుకు కొత్తగా మరో గూండాల దళాన్ని ఏర్పాటు చేస్తామని నిస్సిగ్గుగా ఎజెండాలో పెట్టేశారు! రోజుకు అరలీటరు పాలు, ఏటా 3 గ్యాస్ సిలిండర్లు ఫ్రీగా ఇస్తామని హామీలు గుప్పించారు. రేవడి కల్చర్ అంటూ తిట్టిపోసే ఆ పార్టీ నేతలు ఈ హామీలను ఎలా సమర్థించుకుంటారు? హామీలను జుమ్లాలుగా అభివర్ణించిన ఆ పార్టీ నేతలు ఈ హామీలైనా అమలు చేస్తారా? అన్న ప్రతిపక్ష పార్టీల ప్రశ్నలకు ఏమని సమాధానం చెబుతారు? డబుల్ ఇంజిన్ ప్రభుత్వముంటే అభివృద్ధి జరుగు తుందంటూ చేసే ప్రచారం బసవరాజు బొమ్మై పాలనలో ఒట్టిదేనని తేలిపోయింది. మరోవైపు చాప కింద నీరులా కార్పొరేట్లిచ్చిన కాసులను బూత్ స్థాయి వరకూ పంపిణీ చేసి, ఎలాగైనా గట్టెక్కాలని పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

800ఏళ్ల క్రితమే దళితులు, మహిళలను సైతం భాగస్వాములను చేసి అనుభవ మండపం పేరుతో అనధికార పార్లమెంటును నడిపిన, కులాంతర వివాహం చేసిన, 'దేహమే దేవాలయం...' అంటూ శ్రమ విలువను చాటిచెప్పిన బసవన్న అడుగుజాడలు కన్నడనాట ఇప్పటికీ ఉన్నాయి. బసవన్న సంస్కరణ వాదాన్ని వెలుగులోకి తీసుకొచ్చిన ప్రఖ్యాత రచయిత కల్బుర్గిని 2017లో మతోన్మాదులు పొట్టనబెట్టుకున్నా... ఆయన రచించిన 'మార్గ' ఇప్పటికీ బసవన్న అభ్యుదయ మార్గాన్ని చూపుతూనే ఉంది. ఇతర పార్టీల కంటే బీజేపీ అధ్వాన పాలన చేసిందని ఈసడిస్తున్నారని తాజా సర్వేలు చెబుతున్నాయి. 'నందిని'ని కబళించే అమూల్ పడగ నీడపై భగ్గుమంటున్న రైతులు, నిరుద్యోగంతో తల్లడిల్లుతున్న యువత, గ్యాస్ బండ నుంచి... అన్నింటా భారాలతో నలిగిపోతున్న పేద ప్రజలు, కష్టజీవులు... మతతత్వ పార్టీకి బుద్ధి చెప్పేందుకు అన్ని శక్తులూ సిద్ధమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. 'మనుషులంతా ఒక్కటే... కులాలు, ఉపకులాలు లేవు.. ఆహారం, ఇల్లు, బట్ట, జ్ఞానం, వైద్యం... ఇవి ప్రతి మనిషి కనీస అవసరాలు' అన్న బసవన్న మాటలు కన్నడ నాట ప్రతిధ్వనించేలా ఓటరు తీర్పునివ్వాలి. కార్పొరేట్ - మతతత్వ కూటమి పాలనకు అది చెంపపెట్టు కావాలి.

ఆధునిక జీవనంలోనూ వెంటాడుతున్న వివక్ష



ఎస్. వీరయ్య

కుల వివక్ష కార్మికవర్గంలో కూడా ఉంటుందా? మహిళలు అన్ని రంగాలలో తన ప్రతిభను రుజువు చేసుకుంటున్న ఈ ఆధునిక సమాజంలో కూడా లింగ వివక్ష ఉంటుందా? వివక్షలు, వేధింపుల గురించి సిఐటియు సర్వే నిర్వహించాలని నిర్ణయించినపుడు కొంత మంది నుంచి సహజంగానే ఈ ప్రశ్నలు ఎదురైనాయి. అంతేకాదు.. గ్రామాలలో ఉంటే ఆశ్చర్యం లేదు. పట్టణాలలో కూడా ఉన్నదా! అసంఘటిత రంగంలోనేనా, ఆధునిక పరిశ్రమలలో కూడా ఉన్నదా? పనిలోకి దిగిన తర్వాత అనుమానాలన్నీ పటాపంచలైనాయి. ప్రశ్నలన్నీ తేలిపోయాయి. ఆధునిక పరిశ్రమలలో కూడా వివక్ష రూపాలు ఆధునిక రూపాల్లో ప్రత్యక్షమయ్యాయి. సాక్షాత్తూ కేంద్రపాలకులు కులవ్యవస్థనూ, మను వాదాన్నీ, ఛాందస విధానాలను ప్రజల మీద రుద్దే ప్రయత్నం చేస్తున్న సమయమిది. ఆధునిక ప్రపంచంలో ఎంతోకొంత వెనుకపట్టు పడతాయనుకున్న వివక్షలు పెట్టుబడిదారుల ఆశీస్సులతో కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్, బీజేపీలు అనుసరిస్తున్న విధానాలవల్ల మరింత ఊపందుకుంటున్నాయి. అందువల్ల ఈ సమస్యకు ప్రాధాన్యత పెరిగింది. టెక్స్‌టైల్ వంటి పరిశ్రమలలో మహిళలకు రాత్రి షిఫ్టు పడకుండా చూసే ఆనవాయితీ

> సామాజిక న్యాయం కోసం సిఐటియు నిర్వహించిన వారోత్సవాలకు ప్రాధాన్యత సంతరించుకున్నది. కులసంఘాలు నిర్వహించినపుడు ఆయా కులాల ప్రయోజనాలు ముందుకొస్తున్నాయి. కుల చైతన్యమే బలపడుతున్నది. కులాలు మరింత బలపడడానికే దోహదపడుతున్నాయి. ఇందుకు భిన్నంగా కార్మిక వర్గమే ఈ ఉత్సవాలు నిర్వహించటం వల్ల వర్గ చైతన్యం పెరుగుతున్నది. కార్మికవర్గ ఐక్యత ఆవశ్యకత ముందుకొస్తున్నది. కులం, పురుషాధిక్యత కార్మికవర్గ ఐక్యతకు ఆటంకంగా ఉన్నాయి. అందుకే కులవివక్ష, లింగవివక్షలకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఐక్యంగా పోరాడవల్సిన అవసరం ఉన్నది. ఇందుకోసం జరుగుతున్న పోరాటాలకు కార్మికవర్గం అండగా నిలువటం కూడా అవసరం. ఈ వారోత్సవాల సందర్భంగా కార్మికవర్గానికి ఇచ్చిన సందేశం ఇదే!

ఉన్నచోట కూడా తోటి కార్మికుల నుంచే "రెగ్యులర్‌గా పురుషులే నైట్‌షిఫ్ట్ చేయాలా?" అన్న ప్రశ్న ఎదురవుతున్నది. మహిళలను రెండవతరగతి పౌరులుగా గుర్తించే మనువాద సంస్కృతిని మోడీ ప్రభుత్వం ప్రోత్సహించటం వల్ల, ఇప్పటికే కార్మికులలో ఉన్న సామాజిక స్పృహ, సంఘీభావ స్ఫూర్తి కూడా ప్రభావితమవుతున్నది. ఆమేరకు కార్మికవర్గ ఐక్యతకు హాని కలిగిస్తున్నది. అందుకే కార్మికవర్గం 'సామాజిక వివక్షను విస్మరించజాలదు.

మహిళల పట్ల వివక్ష అనేక రూపాలలో వ్యక్తమవుతున్నది. కరీంనగర్ జిల్లాలో భవననిర్మాణ రంగంలో మహిళలు సూటిగా ప్రశ్నించారు. ఇంకా 'ఆడకూలి, మగకూలి' విధానం ఎందుకుండాలని అడిగారు. నిర్మాణ రంగంలో 'మహిళలకు తక్కువ కూలి' జాడ్యం బలంగా ఉన్నది. ఇది యజమానులలోనే కాదు... నిర్మాణరంగంలోని పురుష కార్మికులలో కూడా 'ఇది సహజమే కదా!' అన్న భావన ఉన్నది. హైద్రాబాద్ మహానగరంతో సహా అంతటా ఇదే పరిస్థితి. షాప్ ఎంప్లాయీస్‌లో కూడా ఇదే పరిస్థితి వెలుగులోకి వచ్చింది. నల్గొండ జిల్లాలో, పెద్ద షాపింగ్ మాల్‌లో కూడా, అన్ని అర్హతలున్నప్పటికీ మహిళలనూ, దళితులనూ నైపుణ్యంతో కూడిన పనులలో నియమించటం లేదు. బట్టల దుకాణాలలో అమ్మకాన్ని బట్టి కమీషన్ ఉన్నది. కానీ ఇక్కడ కులాన్నీ, లింగభేదాన్నీ కూడా చూస్తున్నారు. ఎస్‌సీలకూ, మహిళలకూ తక్కువ కమీషన్ ఇస్తున్నారని కార్మికులు ఆరోపించారు. ఆధునిక పరిశ్రమలలో కూడా మహిళలకు తక్కువ వేతనం ఇస్తున్నారు. పెట్టుబడిదారీ వర్గం లాభం పెంచుకోడానికి సామాజిక వివక్షలను కూడా వినియోగించుకుంటున్నది. తమ ప్రయోజనం కోసం ఈ వివక్షలను ప్రోత్సహిస్తున్నది. మహిళల పట్ల లైంగిక వేధింపులు పెరుగుతున్నాయి. నిర్మాణం, పారిశుధ్య రంగాలు మొదలు, అత్యంత ఆధునిక పరిశ్రమల వరకు ఇది సర్వసాధారణమైంది. శ్రామిక మహిళలు చెప్పుకోలేక కుమిలిపోతున్నారు. రోజూ ఎదురవుతున్న సమస్యలు ఏమని చెప్పుకోగలమంటున్నారు. చెప్పుకుంటే ఒకవైపు ఉపాధి పోతుందనీ, మరోవైపు కుటుంబంలో సమస్యలు తలెత్తుతాయనీ చెప్పారు. మున్సిపల్ రంగంలో మహిళలను జవాన్లు వేధిస్తున్నారని చెప్పారు. "తాము చెప్పినట్టు వినకపోతే" అటెండెన్స్ వేయకుండా వేధిస్తున్నారు. పని అప్పగించకుండా పక్కన పెడుతున్నారు. చెప్పినట్టు వినకపోవటం అంటే ఏమిటో తెలిసిందే! జవాన్లు ఎక్కువమంది బీసీలున్నారు. పారిశుధ్య కార్మికులలో దళిత మహిళలున్నారు. కొద్దిమంది దళిత జవాన్లు ఉన్నప్పటికీ.. వారుకూడా ఇదే ధోరణి ప్రదర్శిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. అనేకచోట్ల మహిళలకు మూత్రశాలలు లేవు. దీనివల్ల మూత్రం ఆపుకోవటం లేదా మంచినీళ్ళు తగినన్ని తాగకపోవటం వల్ల మూత్రకోశ వ్యాధులు వస్తున్నాయి. మధ్యతరగతి ఉద్యోగులున్న కాలనీలలో కూడా పారిశుధ్య కార్మికులకు మంచినీరు ఇచ్చేటపుడు అవమానకర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. పైనుంచి దోసిట్లో పోయటం లేదా లోటాలతో ఇస్తున్నారు.

పట్టణాలలో దళితులు, గిరిజనులు, ముస్లిం, క్రైస్తవులకు ఇండ్లు కిరాయికి దొరకటం సమస్యగా ఉన్నది. ముందే కులం అడుగుతున్నారు. పొరపాటున ఇచ్చినప్పటికీ, కులం తెలియగానే ఖాళీ చేయిస్తున్నారు. అనేకచోట్ల ఇంటిముందు 'శాఖాహారులకు మాత్రమే' అనే బోర్డులు కూడా పెడుతున్నారు. నల్లగొండలో రాష్ట్ర ప్రభుత్వో ద్యోగులకు కూడా ఇదే దుస్థితి. ఒక ఉద్యోగికి, ఇంకా ఇంట్లోకి మారకముందే, తీసుకున్న అడ్వాన్స్ తిరిగి ఇచ్చేసారని చెప్పి బాధపడ్డాడు. కాంట్రాక్టు ఉద్యోగులకు ఈ సమస్య మరింత తీవ్రంగా ఉన్నది. సిద్దిపేటలో షాప్ వర్కర్లు కూడా ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. మెదక్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా ఇదే అనుభవాన్ని చెప్పారు. చివరకు కలెక్టర్ కార్యాలయం ఉద్యోగికి కూడా ఈ వివక్ష తప్పలేదు. ఉద్యోగి దళితుడని తెలిసిన వెంటనే రెడ్డి సామాజిక తరగతికి చెందిన ఇంటి యజమాని కిరాయికి ఇవ్వడానికి నిరాకరించాడు. స్థానిక శాసనసభ్యుడి జోక్యం కూడా ఫలించలేదు. నిర్మాణ రంగంలో కార్మికులు భోజన సమయంలో దళితులకు దూరంగా ఇతర కులాలవారు కూర్చుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులుగా దళిత మహిళలను నిరాకరిస్తున్నారు. దళితులు చేసిన వంటను తమ పిల్లలకు పెట్టవద్దని అడ్డుకుంటున్నారు. కొన్ని సందర్భాలలో ఇవి ఘర్షణలకు దారితీశాయి. పోలీసుల జోక్యందాకా పోయిన సందర్భాలున్నాయి. అనేక గ్రామాలలో అంబేద్కర్ విగ్రహాలకు పోటీగా శివాజీ విగ్రహం పేరుతో బీసీలను ఎగదోస్తున్నారు. చాలాచోట్ల వీరి వెనుక బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలుంటున్నారు. భూపాలపల్లి జిల్లాలో ఆటోడ్రైవర్ కూడా వివక్ష సమస్య ఎదుర్కొన్నానని చెప్పాడు. ఒక బీసీ వ్యక్తి ఆటోలో కూర్చుండగా, అదే గ్రామానికి చెందిన ఎస్సీ వ్యక్తి ఆటోలో కూర్చోడానికి అంగీకరించలేదు. ఈ వాదోపవాదాలలో ఆటోడ్రైవర్ కూడా దళితుడని తెలియడంతో బీసీ వ్యక్తి ఆటో దిగి వెళ్ళిపోయాడు. మెదక్ జిల్లాలో వివక్షకు సంబంధించిన ఘటనలు కలెక్టర్ దృష్టికి తెచ్చిన తర్వాత గ్రామసభలు ప్రారంభించారు.



తహసీల్‌దార్, పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ హాజరై వివక్షలు ప్రదర్శించవద్దని చెపుతున్నారు. ఈ ప్రయత్నం ఎంతకాలం జరుగుతుందో చూడాలి. ఏమైనా.. ఆమేరకు మంచి ప్రయత్నమే.

గ్రామాలూ, పట్టణాలన్న తేడా లేదు. చదువుతో కూడా పెద్దగా సంబంధం లేదు. తరతమ స్థాయిల్లో అన్ని చోట్లా ఈ వివక్ష ఉన్నది. అందుకే ఏప్రిల్ 6 నుంచి 14 వరకు కార్మికవర్గం 'సామాజిక న్యాయ వారోత్సవాలు' నిర్వహించింది. ఈ తేదీలకు ప్రాధాన్యత ఉన్నది. ఏప్రిల్ 6 తొలితరం కార్మికవర్గ నేత బిటి రణదివే వర్ధంతి. కార్మికవర్గ ఐక్యతకు కులం ఆటంకంగా ఉన్నదని ఆనాటికే ఆయన గుర్తించారు. 'కులం, వర్గం, కార్మికవర్గ ఐక్యత' పేరుతో ఒక కరపత్రం విడుదల చేశారు. ఇప్పటికీ ఆ కరపత్రం మార్గదర్శిగా ఉపయోగపడుతున్నది. ఏప్రిల్ 11న మరో సామాజిక ఉద్యమ నేత జ్యోతీరావు పూలే జయంతి. ఏప్రిల్ 14 బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి. అందుకే ఈ వారం రోజులు సామాజిక న్యాయ వారోత్సవాలుగా నిర్వహించారు. సరిగా ఇదే సమయంలో ఏప్రిల్ 10న విమలా రణదివే జయంతి కూడా. ఆమె తొలితరం శ్రామిక మహిళా నేత. ఈ సందర్భంగా ఆ మహనీయులను స్మరించుకుంటూ అన్ని జిల్లాలలో నివాళులు అర్పించారు. వివక్ష గురించి వివిధ రంగాల కార్మికులలో చేసిన

> పట్టణాలలో దళితులు, గిరిజనులు, ముస్లిం, క్రైస్తవులకు ఇండ్లు కిరాయికి దొరకటం సమస్యగా ఉన్నది. ముందే కులం అడుగుతున్నారు. పొరపాటున ఇచ్చినప్పటికీ, కులం తెలియగానే ఖాళీ చేయిస్తున్నారు. అనేకచోట్ల ఇంటిముందు 'శాఖాహారులకు మాత్రమే' అనే బోర్డులు కూడా పెడుతున్నారు. నల్లగొండలో రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు కూడా ఇదే దుస్థితి. ఒక ఉద్యోగికి, ఇంకా ఇంట్లోకి మారకముందే, తీసుకున్న అడ్వాన్స్ తిరిగి ఇచ్చేసారని చెప్పి బాధపడ్డాడు. కాంట్రాక్టు ఉద్యోగులకు ఈ సమస్య మరింత తీవ్రంగా ఉన్నది. సిద్దిపేటలో షాప్ వర్కర్లు కూడా ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. మెదక్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా ఇదే అనుభవాన్ని చెప్పారు.

సర్వేలో దిగ్భ్రాంతి కలిగించే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వారోత్సవాలను పురస్కరించుకుని కులవివక్షకు, లింగవివక్షకు వ్యతిరేకంగా విస్తృతంగా క్యాంపెయిన్ నిర్వహించింది. అనేక జిల్లాలలో పది కిలోమీటర్ల 'న్యాయం కోసం నడక' (10కె వాక్ ఫర్ జస్టిస్) నిర్వహించారు. ఇవన్నీ కార్మికవర్గంలో ఐక్యతా స్ఫూర్తి నింపేందుకు తోడ్పడతాయి.

ఒక కార్మిక సంఘం సామాజిక న్యాయ వారోత్సవాలు నిర్వహించటం, ఈ సందర్భంగా కార్మికవర్గాన్ని సమీకరించి చైతన్యపరచటం చర్చకు దారితీసింది. ఇవి కూడా కార్మికసంఘం చేస్తే "ఇక మేమేం చేయాలి?" అని కొన్ని కుల సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. సామాజిక న్యాయం గురించి కులసంఘాలే మాట్లాడాలని పెట్టుబడిదారీ వర్గంగానీ, బూర్జువా పార్టీలుగానీ కోరుకుం టున్నాయి. కార్మిక సంఘాలు సామాజిక న్యాయం గురించి మాట్లాడటాన్ని వీరు జీర్ణించుకోలేక పోతున్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు కులసంఘాలు మాట్లాడటం కూడా ఇష్టం లేదు. కులవ్యవస్థ, లింగవివక్ష కొనసాగాలని బాహాటంగానే చెపుతున్నారు. అందుకే మనువాదాన్ని బలవంతంగా రుద్దేందుకు ప్రయత్ని స్తున్నారు. సామాజిక న్యాయం కోసం సిఐటియు నిర్వహించిన వారోత్సవాలకు ప్రాధాన్యత సంతరించు కున్నది. కులసంఘాలు నిర్వహించినపుడు ఆయా కులాల ప్రయోజనాలు ముందుకొస్తున్నాయి. కుల చైతన్యమే బలపడుతున్నది. కులాలు మరింత బలపడడానికే దోహదపడుతున్నాయి. ఇందుకు భిన్నంగా కార్మిక వర్గమే ఈ ఉత్సవాలు నిర్వహించటం వల్ల వర్గ చైతన్యం పెరుగుతున్నది. కార్మికవర్గ ఐక్యత ఆవశ్యకత ముందు కొస్తున్నది. కులం, పురుషాధిక్యత కార్మికవర్గ ఐక్యతకు ఆటంకంగా ఉన్నాయి. అందుకే కులవివక్ష, లింగవివక్షలకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఐక్యంగా పోరాడవల్సిన అవసరం ఉన్నది. ఇందుకోసం జరుగుతున్న పోరాటాలకు కార్మికవర్గం అండగా నిలువటం కూడా అవసరం. ఈ వారోత్సవాల సందర్భంగా కార్మికవర్గానికి ఇచ్చిన సందేశం ఇదే!



"ఎన్నికల వేళ... ఉచితాల జోరు"

గత మూడు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా జరుగుతున్న పార్లమెంట్, వివిధ రాష్ట్రాల శాసనసభలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు దండుకునే క్రమంలో రాజకీయ పార్టీలు, వివిధ రకాల పథకాలు, వాగ్దానాలతో ఓటర్ల ముందుకు వస్తున్నాయి. ఒకరికి మించి ఒకరు సాధ్యం కాని, ఆమాటకొస్తే ఆదాయానికి మించి అప్పులు చేసే విధంగా వాగ్దానాలు ఇస్తూ అధికారం చేపట్టడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ నవరత్నాలు పేరుతో అధికారం చేపట్టిన ప్రస్తుతం ప్రభుత్వం ఆ వాగ్దానాలు అమలు కొరకు గత నాలుగేళ్ళుగా ఎన్ని వేల కోట్ల రూపాయలు అప్పులు చేస్తున్నారో... అందరూ చూస్తూనే ఉన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందించుట మంచిదే. కానీ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకుండా, ముఖ్యంగా చదువుకున్న యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకుండా, పరిశ్రమలు స్థాపించకుండా, కేవలం వచ్చిన ఆదాయాన్ని ఉచితాలకు ఖర్చు చేసుకుంటూ పోతే భవిష్యత్తు ఏంటి..!? ఆలోచన చేయాలి.

ఇటీవల కాలంలో పంజాబ్‌లో జరిగిన ఎన్నికల్లో కూడా ఎన్ని పథకాలు, వాగ్దానాలు ఇస్తూ ఆప్ పార్టీ అధికారంలోకి వచ్చిందో అందరికీ తెలిసిందే. ప్రస్తుతం అధికారంలో ఉన్న వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు అన్ని కూడా ఆయా ప్రజలకు అనేక ఉచిత పథకాల హామీలు ద్వారా అధికారంలోకి వచ్చాయి. సంక్షేమ పథకాలు అమలు ద్వారా సమాజంలో అసమానతలు తొలగించేందుకు ప్రయత్నాలు చేయాలి. సంక్షేమ రాజ్య స్థాపనకు కృషి చేయాలని రాజ్యాంగం కూడా సూచిస్తుంది. కానీ ప్రజలను ప్రలోభాలకు గురి చేయకూడదు. ముఖ్యంగా ప్రజలను, యువతను తమ కాళ్ళపై తాము స్వతంత్రంగా బతికే పరిస్థితికి ప్రభుత్వాలు కృషి చేయాలి. దానికనుగుణంగా విద్య నైపుణ్యా లందించాలి. పరిశ్రమలు స్థాపించి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి. అప్పుడు మాత్రమే తలసరి ఆదాయం పెరుగుతుంది. పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలు మెరుగుపడుతాయి. రాష్ట్ర, దేశ జీడీపీ వృద్ధి చెందుతుంది. వస్తుఉత్పత్తి, రవాణా, ఎగుమతులు ద్వారా ఆదాయం సమకూర్చుకుంటూ రాష్ట్రాలు, దేశం కూడా పురోభివృద్ధి సాధిస్తారు. ఆ విధంగా పార్టీలు తమ ఎజెండాతో ఎన్నికల వేళ ప్రజల ముందుకు రావాలి.

ఇక ప్రస్తుతం జరుగుతున్న కర్నాటక రాష్ట్ర ఎన్నికల వేళ ఆయా పార్టీలు ఎన్నెన్నో వాగ్దానాలు ఇస్తూ అధికారం చేపట్టడానికి విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై ఐదు సంవత్సరాల పూర్తయినా, అనేక సంవత్సరాలుగా అనేక వర్గాల ప్రజలకు అనేక రాయితీలు ఇస్తున్నా, నేటికీ చాలామంది పేదరికంలో ఉండటానికి కారణం ఏమిటి..!? ఈ వాస్తవాన్ని అందరూ గ్రహించాలి. ప్రజలందరికీ విద్యా, వైద్యం అందించకుండా, తగిన నిధులు మంజూరు చేయకుండా ఎన్ని పథకాలు, అమలు చేసినా దేశంలోని పేదరికం నిర్మూలించడం అసాధ్యం. చదువుకున్న యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వాలు ఉత్పాదక రంగాలకు బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. మేధోవలసలు అరికట్టాలి. ప్రతీ సంవత్సరం మనదేశం నుంచి అనేక లక్షల మంది దేశ పౌరసత్వం వదులుకుని, ఇతర దేశాలకు శాశ్వతంగా వెళ్ళిపోవడం దేనికి సంకేతమో చెప్పగలరా? ధరల పెరుగుదలకు ముకుతాడు వేయాలి. వ్యవసాయ రంగానికి, రైతులకు ప్రభుత్వాలు భరోసా కల్పించాలి. కేవలం ఉచితాలు ద్వారా వాస్తవ పరిస్థితిని మార్చలేమనేది వాస్తవంగా గ్రహించాలి. ఇటీవల కాలంలో ప్రతి నెలా పేద మధ్య తరగతి ప్రజల కొనుగోలు శక్తి ద్వారా ప్రభుత్వానికి జీఎస్టీఈ రూపంలో వస్తున్న లక్షల కోట్ల రూపాయలు ఏయే రంగాలకు ఖర్చు చేస్తున్నారో ప్రజలందరికీ తెలియాలి.

గత నెల ఏప్రిల్ నెలలో రికార్డు స్థాయిలో 1.87లక్షల రూపాయలు జీఎస్టీ రాబడి వచ్చిందని గణాంకాలు చెబుతున్నాయి. ఈ రాబడులతో వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో ఎక్కువగా ఖర్చు చేస్తే గనుక స్వావలంబన దిశగా అడుగులు వేసే అవకాశం ఉంది. అంతేగానీ, అనుత్పాదక రంగాల్లో ఖర్చు చేయడం ద్వారా ఫలితాలు శూన్యం. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయల అప్పుల ఊబిలో కూరుకు పోయింది. అదేబాటలో వివిధ రాష్ట్రాలూ ఉన్నాయి. ఎఫ్ఆర్‌బియం పరిధి దాటి అనేక వేల కోట్ల రూపాయల అప్పులు చేస్తున్నాయి. ఎన్నికల వేళ పార్టీలు ప్రజల వాస్తవ జీవితాల్లో వెలుగులు నింపేందుకు అవసరమైన విద్యా, వైద్యం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే వాగ్దానాలు ఇస్తూ అధికారం చేపట్టడానికి ప్రయత్నాలు చేయాలి. అదే విధంగా ప్రజలు కూడా తమ భవిష్యత్తుకు భరోసా ఇచ్చే పార్టీలకు అండగా నిలవాలి. తాత్కాలిక ఉపశమనం పొందే ఉచితాలుకు లొంగరాదు. కుల, మత, వర్గ ప్రాంతీయ భాషా, లింగ వంటి సంకుచిత భావాలకు లొంగకుండా, తమకు, తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించే పార్టీలకు అండగా ఉండుట ద్వారానే భారత్ భవిష్యత్తులో అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరుతుంది.

- రావుశ్రీ

ఆదివాసీ సాంస్కృతిక జీవనంపై హిందుత్వ దాడి



కె. బ్రహ్మచారి

పచ్చని అడుగులు చుట్టూ ఎత్తయిన కొండలు ఆ కొండలపై నుండి జాలువారే అందమైన జలపాతాలు, గలగల పారే జీవనదులు, వాగులు వంకలు, పక్షుల కిలకిల రాగాలతో ప్రశాంతమైన వాతావరణం. అత్యంత రమణీయమైన ప్రకృతి ఒడిలో ప్రకృతితో కలిసి జీవించే ఆదిమ తెగలే ఆదివాసీ ప్రజలు. కల్లాకపటం ఎరుగని, కల్మషం లేని కష్టజీవులు. కళ్ళముందే విలువైన ప్రకృతి సంపద ఎంత ఉన్నా ఆకలి తీర్చుకోవటానికి తప్ప వ్యాపారానికి ఉపయోగించటం నేరంగా భావిస్తారు. అడవిని, అటవీ సంపదను వన్యప్రాణులను సంరక్షిస్తూ, క్రూర మృగాలతో కలిసి జీవిస్తూ పర్యావరణాన్ని రక్షించుకుంటూ భారతదేశ ఆదిమ సంస్కృతికి పునాదిగా జీవిస్తున్న వారు. అలాంటి ఆదివాసుల సాంస్కృతిక, ఆర్థిక జీవనం నేడు ప్రమాదంలో పడింది. పచ్చని అడవిపైన అడవిలోని విలువైన గనులు, ఖనిజాలు, నీరు, అటవీ సంపదపై అంబానీ, ఆదానీ వంటి స్వదేశీ, విదేశీ కంపెనీల కన్నుబడింది. సమిష్టి తత్వానికి ప్రతికగా స్త్రీ, పురుష వత్యాసాలు లేకుండా కష్టసుఖాలను కలిసి పంచుకునే ఆదిమ సంస్కృతి, ఆదివాసీ ప్రజల భాష, పండుగలు పాటలు, సాహిత్యం, ఆర్థిక సాంస్కృతిక జీవనంపై హిందూ మతోన్మాదుల దాడి, ప్రపంచీకరణ విష సంస్కృతి ఆధిపత్య భావజాలం ఏకకాలం జరుగుతున్నది. స్వచ్ఛమైన ఆదివాసి జీవనంపైన హిందుత్వశక్తులు కత్తి కట్టాయి. డోలు దరువులపై, అందెల సవ్వడి మధ్య సాగే నా రేలా పాటలపై భక్తి పాటలు, భావ దారిద్ర్యం, డిజె సౌండ్ మధ్య స్వచ్ఛమైన ప్రకృతి భావాలు నలిగి పోతున్నాయి. ఆదిమ కాలపు వారసత్వానికి ఆనవాళ్ళుగా ఉన్న ఆదివాసీలపై అభివృద్ధి పేరిట పాలకవర్గాలు సాగిస్తున్న దాడిపై ఆర్థిక సాంస్కృతిక రంగంలో ప్రతిఘటన ఉద్యమం పెల్లుబికవలసిన తరుణం ఆసన్నమైంది.

ఆదివాసీలది హిందూ సంస్కృతి కాదు

ఆదిలాబాద్ నుండి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రాంతం అంతా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒరిస్సా ఆంధ్రప్రదేశ్‌లోని ఆదివాసీ ప్రాంతా లకు తెలంగాణ ఆదివాసి భూభాగం ఉన్నది తెలంగాణలో 33 ఆదివాసి తెగలకు సంబంధించిన ఆదివాసి ప్రజలు రాష్ట్రంలో జీవనం సాగిస్తున్నారు. ఆదివాసులకు మతం లేదు, కులం లేదు. వారిదంతా తెగల సంస్కృతి. ఒక సమూహం, సమిష్టి జీవన విధానం. ఆదిమ సమాజపు కొనసాగింపు సంస్కృతికి ప్రతీకలు, పునాదులు ఆదివాసీ ప్రజలు. సమిష్టితత్వం దీనికి పునాది. అసమానతలు ఆధిపత్య భావజాలం లేని గొప్ప ప్రజాస్వామిక సమాజం ఆదివాసి సమాజం. కానీ హిందూ మతం, హిందూ మత సంస్కృతిలో ఉన్న అంతరాలు నిచ్చెన మెట్ల వ్యవస్థ, కులతత్వం భూస్వామ్య వ్యవస్థ తాలూకు ఆధిపత్య భావజాలం, స్త్రీలను తక్కువగా చూడటం, ఆస్తి సంబంధాల్లో సమాన హక్కులు లేకపోవడం చాలా స్పష్టంగా కనబడుతుంది. అటువంటి హిందూ మత సంస్కృతి భావజాలం నేడు ఆదివాసి సాంస్కృతిక జీవనంలో చొచ్చుకుని పోతుంది. కుటుంబ వ్యవహారాలు, ఆచారాలు సాంప్రదాయాల్లో హిందూ మత సనాతన ధర్మాలను చెప్పించడం ద్వారా ఆదివాసులు హిందూ మతంలో భాగమే అనే ఒక కొత్త వాదనను బీజేపీ రాజకీయ సైదాంతిక సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంస్థలైన వనవాసి కళ్యాణ్ పరిషత్ గిరిజన మోర్చా వంటి సంస్థలు ఆదిమ సంస్కృతిని విచ్ఛిన్నం చేయడం ద్వారా హిందూ మత సాంస్కృతిక ఆధిపత్యాన్ని ఆదివాసీలపై రుద్దుతున్నారు. ఆదివాసి పండుగలకు, హిందూ పండుగలకు, క్రైస్తవ పండుగలకు ఏమాత్రం సంబంధం లేదు. కానీ ప్రస్తుతం ఆదివాసి పండుగలను కనుమరుగు చేసే స్థాయికి హిందూ ఉన్మాద సంస్థలు ఆయుధాలను ఎక్కుపెట్టాయి. ఆదివాసులు ప్రకృతి ప్రేమికులు, ప్రకృతిని ఆరాధిస్తారు, పూజిస్తారు. దాంతోనే కలిసి



జీవిస్తారు. భూమి, అడవి ఆదివాసీలకు ప్రధానమైన ఉత్పత్తి వనరులు. ప్రకృతిలో కాలానుగుణంగా వచ్చే మార్పులకు అనుగుణంగా ఆదివాసీల పండుగలు జరుగుతాయి. భూమి పండగ చేయకుండా పంటలు వేయరు. పంటలు చేతికొచ్చే సమయాన నవంబర్ నుండి జనవరి మాసాల్లో కొత్తల పండుగ నిర్వహిస్తారు. కానీ ప్రపంచీకరణ, హిందూ మతోన్మాద శక్తుల ప్రమేయం వెరసి అసలైన ఆదివాసీల పండగ స్థానాల్లో వినాయక మండపాలు, దేవీ నవరాత్రులు, అయ్యప్ప పీఠాలు శ్రీరాముని మాలలు వచ్చి చేరుతున్నాయి. రేలా పాటలను డీజే పాటలు తొక్కేస్తున్నాయి. ఆదివాసుల పండుగలను హిందూ దేవతమూర్తుల పండుగలు మింగేస్తున్నాయి. ప్రకృతితో పెన వేసుకున్న ఆదివాసుల సాంస్కృతిక జీవనంపై మతం పేరిట ఉన్మాద శక్తులు సాగిస్తున్న దాడికి ఇదొక సజీవ సాక్ష్యం.

ఆదివాసులను అడవినుంచి వెళ్లగొట్టే కుట్ర

ఆదివాసులను, అడవిని విడదీయలేం. కానీ కేంద్ర బీజేపీ ప్రభుత్వం అదాని, అంబానీ వంటి స్వదేశీ విదేశీ కంపెనీలకు అటవీ సంపదను ప్రకృతి వనరులను దోచిపెట్టడం కోసం ఆదివాసులను అడవుల నుండి వెళ్లగొడుతున్నది. స్వాతంత్రానికి పూర్వం నుండి పోరాడి సాధించుకున్న చట్టాలను భారత పాలకవర్గాలు మార్పులు చేసుకుంటూ వచ్చాయి. చివరికి ఆదివాసీలకు ప్రస్తుతం రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన హక్కులను సైతం రద్దు చేసే కుట్రలు చేస్తున్నారు. 1865 నుండి మొదలు 2006 వరకు వచ్చిన అటవీ హక్కుల గుర్తింపు చట్టం దాకా ప్రతి చట్టం రావడం వెనుక వీరోచితమైన ఆదివాసి పోరాటాలు, త్యాగాలు ఉన్నాయి. చారిత్రాత్మక పోరాటాల ఆధారంగా సాధించుకున్న హక్కులను నేడు బీజేపీ ప్రభుత్వం రద్దు చేస్తుంది. 2019 నూతన అటవీ చట్టం పేరుతో అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతుంది. అందుకు అనుగుణంగానే తెలంగాణ రాష్ట్రంలో నల్లమల్ల అటవీ ప్రాంతంలో ఉన్న విలువైన యురేనియం నిలువలను ప్రయివేటు కంపెనీలకు కట్టబెట్టడం కోసం అక్కడి చెంచు ఆదివాసీలను అడవుల నుంచి గెంటేయాలని చూస్తున్నది. ఆదిలాబాద్ జిల్లాలో వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం పేరుతో, ఆసిఫాబాద్ జిల్లాలో పులుల సంరక్షణ పేరిట, భద్రాద్రి జిల్లాలో సింగరేణి గనుల విస్తీరణ, పోలవరం ప్రాజెక్టు పేరిట ఆదివాసి గ్రామాలను ఖాళీ చేయించి అక్కడున్న సకల సంపదలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలని కేంద్రం తీవ్రంగానే ప్రయత్నం చేస్తున్నది. అభివృద్ధి పేరిట ఆదివాసీ హక్కుల పైన ఆదివాసీ సాంస్కృతిక జీవనం పైన కేంద్ర ప్రభుత్వము, హిందూ మతోన్మాద సంస్థలు కార్పొరేట్ కంపెనీలు బహుముఖ రూపాల్లో దాడి సాగిస్తున్నాయి. ఆదివాసీల చరిత్ర మొత్తం పోరాటాల మయం. భారతదేశంలో వర్లి ఆదివాసీల తిరుగుబాటు. బీర్సా ముండా పోరాటం, తెలంగాణ గడ్డమీద కొమరంభీమ్ సాగించిన ఉద్యమం, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు పోరాటం ఆదివాసి హక్కులపై, పాలకవర్గాల దాడికి వ్యతిరేకంగా సాగాయి. అటువంటి పోరాట స్ఫూర్తిని, తెగువను ప్రదర్శించాల్సిన తరుణం ఆదివాసీకి సమాజానికి ఆసన్నమైంది. సంస్కృతి పరిరక్షణ అడవి, భూమి మీద హక్కు, విద్య, ఉపాధి అవకాశాల కోసం పాలకవర్గాన్ని ఎదిరించి పోరాడకపోతే ఇంతకాలం పోరాడి సాధించుకున్న హక్కులు అంతరించిపోతాయి. మానవ సమాజానికి పునాదిగా నిలిచిన ఆదిమ తెగలు కనుమరు గయ్యే పోయే పరిస్థితి నేటి బీజేపీ పాలనలో స్పష్టంగా కనబడుతుంది. అందుకని ఆదివాసీ ప్రజలతోపాటు వారి అభివృద్ధిని కోరుకునే సంఘాలు, సంస్థలు, రాజకీయ పార్టీలు ఆదివాసీ సంస్కృతి పరిరక్షణ కోసం సమిష్టిగా పోరాడాల్సిన అవసరం తప్పనిసరి. పోరాటాల ద్వారానే మాత్రమే హక్కులు రక్షిం చబడతాయనేది చారిత్రక వాస్తవం. ఆదివాసీ ప్రజలు ఆ పోరాటాల ద్వారానే ఉన్న హక్కుల్ని కాపాడుకోవాలి. కొత్త హక్కుల్ని సాధించుకోవడం లక్ష్యంగా ఉద్యమించాలి.

(మే 5,6 తేదీల్లో భద్రాచలంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర మూడవ మహాసభలు)

> సంస్కృతి పరిరక్షణ అడవి, భూమి మీద హక్కు, విద్య, ఉపాధి అవకాశాల కోసం పాలకవర్గాన్ని ఎదిరించి పోరాడకపోతే ఇంతకాలం పోరాడి సాధించుకున్న హక్కులు అంతరించిపోతాయి. మానవ సమాజానికి పునాదిగా నిలిచిన ఆదిమ తెగలు కనుమరు గయ్యే పోయే పరిస్థితి నేటి బీజేపీ పాలనలో స్పష్టంగా కనబడుతుంది. అందుకని ఆదివాసీ ప్రజలతోపాటు వారి అభివృద్ధిని కోరుకునే సంఘాలు, సంస్థలు, రాజకీయ పార్టీలు ఆదివాసీ సంస్కృతి పరిరక్షణ కోసం సమిష్టిగా పోరాడాల్సిన అవసరం తప్పనిసరి. పోరాటాల ద్వారానే మాత్రమే హక్కులు రక్షిం చబడతాయనేది చారిత్రక వాస్తవం. ఆదివాసి ప్రజలు ఆ పోరాటాల ద్వారానే ఉన్న హక్కుల్ని కాపాడుకోవాలి. కొత్త హక్కుల్ని సాధించుకోవడం లక్ష్యంగా ఉద్యమించాలి.



పదినిమిషాల్లో రెడీ

కొందరు ఆఫీసుకు ఉదయానే ఏడు గంటల షిఫ్ట్‌కే వెళ్లాల్సి ఉంటుంది. దాంతో ఇంట్లో అన్నీ రెడీ చేసుకొని వెళ్ళడం చాలా కష్టం. ముఖ్యంగా బ్రేక్‌ఫాస్ట్ ఏం చేయాలో అర్థం కాదు. సెలవులతో ఇంట్లో ఉండే పిల్లలు రకరకాల రుచులు కోరుతుంటారు. దాంతో మనకు బ్రేక్ ఫాస్ట్, లంచ్ వండడం కష్టంగా మారుతుంది. సులువుగా వండే బ్రేక్ ఫాస్ట్ రెసిపీలు తెలుసుకుంటే పెద్ద కష్టపడకుండా అప్పటి కప్పుడే టిఫిన్ రెడీ చేసి పెట్టేయచ్చు. ఉదయానే త్వరగా రెడీ అయ్యే బ్రేక్ ఫాస్ట్ వెరైటీలు కొన్ని ఉన్నాయి. పైగా వాటిలో పోషకాహార విలువలు కూడా అధికం. అవేంటో తెలుసుకుందాం...

బియ్యంపిండితో...

కావాల్సిన పదార్థాలు : బియ్యం పిండి - ఒక కప్పు, ఉల్లిగడ్డ - అర ముక్క, టొమాటో - అర ముక్క, క్యాప్సికం - ఒక ముక్క, పచ్చిమిర్చి - ఒకటి, కొత్తిమీర తరుగు - రెండు చెంచాలు, జీలకర్ర పొడి - ఒక చెంచా, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - తగినంత.

తయారు చేసే విధానం : ఒక గిన్నెలో బియ్యం పిండి వేసి నీళ్ళ కలపాలి. ఉండల్లేకుండా బాగా గిలక్కొట్టాలి. ఉప్పు వేయాలి. ఉల్లిగడ్డ, టొమాటో, క్యాప్సికం, పచ్చిమిర్చి, కొత్తిమీర తరుగులు వేసి బాగా కలపాలి. జీలకర్ర పొడి కూడా వేసి కలపాలి. దోశెలు పోసేంత వీలుగా పిండిని కలుపుకోవాలి. అవసరం అయితే నీళ్ల కలుపుకోవచ్చు. ఆ పిండిని దోశెల్లో పోసుకోవాలి. ఏ చట్నీతో తిన్నా ఇవి టేస్ట్‌గా ఉంటాయి.

శెనగపిండితో...



కావాల్సిన పదార్థాలు : శెనగపిండి - ఒక కప్పు, ఉల్లిగడ్డ - ఒకటి, పసుపు - చిటికెడు, పచ్చి మిర్చి - ఒకటి, అల్లం వెల్లుల్లి పేస్టు - ఒక చెంచా, కొత్తిమీర తరుగు - రెండు చెంచాలు, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - సరిపడినంత.

తయారు చేసే విధానం : గిన్నెలో శెనగపిండి, ఉప్పు వేసి బాగా కలపాలి. నీళ్ల కలిపి దోశెల పిండిలా కలుపుకోవాలి. ఉల్లిగడ్డ తరుగు, పచ్చిమిర్చి తరుగు, అల్లం వెల్లుల్లి పేస్టు, కొత్తిమీర తరుగు వేసి మళ్ళీ కలపాలి. మనకు ఇష్టమైతే అందులో జీలకర్ర కూడా వేసుకోవచ్చు. పెనంపై నూనె రాసి దోశెలా వేసుకుంటే సరి. పదినిమిషాల్లో ఇది రెడీ అయిపోతుంది.


జొన్నపిండితో...



కావాల్సిన పదార్థాలు : జొన్న పిండి - ఒక కప్పు, పెరుగు - అరకప్పు, ఉల్లిగడ్డ - అర ముక్క, టొమటో - అర ముక్క, క్యాప్సికమ్ - అర ముక్క, ధనియాల పొడి - సగం చెంచా, యాలకుల పొడి - సగం చెంచా, గరం మసాలా పొడి - పావు చెంచా, కొత్తిమీర తరుగు - రెండు చెంచాలు, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - సరిపడినంత.

తయారు చేసే విధానం : ఒక గిన్నెలో జొన్నపిండిని వేసి ఉప్పు, మసాలాలు కలుపుకోవాలి. పెరుగు కూడా వేసి బాగా గిలక్కొట్టాలి. దోశెలు పోసుకోవడానికి వీలుగా నీరు పోసి కలుపుకోవాలి. ఉల్లిగడ్డ, టొమాటో, క్యాప్సికం, కొత్తిమీర వంటివి సన్నగా తరుక్కోవాలి. వాటిని పిండిలో కలపాలి. స్టవ్ పై పెనం పెట్టి పైన నూనె రాసి దోశెలు పోసుకోవాలి.

గోధుమ పిండితో...



కావాల్సిన పదార్థాలు : గోధుమ పిండి - ఒక కప్పు, ఉల్లిగడ్డ - అర ముక్క, పచ్చిమిర్చి - ఒకటి, కొత్తిమీర తరుగు - రెండు చెంచాలు, జీలకర్ర పొడి - ఒక చెంచా, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - తగినంత.

తయారు చేసే విధానం : ఒక గిన్నెలో బియ్యం పిండి వేసి నీళ్ల కలపాలి. ఉండల్లేకుండా బాగా గిలక్కొట్టాలి. ఉప్పు వేయాలి. ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి, కొత్తిమీర తరుగులు వేసి బాగా కలపాలి. జీలకర్ర పొడి కూడా వేసి కలపాలి. దోశెలు పోసేంత వీలుగా పిండిని కలుపుకోవాలి. అవసరం అయితే నీళ్ల కలుపుకోవచ్చు. ఆ పిండిని దోశెల్లా పోసుకోవాలి. ఏ చట్నీతో తిన్నా ఇవి రుచిగానే ఉంటాయి.

ఆసక్తి తగ్గుతుందా..?

జీవితం రొటీన్‌గా ఉన్నప్పుడు నిరాశానిస్పృహలు ఆవరిస్తుంటాయి. దాంతో కొందరికి రోజు రోజుకీ ఉద్యోగ జీవితంలో ఆసక్తి తగ్గిపోతుంటుంది. అనుకున్నంత ఉల్లాసంగా, ఉత్సాహంగా పని చేయలేకపోతారు. ఏదో తెలియని ఒత్తిడికి, ఆందోళనకు గురవుతుంటారు. అయితే ఈ సమస్యల నుంచి బయటపడడానికి కొన్ని చిట్కాలు ఉన్నాయంటున్నారు నిపుణులు...

ఆఫీసులో చేస్తున్న పని మీద ఆసక్తి తగ్గిపోవడానికి మీరు ఏదో విషయంలో ఒత్తిడికి గురవడమో లేక మీరు పని చేస్తున్న రంగం మీద కాకుండా వేరే రంగం మీద ఆసక్తి ఉండడమో కారణం కావచ్చు. ఇలాంటి సందర్భాల్లో మీరు ఆలోచించి నిర్ణయం తీసుకోవడం మంచిది. లేదంటే మీ కెరీరే ప్రమాదంలో పడే అవకాశం ఉంటుంది.

రోజూ రొటీన్ జాబ్ చేస్తున్నామనే భావన కలుగుతోందా? పనిలో ఆసక్తి తగ్గడానికి అదే కారణమని భావిస్తున్నారా.. అయితే ఇటువంటి సమయంలోనే మీ పనిని మీకు తగ్గ విధంగా మలచుకోండి. రోజూ చేసే పనినే విభిన్నంగా చేయడానికి ప్రయత్నించండి. అంతకు మించి మీరు చేస్తున్న పనిలోనే రోజుకో కొత్త విషయాన్ని నేర్చుకోవడానికి సంకల్పించండి.

మీ సహచర ఉద్యోగులతో విభేదాలే మీకు ఆఫీసు పనిలో నిరాసక్తతను, నిస్పృహలను కలిగిస్తున్నాయనుకుంటున్నారా? అయితే, అలాంటి విభేదాలను సాధ్యమైనంత వరకు పరిష్కరించుకోవడానికి ప్రయత్నించండి. స్నేహపూర్వకమైన వాతావరణంలో అందరినీ గౌరవిస్తూ, నిబద్ధతతో పని చేయండి.



ఒక వేళ జీతభత్యాలు, పదోన్నతి విషయాల్లో తగిన ప్రతిఫలం అందడం లేదనే భావనే మీకు పనిలో అనాసక్తిని కలిగిస్తోందా.. అటువంటప్పుడు ఇంకా కష్టపడి పని చేయడానికి ప్రయత్నించండి. మీ నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకోండి. ఇలా చేయడం వల్ల మీకంటూ ఆఫీసులో ఒక గుర్తింపు వస్తుంది. కేవలం కొన్ని విషయాలకే పరిమితమైపోకుండా, ఇతర విషయాల్లో కూడా కంపెనీ పురోభివృద్ధిని కోరుకొనే వారినే సంస్థ ప్రోత్సహిస్తుందని గుర్తుంచుకోండి.

అలాగే మీరు ఏవైనా కుటుంబ సమస్యలు, వ్యక్తిగత సమస్యలతో సతమతమవుతున్నప్పుడు వాటి గురించి పదే పదే ఆఫీసులో ఆలోచించి మనసు పాడు చేసుకోవద్దు. వాటి ప్రభావం మీ పని మీద పడకుండా జాగ్రత్తపడాలి. ఈ విషయంలో ఏ మాత్రం తేడా వచ్చినా మీరు పని మీద దృష్టి కేంద్రీకరించలేక పదే పదే తప్పులు చేస్తూ ఇబ్బంది పడే అవకాశం ఉంటుంది.

మీ ఆఫీసులో పద్ధతులకు అలవాటు పడకపోవడం వల్ల కూడా మీకు పని మీద ఆసక్తి తగ్గే అవకాశం ఉంది.. అయితే, ప్రతి కంపెనీకి ప్రత్యేకంగా కొన్ని నియమ నిబంధనలుంటాయన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. వాటికనుగుణంగానే పద్ధతులు ఉంటాయి. అందుకే సాధ్యమైనంత వరకు ఉత్సాహంగా పని చేయాలనుకొంటే వాటికి అలవాటు పడడమే మంచిది.

ప్రణాళికాబద్ధంగా పని చేయకపోవడం కూడా మీ అనాసక్తికి కారణం కావచ్చు. మీకిచ్చిన పనిని నిర్ణీత సమయానికి అనుకున్న విధంగా పూర్తి చేయడానికి ప్రయత్నించండి. అలా చేయడం వల్ల పని ఆలస్యమవుతుందని అనవసర ఆందోళనకు, ఒత్తిడికి గురి కావక్కర్లేదు.

మరో ముఖ్యమైన విషయమేమిటంటే, పని చేయడానికి బద్ధకం పెంచుకున్నా కూడా పనిలో ఆసక్తి తగ్గుతుంది. అందుకే పనులను వాయిదా వేయడం, ఆలస్యంగా పనులను ప్రారంభించడం వంటివి చేయకూడదు.

కొంతమంది కొన్ని ఫుల్‌టైమ్ కోర్సులు చేస్తూ కూడా, ఎనిమిది గంటల డ్యూటీ చేయడానికి ప్రయత్నిస్తుంటారు. అలా చేయడం కూడా ఉద్యోగ జీవితంలో ఒత్తిడికి కారణమవుతుంది. అలాంటి వారు రెండు పడవల మీద ప్రయాణం చేయడం మాని, కెరీర్ మీదే దృష్టి కేంద్రీకరించడం మంచిది. అప్పుడే వారు ప్రొఫెషనల్‌గా ఎదగగలరు.

సహజంగా అదుపు చేద్దాం

సాధారణంగా పిరియడ్స్ 28 రోజులకే అవుతుంది. ఇది మహిళలందరిలో ఒకేలా ఉండదు. శరీర తీరును బట్టి మార్పులుంటాయి. హార్మోన్ల ప్రభావం వల్ల కొంతమందిలో అధిక రక్తస్రావం, ఒళ్లునొప్పులు అధికంగా ఉంటాయి. వీటిని సహజంగా అదుపులో పెట్టొచ్చంటున్నారు నిపుణులు..

నొప్పులను తగ్గించేందుకు హాట్‌ప్యాక్‌లను వినియోగిస్తూంటాం. హాట్‌ప్యాక్‌ను పొత్తి కడుపుపై 20 నిమిషాల పాటు జరుపుతూ మర్దనా చెయ్యాలి. బ్లీడింగ్ ఎక్కువగా అవుతుంటే రోజులో ఇలా 2, 3 సార్లు చేస్తే తగ్గుతుంది.

శరీరంలో ఐరన్ తగ్గితే కూడా అధిక రక్తస్రావం అవుతుందని అధ్యయనాల్లో తేలింది. నెలసరిలో వైద్యుల సలహాతో ఐరన్ మాత్రలను తీసుకోవచ్చు. దాంతో కొంత వరకూ బ్లీడింగ్‌ను అదుపులో ఉంచొచ్చు.



ఓ కప్పు నీళల్లో ఓ అంగుళం ముక్క దాల్చిన చెక్కను వేసి కాచుకొని తాగాలి. ఒళ్ల నొప్పులను అదుపులో ఉంచడమే కాక బ్లీడింగ్‌ని కూడా తగ్గిస్తుంది. ఆ సమయంలో వచ్చే ఇన్ఫెక్షన్లనూ నిరోధిస్తుంది.

విటమిన్ సి అధికంగా ఉండే పండ్లను తీసుకోవాలి. అవి రోగనిరోధక శక్తిని పెంచుతూ, ఇనుముకు గ్రాహకాలుగా పని చేస్తాయి. తగినన్ని నీళ్ల తాగాలి. తేలికపాటి వ్యాయామాలు చేస్తూ, విశ్రాంతి తీసుకోవాలి.

సిట్ దర్యాప్తుపై అసంతృప్తి

(మొదటిపేజీ తరువాయి)

వారి వాదనలను సిట్ పరిగణనలోకి తీసుకోలేదని ప్రత్యేక కోర్టు ప్రస్తావించింది. 2008కి ముందు గుజరాత్ పోలీసు అధికారుల ఎదుట వారు ఇచ్చిన సాక్ష్యాలకు, ఆ తర్వాత సిట్ ఎదుట ఇచ్చిన సాక్ష్యాలకు మధ్య వైరుధ్యాలు ఉన్నాయని తెలిపింది.

'వాస్తవానికి గుర్తు తెలియని దుండగుల గుంపు మైనారిటీల ఆస్తులను ధ్వంసం చేసి, వారిని హతమార్చింది. నేరస్తులు కుట్రకు పాల్పడి, చట్టవిరుద్ధంగా గుమిగూడి, విధ్వంసానికి తెగబడ్డారన్న వాస్తవాన్ని నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైంది' అని కోర్టు తెలిపింది. ఈ కేసులో నిందితుల తరపు సాక్షులను కూడా దర్యాప్తు అధికారులు విచారించి ఉండాల్సిందనీ, కానీ అది జరగలేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. తన తరపున సాక్ష్యం చెప్పేందుకు కేంద్ర మంత్రి అమిత్ షాను అనుమతించాల్సిందిగా కొడ్నానీ అభ్యర్థించగా అందుకు న్యాయస్థానం అంగీకరించింది. నరోడా గామ్‌లో హింస జరిగిన సమయంలో కొడ్నానీ అక్కడ లేరని అమిత్ షా కోర్టులో సాక్ష్యం చెప్పారు. అయితే సాక్షులు చెప్పిన విషయాలలో వైరుధ్యాలు ఉన్నాయని, అవి విశ్వసనీయమైనవి కావని కోర్టు వ్యాఖ్యానించింది.

నరోడా గామ్ హింసపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు సిట్‌ను ఏర్పాటు చేసింది. అయితే ఈ కేసులో నిందితులుగా ఉన్న మొత్తం 67 మందినీ ప్రత్యేక కోర్టు గత నెల 20న నిర్దోషులుగా విడిచిపెట్టింది. వీరిలో బీజేపీకి చెందిన మాజీ మంత్రి మాయా కొడ్నానీ, వీహెచ్‌పీ మాజీ నాయకుడు జయదీప్ పటేల్, బజరంగ్‌దళ్ నేత బాబూ బజరంగీ కూడా ఉన్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ జిల్లా నరోడా గామ్ ప్రాంతంలో 2002 ఫిబ్రవరి 28న జరిగిన హింసాకాండలో 11 మంది సజీవదహనం అయిన విషయం తెలిసిందే.

విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు

(మొదటిపేజీ తరువాయి)

వెచ్చించి పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నామని మంత్రి తెలిపారు. దాదాపు రూ.150 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ ఒక్కొక్కరికి రెండు జతల యూనిఫారాలను పాఠశాల పున్ణ ప్రారంభం నాటికి అందించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు పున్ణ ప్రారంభమవుతున్నందున బడిబాట కార్యక్రమం ఏర్పాటు చేసి అందులోని స్థానిక శాసనసభ్యులను, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని మంత్రి సూచించారు. స్థానిక శాసన సభ్యులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో నోట్ పుస్తకాల పంపిణీ, పాఠ్య పుస్తకాల పంపిణీ, యూనిఫారాలను విద్యార్థులకు అందజేసే విధంగా కార్యక్రమాలను రూపొందించాలని అధికారులను కోరారు. శాసనసభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాఠశాలల్లో హాజరయ్యే సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులను కూడా ఆహ్వానించాలని మంత్రి సూచించారు. పాఠశాల పున్ణ ప్రారంభం రోజున పాఠశాలల్లో పండగ వాతావరణం కల్పించాలని తెలిపారు. మన ఊరు - మనబడి కార్యక్రమంలో చేపట్టిన పనులను జూన్ మొదటి వారంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన, అదనపు సంచాలకులు సిహెచ్ రమణకుమార్, లింగయ్య, జాయింట్ డైరెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హాజరు మినహాయింపు చెల్లింపు ఫీజు గడువు 10 : ఇంటర్ బోర్డు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాసే అభ్యర్థులు (కాలేజీలో చదవని వారు) హాజరు మినహాయింపు ఫీజును ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల పదో తేదీ వరకు తుది గడువు ఉందని ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణాధికారి జయప్రద బాయి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మే/జూన్‌లో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఆర్ట్స్, హ్యూమానిటీస్ సబ్జెక్టులకు హాజరయ్యే అభ్యర్థులు హాజరు మినహాయింపు ఫీజుల కింద రూ.500 ఆన్‌లైన్‌లో చెల్లించాలని హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు tsbie.cgg.gov.in వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని తిరిగి ప్రవేశపెట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎలాంటి చర్యలు, సమాలోచనలు చేయకుండా ఇష్టారాజ్యంగా సిలబస్‌లోని ముఖ్యాంశాలను తొలగించారని విమర్శించారు. వైరస్‌ల మధ్య సంబంధాలు, పోలికలను తెలుసుకోవడంతో పాటు కోవిడ్-19 ను ఎదుర్కోవడంలో ఈ సిద్ధాంతం ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. మోడీ చెప్పిన చప్పట్లు, దీపాలు వెలిగించడం, ఆవు మూత్రం పని చేయలేదనీ, జీనోమ్ సీక్వెన్సింగ్ ఉపయోగపడిందని గుర్తుచేశారు. సైన్సు పుస్తకాల రచయిత డాక్టర్ కేబి గోపాలం మాట్లాడుతూ పరిణామ సిద్ధాంతానికి, మతానికి మధ్య పంచాయతీ లేదని స్పష్టం చేశారు. డార్విన్ పరిణామ సిద్ధాంతం జీవశాస్త్రానికి ఒక పెద్ద రహదారి అని తెలిపారు. సిలబస్ హేతుబద్ధీకరణ పేరుతో పరిణామ సిద్ధాంత పాఠాన్ని పూర్తిగా తొలగించడం సహేతుకం కాదని పేర్కొన్నారు.

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు "ఆవర్తన పట్టిక - మూలకాల ధర్మాలు" పాఠ్యాంశం నుంచి తొలగించడం ఎంత ఆలోచనారహితమో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం తొలగించడం అంతే అనాలోచితమని విమర్శించారు.. సిలబస్ సమతుల్యత కోసం ఇలా చేశామంటే అంతకంటే హాస్యాస్పదమైన విషయం ఇంకొకటి ఉండదని ఎద్దేవా చేశారు. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు నిష్ణాతులతో చర్చించడం అవసరమని అభిప్రాయపడ్డారు.

ఇతర సంఘాలతో కలిసి ఉద్యమం

పరిణామ సిద్ధాంతాన్ని తిరిగి పాఠ్యపుస్తకాల్లో చేర్చేంత వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శ్రీనాథ్, కోశాధికారి రావుల వరప్రసాద్ స్పష్టం చేశారు. ఇతర శాస్త్రీయ సంఘాలతో కలిసి బహిరంగసభలు, పత్రికా సమావేశాలు తదితర రూపాల్లో పోరాటం చేస్తామనీ, అప్పటికీ ప్రభుత్వం దిగి రాకుంటే విద్యార్థులను భాగస్వాములను చేసి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చెకుముకి కన్వీనర్, రాష్ట్ర జన విజ్ఞాన వేదిక కార్యదర్శివర్గ సభ్యులు రాజా మాట్లాడుతూ సమతుల్యత కోసం అంటూ అసమతుల్యం చేశారని విమర్శించారు. "డార్విన్ పరిణామ సిద్ధాంతం జీవశాస్త్రంలో ఒక గొప్ప విజయం. ఏ మత ఛాందసులైతే మొదట దానికి వ్యతిరేకంగా పోరాడారో వారే నేడు దాన్ని అంగీకరించక తప్పలేదు. సైన్స్ నిజం. దాని పరిధిని పెంచాలే కానీ తగ్గించరాదన్నారు." ఈ సమావేశంలో జేవీవీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర రావు, ప్రధాన కార్యదర్శి లింగస్వామి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సాయిబాబు, అల్తాఫ్, రాజశేఖర్, సుబ్బారావు, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో షెడ్యూల్ ప్రకారం నవంబర్, డిసెంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధత, ఓటరు జాబితా సంబంధిత అంశాలపై చర్చించారు. అందుకనుగుణంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి, సన్నాహాలు ప్రారంభించినట్టు ఆయన వివరించారు. జూన్ నెలలో మొదటి విడత ఈవీఎంల చెకింగ్ చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గస్థాయిలో, జిల్లా కేంద్రంలో ఓటర్ నమోదుపై వారానికొసారి సమీక్షించాలని అధికారులను ఆదేశించారు.

గతంలో వివిధ కారణాలతో తొలగించిన ఓటర్ పేర్లను మరోసారి పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. మునుగోడు ఉప ఎన్నికలో 48 గంటలకు ముందు ప్రచారం ముగిసినప్పటికీ, ఆ నియోజకవర్గానికి సంబంధం లేని నాయకులు చాలా మంది అక్కడే ఉన్నారనీ, రాబోవు ఎన్నికల్లో అటువంటి పరిస్థితులు రాకుండా చూడాలని కాంగ్రెస్ ఉపాధ్యక్షులు జి. నిరంజన్ కోరారు. అటువంటి పరిస్థితులు పునరావృత్తం కాకుండా చూస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

నీరాకేఫ్ ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

నీరా కేఫ్‌ను ప్రారంభించుకున్నాం. తాటి చెట్టు ప్రమాదాలను నివారించడానికి 'రక్షిత మోకు' కోసం ఐఐటీ పరిశోధనలు చేస్తున్నది. త్వరలోనే ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం' అని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన నీరాకేఫ్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిపి బుధవారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన, ప్రకతి సిద్ధమైన నీరా, అనుబంధ ఉత్పత్తులైన తేనె, బూస్ట్, షుగర్, బెల్లం విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గీత వృత్తి ప్రోత్సాహానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారని అన్నారు. రైతు బీమా మాదిరిగా గీత కార్మికుల కోసం రూ.5లక్షల బీమాను కల్పిస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా 50 ఏండ్ల వయస్సు పైబడిన, అర్హులైనవారికి దాదాపు లక్షమంది గీత కార్మికులకు ప్రతి నెల రూ.2016 పెన్షన్లు అందిస్తున్నామని చెప్పారు. మద్యం దుకాణాల్లో గౌడ సామాజిక వర్గానికి 15శాతం, ఎస్సీ, ఎస్టీలకు 15శాతం రిజర్వేషన్లు కల్పించటం సాహసోపేతమైన, చారిత్రాత్మక నిర్ణయమని వివరించారు. గీత వృత్తికి ప్రోత్సాహం కోసం హరితహారంలో భాగంగా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 4.20 కోట్ల తాటి, ఈత మొక్కలు నాటామని పేర్కొన్నారు. తాటి, ఈత చెట్లను అక్రమంగా నరికితే చట్టపరమైన కఠిన చర్యలు, కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు.

తాటి, ఈత చెట్ల రెంటల్‌ను శాశ్వతంగా రద్దుతోపాటు గీత కార్మికుల పాత బకాయిలు రూ.8కోట్లను రద్దు చేశామని గుర్తు చేశారు. గీత కార్మికులు ఎంతో సాహసోపేతంగా గీత వత్తిని కొనసాగిస్తున్నారని వెల్లడించారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహిస్తున్నామని, ఆయన విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పాపన్న నిర్మించిన కోటలను పరిరక్షించి వాటిని పురావస్తు కేంద్రాలుగా, పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే భువనగిరి కోట, జాఫర్‌ఘడ్ కోట, కిలాషాపూర్ కోట, తాటికొండ కోట, కరీంనగర్ జిల్లాలోని సైదాపూర్ మండలం పాపన్నపేటలో ఉన్న సుమారు 400 ఎకరాల కోటను గ్రానైట్ మాఫియా నుండి పరిరక్షించామని, ఆ స్థలాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు.

గీత వత్తిలో ప్రమాదవశాత్తు జరిగే మరణాలను నివారించేందుకు తాటి చెట్టు ఎక్కే అధునాతన యంత్రాల (రక్షిత మోకు) రూపకల్పన కోసం ఐఐటీ లాంటి సాంకేతికత సంస్థల సహకారంతో పరిశోధనలు చేస్తున్నామని చెప్పారు. గీత కార్మికుల కుటుంబాలలో వెలుగులు నింపాలనే లక్ష్యంతో గీత కార్మికుల కోసం 'గీత కార్మికుల భీమా'ను ప్రవేశపెట్టినందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్ర పటాలకు నీరాకేఫ్ ముందు 'నీరాభిషేకం' చేశారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి మాజీ చైర్మెన్ స్వామిగౌడ్ మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, గంగాధర్‌గౌడ్, రాష్ట్ర చైర్మెన్లు డాక్టర్ ఆంజనేయగౌడ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ ఎండి మనోహర్, తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు అజయ్‌కుమార్, డేవిడ్ రవికాంత్, ఖురేషి, దత్తరాజ్‌గౌడ్, చంద్రయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛలో 161వ స్థానం

(మొదటిపేజీ తరువాయి)

రేడియో (ఏఐఆర్) నెట్‌వర్క్ నుంచి అన్ని రేడియో స్టేషన్లలోనూ వార్తలు ప్రసారమవుతాయి. ఈ కంపెనీలకు, మోడీ ప్రభుత్వానికి మధ్య బహిరంగంగా పరస్పర ప్రయోజనకరమైన సంబంధాలు ఉన్నట్టు తెలుస్తున్నది. ఇది ఇంకా కొనసాగుతోంది. సుమారు 80 కోట్ల మంది అనుసరించే 70 మీడియా నెట్‌వర్క్‌లు అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ గ్రూప్ అధీనంలో ఉన్నాయి. ఇటీవల ఎన్‌డీటీవీని అదానీ స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. మోడీ అధికారం చేపట్టిన అనంతరం పలువురు జర్నలిస్టులు వేధింపులను ఎదుర్కొంటున్నారు. రాజద్రోహం, పరువునష్టం, కోర్టు ధిక్కారం, జాతీయ భద్రతా చట్టాలతో పాటు తిరుగుబాటుదారులన్న ముద్ర వేస్తున్నది. అలాగే మీడియాలో ఉన్నత కులాలకు చెందిన పురుషులు జర్నలిజంలో సీనియర్ పదవులను కలిగి ఉండటం లేదా మీడియా ఎగ్జిక్యూటివ్‌లుగా ఉంటున్నారు. ఇది మీడియా కంటెంట్‌లో ప్రతిబింబిస్తుంది. సాయంత్రం వేళల్లో వచ్చే ప్రధాన చర్చా కార్యక్రమాల్లో పాల్గనేవారిలో 15శాతం కంటే తక్కువ మంది మహిళలు ఉన్నారు. భారత్‌లో జర్నలిస్టుల భద్రతకు ఎలాంటి చర్యలూ లేవు. ప్రతి ఏడాది సగటున నలుగురు జర్నలిస్టుల్లో ముగ్గురు హత్యకు గురవుతున్నారు. మీడియా రంగానికి ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన దేశాల్లో భారత్ కూడా ఒకటని ఆర్ఎస్ఎఫ్ స్పష్టం చేసింది.

నేడు బీఆర్ఎస్ జాతీయ కార్యాలయం ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

కెసిఆర్ మధ్యాహ్నం 1:05 గంటలకు రిబ్బన్ కట్ చేసిన తర్వాత పార్టీ జెండా ఎగురవేసి.. నూతన భవనంలోకి వెళ్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జాతీయ కమిటీలో ఒకటి, రెండు నియామకాల ఉత్తర్వులపై కేసీఆర్ సంతకం చేసే అవకాశాలున్నట్టు సమాచారం. కాగా భవన నిర్మాణ పనులను గురువారం మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎంపి జోగినపల్లి సంతోష్ కుమార్‌లు పరిశీలించారు. గత నాలుగు రోజులుగా ఢిల్లీలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఎక్కువ హడావిడిలేకుండా కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్టు నేతలు చెబుతున్నారు.

కాగా, 2021 సెప్టెంబర్ 2న వసంత్ విహార్‌లో బీఆర్ఎస్ పార్టీకి కేటాయించిన స్థలంలో ఆఫీసు భవనానికి కేసీఆర్ భూమి పూజ చేశారు. అయితే కేవలం 20 నెలల్లో పార్టీ కార్యాలయ పనులు పూర్తయ్యాయి.

వాతావరణం కారణంగా సీఎం ప్రయాణంలో మార్పు...!

ఢిల్లీలో భారీ వర్షం కారణంగా సీఎం కేసీఆర్ బుధవారం ఢిల్లీ పర్యటన రద్దు అయినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. వాస్తవానికి బుధవారం సాయంత్రం కేసీఆర్ ఢిల్లీకి రావాల్సి ఉంది. కానీ, ఢిల్లీలో వాతావరణ సహకరించకపోవడంతో గురువారం ఉదయానికి ఆయన ప్రయాణాన్ని మార్చుకున్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

కేజీబీవీ సిబ్బంది బదిలీలకు 6 నుంచి దరఖాస్తుల స్వీకరణ

- విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నడుస్తున్న కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ)ల్లో తాత్కాలిక పద్ధతిపై పనిచేస్తున్న సిబ్బంది బదిలీల ప్రక్రియ ఈనెల ఆరో తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేజీబీవీల్లో పనిచేస్తున్న స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీఆర్టీలు, సీఆర్టీలు, ఏఎన్ఎంలు, అకౌంటెంట్లు, పీఈటీలు ప్రస్తుతం ఉన్న కేజీబీవీ నుంచి ఇతర కేజీబీవీలకు మార్పు కోరే సిబ్బంది నుంచి ఆన్‌లైన్‌లో ఈనెల ఆరు నుంచి తొమ్మిదో తేదీ వరకు దరఖాస్తు చేయాలని కోరారు. ఈ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించిన సమగ్ర వివరాలు, సూచనలు, మార్గదర్శకాలు https://transfers.cdse.telanganag.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచామని వివరించారు.

సీఐకి శుభాకాంక్షలు తెలిసిన జీవన్ కుమార్‌రెడ్డి



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీఆర్ఎస్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మొగుళ్ళ జీవన్ కుమార్‌రెడ్డి బుధవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలవతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు

- బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ గౌడ్



నవతెలంగాణ - చైతన్యపురి

రైతు బీమా తరహాలో కల్లుగీత కార్మికులకు ఐదు లక్షల బీమా అందించేందుకు నిర్ణయం తీసుకున్న సీఎం కేసీఆర్‌కు ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. కల్లు గీస్తూ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయే గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షలు ఆర్థిక సాయం అందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. గీత కార్మికులు ఆర్థికంగా నిలదొక్కునందుకే నెక్లెస్ రోడ్‌లో నీరాకేఫ్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. త్వరలో అన్ని జిల్లాల్లో ఇలాంటి కేఫ్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని పేర్కొన్నారు.

నిరుద్యోగ నిరసన సభను

విజయవంతం చేయాలి

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 8న నిర్వహించనున్న నిరుద్యోగ నిరసన సభను విజయవంతం చేయాలి అని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి కోరారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన బుధవారం ఇందిరా భవన్ లో ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

మతతత్వ రాజకీయాలను తరమికొడదాం

- ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేర్లకంటి శ్రీకాంత్

నవతెలంగాణ - హయత్‌నగర్

ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న మత తత్వ రాజకీయాలను తరమికొడదామనిఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేర్లకంటి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమైక్య(ఏఐవైఎఫ్) 64వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం హయత్‌నగర్‌లో ఆయన ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత జాతీయ సమగ్రత కోసం పాటుపడాలన్నారు. దేశం కోసం ప్రాణార్పణ చేసిన భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు ఆశయ సాధన కోసం 1959 మే 3వ తేదీన అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) ఢిల్లీలో ఆవిర్భవించిందని తెలిపారు. 18 ఏండ్లు నిండిన యువతకు ఓటు హక్కు కోసం పోరాడి విజయం సాధించిన ఏకైక యువజన సంఘం ఏఐవైఎఫ్ అని ఉద్ఘాటించారు. యువతను పెడదోవ పట్టిస్తున్న మద్యపానం, అశ్లీల సాహిత్యం, అర్ధనగ్న సినిమాలకు వ్యతిరేకంగా 'క్విట్ అశ్లీలత' పేరుతో పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగిస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా స్థానిక యువతకు 50% ఉపాధి అవకాశాలను కల్పిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ కాషాయ భావజాల విధానాలను పోకడలను ప్రజలపై రుద్దడానికి తీవ్ర దుష్ట ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఈ చర్యలు శాస్త్రీయ దక్పథం కలిగిన నేటి యువత మత తత్వ రాజకీయాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పోలోజు లక్ష్మణాచారి, హయత్ నగర్ మండల అధ్యక్షుడు దేవేందర్, స్థానిక నాయకులు రమేశ్, శ్రీకాంత్ వెంకటేశ్, శోభన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న మంత్రి



నవతెలంగాణ - ఘట్కేసర్

మండల పరిధిలోని ముత్వేల్లిగూడలో ప్రసన్న ఆంనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, కొర్రెములలో నిర్మించిన సాయినాథ ఆలయ పూజ కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆలయాల్లో కొంత సమయం గడిపితే మానసిక ప్రశాంతత లభిస్తుం దన్నారు. ముత్వేల్లిగూడలో ప్రసన్న అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన తర్వాత మోటకొండ భద్రారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కొర్రెములలో బాబాకు పంచామృతాలతో అభిషేకం, మంగళ హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు కొంతం వెంకట్ రెడ్డి, ఓరుగంటి వెంకటేష్, మాజీ వైఎస్ఎంపీపీ గ్యార లక్ష్మయ్య, నాయకులు కొంతం సత్తిరెడ్డి, మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ బైనగారి నాగరాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, ప్రధానకార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి, విష్ణుగౌడ్, దుర్గరాజుగౌడ్, ఆంజనేయులు, స్వామి, బాబు, మహేంద్రచారి, శ్రీనివాస్ గౌడ్, రమేష్ ఆనంద్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు ఆహ్వానం



నవతెలంగాణ - బడంగ్‌పేట్

ఈ నెల 14, 15తేదీల్లో మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్, బాలాపూర్‌లో నిర్వహించే బీరప్ప పండగ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉత్సవాల కమిటీ సభ్యులు బీజేపీ రాష్ట్ర నాయకుడు కొలన్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నరె గోపాల్, హరీశ్, రాజు, అనిల్, నాగేశ్వర్‌లు ఉన్నారు.

నేటి నుంచి బాలాజీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



నవతెలంగాణ - ఘట్కేసర్

మండల పరిధి వెంకటాపూర్‌లోని శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు నేటి నుండి 8వ తేది వరకు కొనసాగుతనాయని ఆ ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఉదారి వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీర్వాదం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు బుర్ర వెంకటేష్, నేరేడు శ్రీనివాస్, అశోక్, దేశం బాలరాజ్, నరసింగరావు, శివరాజ్ హరీశ్, నీరుడి లింగం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ అధ్యక్షులు కళ్యాణ్ చక్రవర్తికి సన్మానం



నవతెలంగాణ- సంతోష్ నగర్

చంపాపేట్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు చీర శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ యూత్ నూతన అధ్యక్షులు ముద్ద కళ్యాణ్ చక్రవర్తిని శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఓరుగంటి వెంకటేష్ గౌడ్, బీసీ సెల్ అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కొత్తపేట ప్రభాకర్, జంగయ్య, శేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సామ్ రెడ్డి సురేందర్ రెడ్డి, విద్యాసాగర్, నిషికాంత్ రెడ్డి, మహిళా నాయకులు రమాదేవి,సరోజ, లక్ష్మీ యువ నాయకులు గండికోట శ్రీనాథ్, టిల్లు యాదవ్,సతీష్,సర్వేశ్,చీర సాయినాథ్, సామ్రెడ్డి అరవింద్ రెడ్డి,చైతన్య, జయంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

శివ రామ క్షేత్ర ఆలయ కమిటీ చైర్మెన్‌గా రాజశేఖర్ రెడ్డి



నవతెలంగాణ -ఎల్బీనగర్

జానకి ఎన్ కేవ్ లో శివరామ క్షేత్ర ఆలయ కమిటీ చైర్మన్ గా మద్ది రాజశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ గా నరెడ్ల సుభాష్ చంద్రరెడ్డి, కమిటీ మెంబర్ గా దొడ్ల వెంకట్ రెడ్డిలు బుధవారం ఆలయ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆలయాల అభివద్ధికి కషి చేస్తానని అన్నారు. శివరామక్షేత్ర ఆలయ అభివద్ధికి దోహద పడతానని తెలిపారు. అనంతరం సతీమణి మద్ది సబిత రాజశేఖర్ రెడ్డి గాయత్రినగర్ డివిజన్ కార్పొరేటర్ మాట్లాడుతూ ఆలయ అభివద్ధికి తన వంతుగా రూ. ఒక లక్షా పదకొండు వేల విరాళం అందజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఎం సతీష్, కె .రవీంద్రనాథ్, ఆర్ రుక్మ రెడ్డి, కేవీనర్ ఆంజనేయులు, జగదీశ్వర్,జనార్దన్, అరునశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సామాన్య ప్రజల జీవిత స్థితిగతులను

చిత్రంగా మలిచిన గొప్ప దర్శకుడు దాసరి



- టూరిజం మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్త

నవతెలంగాణ -నాగోల్

సామాన్య ప్రజల జీవిత స్థితిగతులను చిత్రంగా మలిచిన గొప్ప దర్శకుడు దాసరి నారాయణరావు అని రాష్ట్ర పర్యాటక అభివద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఐవీఎఫ్ జాతీయ కార్యదర్శి ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. హైదరాబాద్ నగరంలో ఆకతి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన దాసరి నారాయణరావు 77వ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కథ, స్క్రీన్ ప్లే, మాటలు, పాటలు, నిర్మాత, దర్శకుడుగా సింగిల్ కార్డు రావడం అది దాసరి నారాయణరావుతోనే ప్రారంభమైందని తెలిపారు. అనంతరం ప్రముఖ సినీ దర్శకుడు చంద్ర మహేష్ మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్రలోనే అత్యధికంగా 151 చిత్రాలకు దర్శకత్వం వహించడమే కాకుండా ఎంతో మంది శిష్యులను కలిగిన ఏకైక దర్శకుడు దాసరి నారాయణరావు కొనియాడారు. తర్వాత సినీ దర్శకులు పీసీ ఆదిత్య ,చంద్ర మహేష్ లను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆకతి సంస్థ నిర్వాహకులు సుధాకర్,మథర్ తెరిస్సా చారిటబుల్ సొసైటీ అధ్యక్షులు చేపూరి శంకర్, రెడీ టూ సర్వర్ ప్రతినిధి శంకర్, పలువురు సినీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితంలేని వృద్ధుడిని చేరదీసిన 'మాతృదేవోభవ'



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మతిస్థిమితంలేని 80 ఏండ్ల వృద్ధుడిని మాతృదేవోభవ అనాథ ఆశ్రమం చేరదీసినట్టు ఆ ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు గట్టు గిరి తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ పరిధిలోని ఎంసీఆర్ కాలనీలో ఓ వృద్ధుడు 3 రోజుల నుండి మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడని స్థానికులు సమాచారం అందించారు. దీంతో ఆశ్రమ వ్యవస్థాపకుడు గట్టు గిరి బుధవారం అక్కడికి చేరుకొని అతని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అతని పేరు హనుమంతరావు అని, బడంగ్‌పేట్, మీర్‌పేట్, అల్మాస్ గూడలో అతని ఇల్లు ఉందని చెప్పినట్టు గిరి తెలిపారు. మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మాతదేవోభవ ఆశ్రమంలో వృద్ధునికి ఆశ్రయం కల్పించారు. ఈ వృద్ధుడిని గుర్తిస్తే పోలుసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. అనంతరం గిరిని మీర్‌పేట్ పోలీస్ యంత్రాంగం అభినందించారు. ఈ కార్యక్రమంలో సతీష్, సందీప్ తదితరులు ఉన్నారు.

బ్రిలియంట్‌లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

అబ్దుల్లాపూర్ మెట్‌లోని బ్రిలియంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జేఎన్ఎఫ్ఏ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్ కిషోర్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బ్రిలియంట్ విద్యాసంస్థలు ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిందని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలు, సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు విద్య బోధన అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మన్మోహన్ యాదవ్, ఎస్ఐలు కిషన్ నాయక్, వెంకట్రామిరెడ్డి, బ్రిలియంట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.షేక్ రుస్తుం, బ్రిగ్ డైరెక్టర్ డాక్టర్ పేనియర్ పొల్లాస్, బ్రిగ్ ఫార్మసీ ప్రిన్సిపల్ సీహెచ్ కంట్లం, కేఎన్ఆర్ఆర్ ప్రిన్సిపల్ నరేంద్రా కుమార్, బీజీటీఐ డైరెక్టర్ రగోతం రెడ్డి, ఏట వెంకటేశ్వర్ రెడ్డి, హెచ్ఓడీ, ప్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం

నూతన కార్యవర్గానికి సన్మానం



నవతెలంగాణ - ఉప్పల్

రామంతపూర్ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి ఘనంగా సన్మానించినారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సంఘం అభివద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బండారు వెంకటరావు, సంఘం అధ్యక్షుడు చిక్క సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గుండ్ల రవీందర్ కుమార్, కోశాధికారి చింతల సత్యనారాయణ, సమన్వయ కమిటీ చైర్మన్ రామ్ నర్సయ్య, వనంయాదగిరి, కొండ కష్ణమూర్తి, వర్గాల పెంటయ్య, ఉపాధ్యక్షులు చెన్న వీరేశం, గంజి వెంకటేష్, తిరందాస్ వెంకటేష్, సిరిపురం ఉపేందర్, సంయుక్త కార్యదర్శి రాపోలు శేఖర్, ఉలుగొండ నారాయణదాసు, సిరిశాల విజయ్ ప్రకాశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చింతకింది ప్రవీణ్, సంగిశెట్టి యాదగిరి, హనుమాన్ల నరసింహ, కమిటీ సభ్యులందరూ పాల్గొన్నారు.

నీరా కేఫ్ ప్రారంభోత్సవానికి

మహేశ్వరం గౌడ కులస్తులు



నవ తెలంగాణ - చైతన్యపురి

నెక్లెస్ రోడ్ లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన నీరా కేఫ్ ప్రారంభోత్సవానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వీరమల్ల రామ్ నర్సింహ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం మహేశ్వరం నియోజకవర్గ గౌడ కులస్తులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నర్సింహ గౌడ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గౌడ్ కులస్తులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు కషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమానికి గునగంటి లింగం గౌడ్, బజారు కిరణ్ గౌడ్, జిన్నారం వెంకటేష్ గౌడ్, రాజశేఖర్ గౌడ్, విజయ భాస్కర్ గౌడ్, సందీప్ గౌడ్, భిక్షపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన మేయర్ వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ - బోడుప్పల్

నగరాలను పరిశుభ్రంగా ఉంచే పారిశుధ్య కార్మికుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం రూ.వెయ్యి వేతనం పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బుధవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి



డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులతో కలిసి ఆయన పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మేయర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌కు పారిశుధ్య కార్మికులు రుణపడి ఉంటారని అన్నారు.

అతిపెద్ద సమ్మర్ ఫెస్ట్‌ని ప్రకటించిన శాంసంగ్

నవతెలంగాణ-హైదరాబాద్

శాంసంగ్ భారతదేశం చాలా నమ్మకమైన విని యోగదారు ఎలక్ట్రానిక్స్, స్మార్ట్‌ఫోన్స్ బ్రాండ్ దాని అతిపెద్ద సమ్మర్ ఫెస్ట్ని ప్రకటిం చింది. ఫాబ్ గ్రాబ్ ఫెస్ట్, 2023. ఈ ఫాబ్ గ్రాబ్ ఫెస్ట్ సమయంలో మునుపెన్నడూ లేని విధంగా శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ లోని విశాలమైన పరిధిపైనే కాకుండా గెలాక్సీ స్మార్ట్ ఫోన్స్, ట్యాబ్లెట్స్, ల్యాప్టాప్స్, యాక్సెసరీస్, వేరబుల్స్పైన కూడా మెగా ఆఫర్స్, ఆసక్తికరమైన క్యాష్బ్యాక్స్ పొందవచ్చు. ఈసందర్భంగా డీ2సీ శాంసంగ్ ఇండియా సీనియర్ డైరెక్టర్ సుమిత్ వాలియా మాట్లాడుతూ... గడచిన ఏడాది విజయవం తమైన ఫాబ్ గ్రాబ్స్ ఫెస్ట్ తరువాత, తాము ప్రతి వేసవికి వినియోగదారులకి తమ అతిపెద్ద ఫెస్టివ్ అమ్మకాన్ని, శాంసంగ్. కమ్, శాంసంగ్ ఎక్స్ క్లూసివ్ దుకాణాలు, శాం సంగ్ షాప్ యాప్ అంతటా తీసుకురావాలని కోరుకుంటున్నామన్నారు. ఫాబ్ గ్రాబ్ ఫెస్ట్ 2023 ద్వారా తాము తమ వినియోగదారులకి ఉత్తమమైన డీల్స్, ఇంతకు- ముందెన్నడూ లేని ధర నిర్ణయం, క్యాష్బ్యాక్, ప్రయోజనాలను వారికిష్టమైన శాంసంగ్ ప్రాడక్ట్ పైన ఆఫర్ చేస్తామన్నారు.

ఇంటిలో అలెక్సా వాడటంతో పిల్లల కమ్యూనికేషన్ నైపుణ్యాలు వృద్ధి

నవతెలంగాణ-హైదరాబాద్

వేసవి సెలవులంటేనే, పాఠశాల చదువుల నుంచి ఉపశమనం, మనసారా ఆడుకునేందుకు అనువైన సమయం చాలామంది పిల్లలకు! వేసవి సెలవుల్లో అపారమైన సమయం చిన్నారులకు లభిస్తుంటుంది. అమె జాన్ కోసం మార్చి 2023లో కాంటార్ నిర్వహించిన అధ్యయనం వెల్లడించిన దాని ప్రకారం, అధ్యయనంలో పాల్గొన్న 95శాతం మందికి పైగా తల్లిదండ్రులు, ఇంటిలో అలెక్సాను వాడితే అది తమ పిల్లల కమ్యూనికేషన్ నైపుణ్యం మెరుగుపరచడంలో సహాయపడుతుందని చెబుతున్నారు. ఈ అధ్యయనం మరింతగా వెల్లడించే దాని ప్రకారం, 90శాతంకు పైగా తల్లిదండ్రులు, అలెక్సాతో తమ చిన్నారులు మానసికంగా చురుగ్గా ఉండటంతో పాటుగా నూతన అంశాలను అభ్యసించడం, మరింత స్వతంత్యంగా ఉండటం అలవడుతుందంటున్నారు. ఈసందర్భంగా అమెజాన్ డెవిసెస్ ఇండియా డైరెక్టర్ అండ్ కంట్రీ మేనేజర్ పరాగ్ గుప్తా మాట్లాడుతూ... చిన్న పిల్లలు కలిగిన తల్లిదండ్రులు అలెక్సాను చురుగ్గా వాడుతున్నారన్నారు. నర్సరీ పద్యాల నుంచి ఇంటరాక్టివ్ గేమ్స్, అక్బర్, బీర్బల్ కథలు నుంచి చరిత్ర గురించిన ప్రశ్నలు, సైన్స్, జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు, పదాల అర్థాల గురించి అలెక్సా వాడుతున్నా రన్నారు. అలెక్సా అభ్యాసం, వినోదానికి అత్యున్నత వనరుగా నిలుస్తుందన్నారు.

రోడ్డు మధ్యలో ఉన్న రాక్‌ను తొలగించిన అధికారులు

నవతెలంగాణ-మల్కాజ్‌గిరి

నియోజకవర్గంలోని గౌతంనగర్ డివిజన్‌లో రోడ్డు మధ్యలో ఉన్న రాక్‌ను ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతారావు ఆదేశాల మేరకు కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పర్యవేక్షణలో బుధవారం అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు మధ్యలో రాక్ ఉండడం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడినాయని, ప్రజల మెరుగైన ప్రయాణం కోసం రోడ్డు మధ్యలో ఉన్న రాక్‌ను తొలగిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, వర్క్ ఇన్స్‌పెక్టర్ నరేందర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బూరుగు మారుతీరావును అభినందించిన మర్రి రాజశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-నాచారం

కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా కార్మిక నాయకుడు బూరుగు మారుతీ రావుకు శ్రమశక్తి అవార్డు అందుకున్న సందర్భంగా ఆయనకు బీఆర్ఎస్ మల్కాజిగిరి ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి బుధవారం అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో కార్మికుల సమస్యలపై నిస్వార్థంగా సేవలు అందించినందుకు శ్రమశక్తి అవార్డు అందుకోవడం పట్ల వారు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక రంగంతో పాటు ప్రయివేటు విద్యాసంస్థల్లో నాన్ టీచింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించడంలో మారుతీరావు ఎనలేని కషి చేశారన్నారు. కార్మిక నాయకుడిగా సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం శ్రమశక్తి అవార్డు అందించిందని తెలిపారు. కార్మిక వర్గ ఐక్యతకు భవిష్యత్తులో మరింత కషి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డికి మారుతీ రావు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుంటి కష్ణ, రమేష్, మధుసూదన్ రెడ్డి, సాయి కుమార్, జయరాజ్ పాల్గొన్నారు.



పేదల సంక్షేమానికి అన్ని రకాలుగా ప్రభుత్వం కృషి

- మంత్రి చామకూర మల్లారెడ్డి
- మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అన్ని రకాలుగా అండగా ఉంటూ వారి సంక్షేమానికి నిత్యం కృషి చేస్తోందని, ఈ విషయంలో ఇప్పటికే చేపట్టిన అభివద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలిచి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉందని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ ఛైర్మెన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్, అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి ,జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈవో) దేవ సహాయంతో పాటు జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో జిల్లా పరిషత్ సమావేశాన్ని నిర్వహించగా మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి, వారి సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించి అందజేస్తోందని తెలిపారు. అర్హులైన వారికి ప్రభుత్వ ఉత్తర్వులు 58, 59 ప్రకారం భూములకు సంబంధించి పట్టాలు అందజేయడం జరిగిందని, ప్రస్తుతం వారు సొంత ఇండ్లు కలిగిన వారిగా మారారని మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూస్తూ ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ ఛైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. జిల్లా అభివద్ధికి అన్ని శాఖల అధికారులు కృషి, ప్రజాప్రతినిధుల సమన్వయంతో అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేయాల్సిందిగా కోరారు. జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు ఇదేతీరున అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలో చేపడుతున్న ఆయా కార్యక్రమాలపై సమావేశంలో ఆయా శాఖలు చేపడుతున్న కార్యక్రమాలు, వివిధ అంశాలపై జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు సంబంధిత అధికారులను ప్రశ్నించగా సంబంధిత శాఖల అధికారులు సమాధానాలిచ్చి అందుకు సంబంధించి పూర్తి వివరాలను వివరించారని జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ సమావేశంలో ఆయా శాఖలకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత శాఖల అధికారులు సత్వరమే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ విషయంలో వెంటనే స్పందించాలని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాను అభివృద్ధిలో ముందుస్థానంలో ఉండటం ఎంతో ఆనందంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. మున్ముందు కూడా ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశానికి ముందు జిల్లా కలెక్టర్‌గా అమోయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా జిల్లా పరిషత్ సమావేశం నిర్వహిస్తున్నందున వారికి జిల్లా పరిషత్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, మూడుచింతపల్లి జెడ్పీటీసీ సభ్యులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు తదితరులు పుష్పగుచ్చాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సమావేశంలో జిల్లాలోని జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వాలు

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నందికంటి శ్రీధర్



నవతెలంగాణ- నేరేడ్‌మెట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు నందికంటి శ్రీధర్ అన్నారు. బుధవారం ఆయన వినాయకనగర్ డివిజన్ లో మసీదు గల్లీలో చేపట్టిన 'హాత్ సే హాత్ జోడో యాత్ర' లో ముఖ్య అతిథిగా హజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ 500 లకే గ్యాస్ సిలిండర్ , 80 గజాల స్థలమున్న పేదలకు ఇండ్ల నిర్మాణం కోసం రూ 5 లక్షలు రుణ సహాయం, అర్హులైన నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు, ఆరోగ్యశ్రీ రూ. 5 లక్షల వరకు అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ వినాయక్ నగర్ డివిజన్ అధ్యక్షులు సంతోష్ ముదిరాజ్, బీ బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, మీడియా కన్వీనర్ గుత్తి రామచందర్, ఎంఆర్ శ్రీనివాస్ యాదవ్, నరసింహ గౌడ్, హనుమంతు, కీర్తి గణేష్, దుర్గ సాయి, యు. సాయికుమార్, అమర్నాథ్, బాలకష్ణ, ఆశ, సాయిరాం, జెకె సాయి, గిరి యాదవ్, అశోక్ యాదవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుడికి రాగిడి లక్ష్మారెడ్డి పరామర్శ

నవతెలంగాణ-నాచారం

కాంగ్రెస్ మల్లాపూర్ డివిజన్ సీనియర్ నాయకుడు ఉస్మాన్ తల్లి మరణించగా.. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉస్మాన్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. కష్టాల్లో ఉన్న పార్టీ కార్యకర్తలను ఓదార్చి మనోధైర్యం అందించి వారిని ఆదుకునేందుకు ఎప్పుడూ ముందుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వరకాల నరసింహారెడ్డి, వంగేటి సంజీవరెడ్డి, అంజయ్య, వంజరి



సంతోష్, రిజ్వాన్, మల్లికార్జున్, నవీన్, జహీరుద్దీన్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మతతత్వ విద్వేషాలను యువత రూపుమాపాలి

- ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సత్య ప్రసాద్
- ఏఐవైఎఫ్ 64వ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-కాప్రా

నేటి యువత జాతీయ సమగ్రత కోసం పాటుపడాలని, మతతత్వ విద్వేషాలు రూపుమాపాలని అఖిల భారత యువజన సమాఖ్య మేడ్చల్ జిల్లా అధ్యక్షులు టి.సత్య ప్రసాద్ అన్నారు. ఏఐవైఎఫ్ 64వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ ముందు ఏర్పాటు చేసిన జెండాను సత్య ప్రసాద ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం ఏఐవైఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తున్నదని అన్నారు. నేటి పాలకులు స్వార్థ రాజకీయాల కోసం యువతను చెడు మార్గంలో పయనించేలా చేస్తున్నారని, సమాజ బాధ్యతను నేర్పకుండా ...సమాజం అభివృద్ధి సాధించదని అన్నారు. ఈ తరుణంలోనే ఏఐవైఎఫ్ దేశ వ్యాప్తంగా పౌరులందరికి సమాన విద్య అందించాలని, వైద్యం అందించాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే నినాదంతో ఉద్యమిస్తున్నదని తెలిపారు.బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో మతోన్మాదం హెచ్చుమీరిందన్నారు. బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ కాషాయ భావజాల విధానాలను, పోకడలను ప్రజలపై రుద్దడానికి తీవ్ర దుష్ట ప్రయత్నాలు చేస్తున్నారని, ఈ చర్యలను శాస్త్రీయ దక్పథం కలిగిన భారత పౌరులు తిప్పికొట్టాలని వారు పిలుపునిచ్చారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించి, అమలు చేయాలని కోరారు. అలాగే ప్రయివేటు రంగాలలో రిజర్వేషన్లు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు సల్మాన్ బైగ్, కాసర్ల నాగరాజు, జిల్లా సమితి సభ్యులు ఇమ్రాన్ ఖాదీర్, యాస్మిన్, కిరణ్మయి సింధు, పావని, సందీప్,కిశోర్, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.



లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా చర్యలు

- కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్

నవతెలంగాణ-కాప్రా



గత కొద్ది రోజులుగా అకస్మాత్తుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలుస్తూ, డ్రయినేజీలు పొంగడం వంటి సమస్యల దష్ట్యా డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో అధికారులతో కలిసి కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ చర్యలు చేపట్టారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండ తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఒక్కసారిగా వచ్చిన వాతావరణ మార్పులు చల్లనిగాలుల వల్ల జలుబు, విషజ్వరాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి కనుక ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని కాలనీ వాసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, హైదారాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ డైరెక్టర్ స్వామి, డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, వాటర్ వర్క్స్ మేనేజర్ వేణుగోపాల్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ విలీనం కోసం పోస్ట్ కార్డుల ఉద్యమం



నవతెలంగాణ-కంటోన్మెంట్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ సివిల్ ప్రాంతాల జీహెచ్ఎంసీలో విలీనం కోసం కంటోన్మెంట్ వికాస్ మంచ్ పోస్ట్ కార్డుల ఉద్యమాన్ని మొదలుపెట్టింది. బుధవారం రసూల్‌పూరాలో ఈ కార్యక్రమాన్ని ప్రతినిధులు గడ్డం ఏబుల్ సంకి రవీందర్ లు ప్రారంభించారు. ప్రధాని కార్యాలయానికి స్థానికులతో ఉత్తరాలు రాయించారు ఈ సందర్భంగా మంచి ప్రతినిధులు మాట్లాడుతూ అన్ని ఏర్పాట్లు పూర్తయినా విలీనం ఉత్తర్వులు ఇవ్వకుండా కేంద్రం నాన్చుడు ధోరణి చేస్తోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు గాను 50 వేల మంది తో పోస్ట్ కార్డుల ఉద్యమాన్ని చేపడుతున్నట్లు మంచి ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో వికాస్ మంచ్ అధ్యక్షులు గడ్డం అబేల్, ప్రధాన కార్యదర్శి సంకి రవీందర్‌లతో పాటు ఎలగంటి ప్రభు గుప్తా, మమ్మద్ ఫసి, అరుణ్ యాదవ్, సాంసంగ్ రాజ్ , బాబు భాయ్, హరిబాబు, శ్యామ్, రాజు సత్యనారాయణ పాల్గొన్నారు.

"వివాహా వేడుకల్లో ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి"



నవతెలంగాణ-కాప్రా

చక్రీపురం , సిరి గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో జరిగిన వివాహ వేడుకలకు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, . బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డిలు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, లేతకుల రఘుపతి రెడ్డి, ఏనుగు సీతారాం రెడ్డి, మహేష్ గౌడ్, బైరి భాస్కర్ గౌడ్, జంపాల్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

"ఆలయంలో ప్రత్యేక పూజలు"

నవతెలంగాణ -నేరేడ్ మెట్



అల్వాల్ సర్కిల్ పరిధిలోని కానాజీగూడలోని మరకత శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానం లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వహకులు వ్యవస్థాపకులు మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 32 ఔషధీకత ద్రవ్యాలతో విశేష అభిషేకం, మోదకంలు, లక్ష్మీ గణపతి మూల మంత్రం, హెూమంలు నిర్వహించారు. భువనగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సీఐ జగదీష్ మరకత లక్ష్మి గణపతి దేవాలయాన్ని బుధవారం సందర్శించారు. ప్రత్యేక పూజలో ఆయన పాల్గొని స్వామివారిని దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులతో పాటు ఆలియా ట్రస్ట్ గీత ప్రియా తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్



నవతెలంగాణ-కాప్రా

కంటికి సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న ముగ్గురికి బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. బాధితులకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా లక్ష 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. హబ్సిగూడా డివిజన్‌కు చెందిన విలేకరి సంతోష్ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు అయోధ్య రాజు, ఆకాంక్ష, తేజ శ్రీలు కంటికి సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి వెంటనే స్పందించి ట్రస్ట్ ద్వారా లక్షా యాభై వేల రూపాయలు చెక్కును మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సొంత డబ్బులతో ట్రస్ట్ ద్వారా అనేక సేవా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న లక్ష్మారెడ్డిని అభినందించారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు సూరం శంకర్, చాంద్ పాషా, బోసాని పవన్, కటర్ల భాస్కర్, నేమూరి మహేష్, గుమ్మడి జంపాల్ రెడ్డి, గోలీ శ్రీనివాస్, మాస శేకర్, యుగెందర్ పాల్గొన్నారు.

శివనగర్‌లో కార్పొరేటర్ పర్యటన

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు ఆదేశాల మేరకు బుధవారం వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్, శివ నగర్ శివాలయం పరిసరాల్లో పర్యటించారు. కాలనీలో ఇండ్ల పైకి ఒరిగి ప్రమాద కారంగా మారిన చెట్టును తొలగించాలని స్థానికులు కార్పొరేటర్‌ను కోరారు. దీనికి స్పందించిన ఆమె ఆర్టికల్చర్ నవీన్‌ను రప్పించి చెట్టు ను తొలగించారు. ఈ సందర్భంగా స్థానికులు, కార్పొరేటర్‌కు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాస్కర్, ఎలక్ట్రిసిటీ ఎమర్జెన్సీ టీమ్, బీఆర్ఎస్ నాయకులు శంకర్‌పాల్, దేవ్‌గౌడ్, శంకరయ్య, దేవరబాబు తదితరులు పాల్గొన్నారు

ఆహారపు అలవాట్లు, ఆరోగ్య సూత్రాలపై అవగాహన

నవతెలంగాణ-కాప్రా

జన విజ్ఞాన వేదిక కాప్రా, మల్కాజిగిరి, కీసర మండల కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం 8వ రోజు శిక్షణలో భాగంగా స్థానిక ఆక్స్‌ఫర్డ్ మోడల్ హై స్కూల్ శ్రీ కష్ణా నగర్ కాలనీ చక్రిపురంలో విద్యార్థులకు ఆహారపు అలవాట్లు, ఆరోగ్య సూత్రాలుపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జననీ హాస్పిటల్ డాక్టర్ వెంకట్ లోక్ దాస్ మాట్లాడుతూ నేడు ఆహారపు అలవాట్లలో అనేక మార్పులు సంభవించాయని సాంప్రదాయక ఆహారపు అలవాట్లను మానేసి నూతన ఆహారపు అలవాట్లను పెంచుకుంటున్నారని తెలిపారు. దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. అనేక రకాల ఫాస్ట్‌ఫుడ్, జంక్ఫుడ్‌కు అలవాటు పడి ఊబకాయ సమస్యతో అనేకమంది రోజు సతమతమవుతున్నారని, నేడు విద్యార్థుల్లో కానీ ప్రజల్లో కానీ శారీరిక శ్రమ తగ్గడం, వ్యాయామాలు చేయడం పై ఆసక్తి తగ్గడంతో ఈ సమస్య ఇంకా అధికమవుతున్నదన్నారు. ఈ సమస్యను తగ్గించుకోవాలని.. తద్వారా మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోగలమని వారు తెలియజేశారు. ప్రతీ రోజు వ్యాయామాన్ని నిత్యకత్యంగా చేసుకోవాలని, ఉదయాన్నే మితాహారం గ్లాస్ పాలను తాగడం, మధ్యాహ్నం భోజనంలో అన్ని రకాల పోషకాలు ఉండేలా చూసుకోవాలని, ఫాస్ట్ ఫుడ్‌కు, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. తరువాత విద్యార్థులకు కల్పనా సులువుగా డ్రాయింగ్ ఎలా గీయాలో, హ్యాండ్ రైటింగ్ ఎలా మెరుగుపరుచుకోవాలో మెలకువలు నేర్పించారు. వేసవి శిక్షణ శిబిరంలో జన విజ్ఞాన వేదిక కాప్రా మండల, మల్కాజిగిరి మండల ప్రధాన కార్యదర్శులు సీహెచ్ ప్రభాకర్, శివ ప్రసాద్, కాప్రా మండల ఉపాధ్యక్షులు శివ శంకర్ రెడ్డి, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అందరు ఇందులో పాల్గొన్నారు.



దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ద హ్యాబిటట్స్ ట్రస్ట్

నవతెలంగాణ-హైదరాబాద్

దేశంలో సహజసిద్ధమైన ఆవాసాలు, వాటి దేశీ జాతుల రక్షణ, భద్రత కోసం శ్రమిస్తున్న లాభాపేక్షలేని సంస్థ హాబిట్స్ ట్రస్ట్ తమ వార్షిక హాబిటట్స్ ట్రస్ట్ గ్రాంట్స్ 2023 కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. టీహెచ్‌టీ గ్రాంట్స్ విజయం గురించి ద హాబిటట్స్ ట్రస్ట్ హెడ్ రుషికేష్ చవాన్ మాట్లాడుతూ... పరిరక్షణ ప్రయత్నాలపై ఈ గ్రాంట్లు చూపుతున్న ప్రభావం పట్ల సంతోషంగా ఉన్నామన్నారు. అంతరించిపోవడానికి దగ్గరగా ఉన్న జాతుల పునరుద్ధరణ మొదలు క్షీణిం చిన ఆవాసాల పునరుద్ధరణ వరకూ తాము మద్దతు అందించిన ప్రాజెక్టుల్లో గొప్ప పురోగతిని తాము చూశామన్నారు. 2020లో నేచర్ కన్జర్వేషన్ ఫౌండేషన్ (ఎన్సీఎఫ్) కు ఈ గ్రాంట్ను అందజేయడం ఒక ముఖ్య ఉదాహరణగా చెప్పవచ్చన్నారు. ఈ ఫలితాలు, పర్యావరణ పరిరక్షణలో తమ వ్యూహాత్మక పెట్టుబడులు అసలైన ప్రభావాన్ని చూపుతున్నాయని తెలుపుతున్నాయన్నారు.

జైపూర్ యోగా మహెూత్సవ్

నవతెలంగాణ-హైదరాబాద్

శ్రీ భవానీ నికేతన్ శిక్షా సమితి విశాలమైన మైదానంలో ప్రముఖులతో పాటు 15,000 మందికి పైగా ఔత్సాహికులు కామన్ యోగా ప్రోటోకాల్ ప్రదర్శించడంతో యోగా మహెూత్సవ్ ఉల్లాసకరమైన వాతావరణాన్ని చూసింది. యోగా మహెూత్సవ్ అనేది అంతర్జాతీయ యోగా దినోత్సవం, 2023కి 50 రోజుల జ్ఞాపకార్థం జరుపుకునే వేడుక. ఇందులో పాల్గొనేవారు కామన్ యోగా ప్రోటోకాల్ ని పూర్తి లయ , సామరస్యంతో మంత్రముగ్ధులను చేసే ఫలితంతో ప్రదర్శించారు.

ఇంటింటికి మంచి నీళ్లు అందిస్తా: కార్పొరేటర్



నవతెలంగాణ-నాచారం

ఇంటింటికి మంచినీళ్లను అందించేందుకు కృషి చేస్తున్నట్టు కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తెలిపారు. బుధవారం నాచారం డివిజన్ పరిధిలోని భవాని నగర్ లో గతంలో ఏర్పాటు చేసిన మంచినీటి పైప్ లైన్ల నుంచి నిత్యం లీకేజీలు, కలుషిత నీరు సరఫరా అవుతుందని తెలియజేయగా కార్పొరేటర్ వెంటనే ప్రతిపాదనలు పంపించి నూతన హెచ్‌డీపీ మంచినీటి పైప్ లైన్ల ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటికి నల్లా నీటిని అందించాలని లక్ష్యంతో ఇప్పటికే డివిజన్ లోని పాత పైప్ లైన్‌ల స్థానంలో నూతన పైప్ లైన్లు ఏర్పాటు చేసి మంచినీటి సమస్యను తీరుస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ ఇంటికి నల్లా నీళ్లు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో బీఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, కట్ట బుచ్చి గౌడ్, సత్యనారాయణ, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, ప్రతినిధులు పరిటాల సాంబశివరావు, రామ్ రెడ్డి, నర్సింగరావు, కాళిదాస్, రమేష్, బాల్ రెడ్డి, లైన్మెన్లు బాబు, మహేష్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

మల్కాజిగిరి నియోజకవర్గం లోని పలు డివిజన్‌లలో లింక్ రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మల్కాజిగిరి నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు కోరారు. ఈ మేరకు బుధవారం వారు మేయర్ గద్వాల విజయలక్ష్మి ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లుప్రేమ్ కుమార్, విజయశాంతి, సబిత, సునీతా యాదవ్, మీనారెడ్డి తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ -నేరేడ్ మెట్



ఓయూలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్



నవతెలంగాణ-ఓయూ

ఓయూలో బుధవారం జరిగిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు అనూహ్య స్పందన లభించింది. ఓయూ హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో టుటరూట్ సంస్థ ఏర్పాటు చేసిన ఈ డ్రైవ్‌లో మానవవనరుల అధికారులు విద్యార్థులకు లిఖిత, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. హైదరాబాద్ లోని ఆయా కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. టుటరూట్ సంస్థ అధికారులు సంస్థ విధి విధానాలను తొలుత విద్యార్థులకు వివరించారు. అర్హత సాధించి ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితా త్వరలోనే విడుదల చేసి.. ఉద్యోగ నియామక ధృవపత్రాలు అందిస్తామని సంస్థ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియామక సంస్థ ప్రతినిధులతో పాటు హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ స్టీవెన్ సన్ పాల్గొన్నారు.

నేషనల్ స్టాక్ ఎక్ఛేంజ్‌లో నమోదైన విరించి

నవతెలంగాణ-బంజారాహిల్స్



విరించి లిమిటెడ్ చెందిన సంస్థ ప్రధానంగా ఐటీ సర్వీసెస్, హెల్త్ కేర్ సేవలు, పేమెంట్ అండ్ క్రెడిట్ కార్డ్ సర్వీసెసులను అందిస్తున్న సంస్థ నేషనల్ స్టాక్ ఎక్సేంజ్‌లో నమోదు చేయబడింది. బుధవారం ముంబయిలో జరిగిన అత్యద్భుతమైన బెల్ రింగింగ్ (గంట మోగించడమనే) కార్యక్రమంతో విరించి లిమిటెడ్ ఈ మైలు రాయి సాధించిందని ప్రమోటర్లు అయిన మాధవిలత కొంపెల్ల కుమారి, లోపముద్ర కొంపేల్లతో పాటు వి.సత్యన్నారాయణ, వైస్ చైర్మెన్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్ ఠాగూర్, కంపెనీ సెక్రెటరీ చీఫ్ కంప్లయిన్స్ ఆఫీసర్లు హరీష్, కె.ఆహుజా, అభినవ్ అగర్వాల్, చీఫ్ మేనేజర్ లిస్టింగ్ పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యల పరిష్కారానికి నోడల్ టీంలు కృషి

- జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- బీజేపీ కార్పొరేటర్ల తీరుకు నిరసనగా అధికారుల వాక్ అవుట్
- సభను వాయిదా వేసిన మేయర్






నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి కార్యాలయం వద్ద మంగళవారం బీజేపీ కార్పొరేటర్లు ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. సివరేజ్ నిర్వహణ చేపట్టడం లేదనీ, పూడికతీయట్లేదని నిరసన వ్యక్తం చేశారు. అయితే వారు వ్యవహరించిన తీరుకు నిరసనగా చరిత్రలో తొలిసారిగా జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశాన్ని జలమండలి అధికారులు బాయ్‌కాట్ చేశారు. వారికి మద్దతుగా జీహెచ్ఎంసీ అధికారులు కూడా బయటకు వెళ్లిపోయారు.

నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం జీహెచ్ఎంసీ 6వ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చైతన్య స్ఫూర్తితో నిర్మించిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి అంతర్జాతీయ ఖ్యాతి లభిస్తుందన్నారు. సచివాలయం రాష్ట్రానికే ప్రతిష్టాత్మకమైనదనీ, దీనికి సూచనగా ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ అవార్డు, దేశంలోనే మొదటి గోల్డ్ రేటెడ్ సెక్రెటేరియట్ బిల్డింగ్ కాంప్లెక్స్‌గా రికార్డులో ఎక్కిందని తెలిపారు. మేడే సందర్భంగా ముఖ్యమంత్రి జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు వేతనం రూ.1000 పెంచడం సంతోషదాయకమన్నారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కాలనీ రెసిడెన్షియల్, స్లమ్ ఏరియా ఫెడరేషన్ ప్రతినిధులతో కలిసి నగరంలోని 4,846 కాలనీల సమస్యలను పరిష్కరించడానికి నోడల్ టీమ్‌లు విశేష కృషి చేస్తున్నాయని తెలిపారు. ఇందుకు 360కి పైగా టీమ్‌లు పని చేస్తున్నాయన్నారు. కుక్కకాటు నివారణకు హై లెవల్ కమిటీ సూచనల మేరకు, యానిమల్ వెల్ఫేర్ బోర్డు మార్గదర్శాలకు అనుగుణంగా జీహెచ్ఎంసీ పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిలో చెరువులు అన్యాక్రాంతం కాకుండా సీఎస్ఆర్ పద్ధతిలో పలు సంస్థలు ముందుకు వచ్చాయనీ, 43 చెరువుల సుందరీకరణ పనులను రెగ్యులర్‌గా చేపడతామని చెప్పారు. బీజేపీ కార్పొరేటర్లు మాట్లాడుతూ నగరంలో సమస్యలు నెలకొన్నాయనీ, నాలాల్లో పూడిక తీయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జలమండలి ఈడీ డాక్టర్ ఎం.సత్యనారాయణ మాట్లాడుండగా బీజేపీ కార్పొరేటర్లు అడ్డుకునేందుకు యత్నించారు. అయినా ఆయన మాట్లాడుతూ మంగళవారం జలమండలి కార్యాలయం వద్ద బీజేపీ కార్పొరేటర్లు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా అధికారిని అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి చర్యను నిరసిస్తూ సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తున్నట్టు ప్రకటించారు. వారికి జీహెచ్ఎంసీ అధికారులు మద్దతు తెలుపుతూ కౌన్సిల్ సమావేశం నుంచి వెళ్లిపోయారు. దాంతో మేయర్ సమావేశాన్ని వాయిదా వేశారు. ఈ సమావేశంలో ఎక్స్ అఫిషియో సభ్యులు ఎమ్మెల్సీ వాణిదేవి, మొహమ్మద్ రహమత్ బెగ్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ డీఎస్ లోకేష్ కుమార్, అడిషనల్ కమిషనర్ ప్రియాంక అలా, ఇవిడిఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, ఈఎన్‌సీ జియా ఉద్దీన్, సురేష్ కుమార్, సీసీపీ దేవేందర్ రెడ్డి, అడిషనల్ సీసీపీ శ్రీనివాస్, అడిషనల్ కమిషనర్ జయరాజ్ కెన్నెడీ, విజయలక్ష్మి, జోనల్ కమిషనర్లు శంకరయ్య, మమత, పంకజ, సామ్రాట్ అశోక్, శ్రీనివాస్ రెడ్డి, రవి కిరణ్, సెక్రెటరీ లక్ష్మి, జలమండలి డైరెక్టర్లు అజ్మీరా కృష్ణ, శ్రీధర్‌బాబు, స్వామి పాల్గొన్నారు.

కోఠి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో అరుదైన కంక్లియర్ ఆపరేషన్





నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కోఠి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో బుధవారం అరుదైన ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లా నడికూడ రాయపర్తి గ్రామానికి చెందిన విష్ణు (30) చెవి సమస్యతో తీవ్రంగా ఇబ్బందులు పడుతూ కోఠి ఈఎన్‌టీ హాస్పిటల్‌కు వచ్చాడు. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి అతనికి కాంక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్ ను విజయవంతంగా పూర్తి చేసినట్టు తెలిపారు. రోగి పరిస్థితి నిలకడగా ఉందని సూపరింటెండెంట్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కరుణ, ఆడియాలజిస్ట్ డాక్టర్ డీకే. వీణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విష్ణు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓయూలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ర్యాలీ

నవతెలంగాణ-ఓయూ



రాష్ట్రంలోని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం సహా 12 విశ్వవిద్యాలయాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొపెసర్స్‌ను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఓయూ పరిపాల భవనం నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓయూ టీచర్స్ అసోసియేషన్ కాంట్రాక్ట్ అధ్యక్షుడు పరశురాం, వర్కింగ్ ప్రసిడెంట్ డా.ధర్మతేజ మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఓయూ, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యపకులను జీవో 16 ప్రకారం రెగ్యులర్ చేస్తామని 2016లో హామీనిచ్చారనీ, ఇప్పుడు ప్రభుత్వం కాంట్రాక్ట్ డిగ్రీ, పాలిటెక్నిక్, జూనియర్ కాలేజీ లెక్చరర్ సర్వీస్‌లను క్రమబద్ధీకరించిందని తెలిపారు. డిగ్రీ, పాలిటెక్నిక్ లెక్చరర్లకు యూజీసీ, ఏఐసీటిఈఏ నిబంధనల ప్రకారం ఏ అర్హతలు కలిగి ఉన్నారో తాము కూడా అవే అర్హతలు కలిగి ఉన్నామన్నారు. కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను కూడా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాని పక్షంలో అన్ని యూనివర్సిటీల అసిస్టెంట్ ప్రొఫెసర్లను కలుపుకుని దశల వారీగా మరో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డా.నిరాజరావు, డా.వినిత పాండే, డా.ఉపేందర్, డా.బాలకోఠి, డా.ఆనంద్, డా.కవిత, డా.భాస్కర్, డా.ప్రేమయ్య, డా.రామకృష్ణ, డా.శంషాద్దీన్ డా.రామకృష్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'కమ్యూనిటీ ఇంటరాక్షన్'ను విజయవంతంగా నిర్వహించాలి

- డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావుగౌడ్



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఐదు మున్సిపల్ డివిజన్లలో జీహెచ్ఎంసీ చేపట్టిన కమ్యూనిటీ ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అధికారులను ఆదేశించారు. స్థానిక కార్పొరేటర్లతో కలిసి ప్రతి రోజూ ఎంపిక చేసిన కాలనీలు, బస్తీల్లో విధిగా అధికార యంత్రాంగం పర్యటించి వారి ద్వారా స్థానికుల సాధక బాధకలకు సంబంధించిన వివరాలను తమకు అందించాలని ఆయన బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని అడ్డగుట్ట, తార్నాక, మెట్టుగూడ, సితాఫల్‌మండీ, బౌద్ధనగర్ డివిజన్ల పరిధుల్లో 121 బస్తీలు, కాలనీల్లో జీహెచ్ఎంసీతోపాటు వివిధ విభాగాల అధికారులు సంయుక్త ఆధ్వర్యంలో ఈ కమ్యూనిటీ ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని రూపొందించినట్టు ఆయన తెలిపారు. మల్టీ-డిసిప్లినరీ ఫీల్డ్ లెవల్ టీమ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా స్థానిక కార్పొరేటర్లు కుడా అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటిస్తారని తెలిపారు. తాము వివిధ సందర్భాల్లో సికింద్రాబాద్ పరిధిలోని దాదాపు అన్ని బస్తీలు, కాలనీల్లో విస్తతంగా పర్యటించి, స్థానికుల అవసరాలను తెలుసుకుని వివిధ సదుపాయాలని కల్పించేందుకు నిధులను కుడా మంజూరు చేసినట్టు పద్మారావు గౌడ్ స్పష్టం చేశారు. తాజాగా అధికార యంత్రాంగం నిర్వహించనున్న ఈ పర్యటనలు క్షేత్రస్థాయిలో ఫిర్యాదులను సమర్థవంతంగా, సమయానుకూలంగా పరిష్కరించడానికి ఉపకరిస్తాయనీ, స్థానిక బస్తీ /కాలనీ సంఘాలతో సమన్వయం ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీతో పాటు జలమండలి, విద్యుత్, వైద్య, పోలీస్ విభాగాలను కూడా ఈ క్షేత్ర స్థాయి పర్యటనలలో భాగస్వామ్యం చేయనున్నట్టు పద్మారావు గౌడ్ పేర్కొన్నారు.

సిల్ట్ వేయడాన్ని నిరసిస్తూ బైకాట్ చేశాం

నవతెలంగాణ-సిటీబ్యూరో



మంగళవారం జలమండలి కార్యాలయంలో బీజేపీ కార్పొరేటర్లు సిల్ట్ వేయడం, అధికారులపై అనుచితంగా ప్రవర్తించడంతో కౌన్సిల్ సమావేశాన్ని బైకాట్ చేసినట్లు జలమండలి ఈడీ సత్యనారాయణ అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీలో జరిగిన కౌన్సిల్ సమావేశం సందర్భంగా ఈడీ మాట్లాడారు. జలమండలి నేతృత్వంలో తాగునీరు, మురుగు నీటి సమస్యలను కార్పొరేటర్ల సహకారంతో పరిష్కరించడం జరుగుతున్నదని తెలిపారు. అయితే మంగళవారం బీజేపీ కార్పొరేటర్లు జలమండలి అధికారుల ఛాంబర్‌లో సిల్ట్ వేయడం, అధికారులతో అనుచితంగా ప్రవర్తించడం సరికాదన్నారు. బీజేపీ కార్పొరేటర్లు వ్యవహరించిన తీరుతో కౌన్సిల్ సమావేశాన్ని వాక్ ఔట్ చేస్తున్నట్టు స్పష్టం చేశారు. జలమండలి అధికారులకు మద్దతుగా జీహెచ్ఎంసీ అధికారుల తరఫున బైకాట్ చేస్తున్నట్టు రాష్ట్ర గెజిటెడ్ అధికారుల ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు మమత మద్దతు ప్రకటించారని గుర్తు చేశారు.

బీజేపీ కార్పొరేటర్లు ఉద్దేశ పూర్వకంగా నిరసన : మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

నవతెలంగాణ-సిటీబ్యూరో



బీజేపీ కార్పొరేటర్లు ఉద్దేశ్య పూర్వకంగా నిరసనకు దిగారిని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం వాయిదా వేసిన తర్వాత మేయర్ ఛాంబర్‌లో ఏర్పాటు విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష కార్పొరేటర్ల తీరును తప్పుబట్టారు. ఈ రోజు చాలా బాధాకరమైన రోజున్నారు. కౌన్సిల్ సమావేశం సజావుగా సాగేందుకు అన్ని పార్టీ నేతలతో మాట్లాడినట్టు తెలిపారు. ఐదు నెలల తర్వాత సమావేశం నిర్వహించుకుంటున్న నేపథ్యంలో అందరూ సహకరించాలని కార్పొరేటర్‌లను కోరినట్టు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. బీజేపీ కార్పొరేటర్లు ఉద్దేశ పూర్వకంగా నిరసనకు దిగారనీ, నల్ల దుస్తులు ధరించి, ప్లకార్డులతో సమావేశానికి వచ్చినట్టు చెప్పారు. కొందరు బీజేపీ కార్పొరేటర్లు అధికారులను అన్ పార్లమెంటరీ వర్డ్స్ వాడారని తెలిపారు. ఆ కార్పొరేటర్లకు ఆ పార్టీ సంస్కారం క్రమశిక్షణ నేర్పలేదా అని ప్రశ్నించారు. సభ నిజంగా జరగాలి అనుకుంటే ఇలా ప్రవర్తించేవారు కారన్నారు. జీహెచ్ఎంసీ అధికారులతోపాటు జోనల్ కమిషనర్‌లతో బీజేపీ కార్పొరేటర్లు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని తెలిపారు. మంగళవారం జలమండలి కార్యాలయంలో మహిళా అధికారి, మేనేజింగ్ డైరెక్టర్ ఛాంబర్‌లో పూడిక తీసిన మట్టిని వేయడం సరికాదన్నారు. ఇకనైనా బీజేపీ కార్పొరేటర్లు ప్రవర్తన మార్చుకుని సమావేశం సజావుగా సాగేందుకు సహకరించాలని మేయర్ కోరారు.

సివరేజ్ పైప్ లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలి

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-అడిక్‌మెట్

ముషీరాబాద్ నియోజకవర్గం అడిక్‌మెట్ డివిజన్‌లో సివరేజ్ పైప్ లైన్ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. నియోజకవర్గంలోని అడిక్‌మెట్ డివిజన్ ఎస్ఎస్సీ అపార్టుమెంట్ లైన్‌లో లైన్లో సేవరేజ్ పైప్ లైన్ పనులు స్థానిక కార్పొరేటర్ సునీత ప్రకాష్ గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో అబివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులను సూచించారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముఠా జై సింహా, స్థానిక డివిజన్ ప్రెసిడెంట్ బల్ల శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సురేందర్, అస్లాం, రామాంజనేయస్వామి ఆలయ చైర్మన్ రవి యాదవ్, ఆకారం శ్రీనివాస్, టైలర్ శ్రీను, లక్ష్మీ గణపతి దేవస్థానం చైర్మెన్ ముచ్చకుర్తి ప్రభాకర్, యోగేష్, సునీల్, అనురాధ, జనార్ధన్, సత్తి, వాటర్ వర్క్స్ డీజీఎం మోహన్‌రాజ్, మేనేజరు, తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్టు

- ఆరు బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ శ్రీనివాస్



నవతెలంగాణ-ఓయూ

జల్సాలకు అలవాటు పడి బైక్‌లను దొంగిలిస్తున్న నిందితులను ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఓయూ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాచిగూడ ఏసీపీ ఆకుల శ్రీనివాస్ కేసు వివరాలు వెల్లడించారు. మౌలాలి ఆర్టీసీ కాలనీకి చెందిన సయిద్ ఫిరోజ్ చిన్న చిన్న పనులు చేసుకుంటూ ఉండేవాడు. వచ్చిన డబ్బులు సరిపోకపోవడంతో సులువుగా పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించేందుకు ద్విచక్రవాహనాలు దొంగలించాలని నిర్ణయించుకున్నాడు. 2017లో సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ద్విచక్రవాహనం దొంగిలించి పోలీసులకు పట్టుబడ్డాడు. 5 నెలల అనంతరం జైలు నుంచి విడుదలైన ఫిరోజ్ తార్నాకలోని అండాల్ మిక్సర్ షాప్‌లో పనిలో చేరాడు. ఈ క్రమంలో మరో దొంగతనం చేసి 2021లో మల్కాజిగిరి పోలీసులకు పట్టుబడి మూడు నెలల జైలు జీవితం గడిపాడు. ఆ తర్వాత మౌలాలి ప్రాంతానికి చెందిన శ్యామ్ సుందర్, ఆకాశ్, మరో మైనర్‌తో పరిచయం ఏర్పడింది. మౌలాలి జెడ్టీఎస్ గ్రౌండ్‌లో ఫిరోజ్ వారితో కలిసి ఆర్థిక ఇబ్బందులు గురించి మాట్లాడుకునేవారు. ఈ క్రమంలో వారు మద్యం, పొగాకు బానిసలుగా మారి, అర్ధరాత్రి రోడ్లపై తిరిగేవారు. తనకు చెర్లపల్లి జైల్‌లో మనిమోహన్ శికారి అనే వ్యక్తి కలిశాడనీ, దొంగలించిన ద్విచక్రవాహనాలను ఒడిషాలో విక్రయిస్తానని వారికి చెప్పారు. దీంతో అందరూ కలిసి ద్విచక్రవాహనాలను దొంగిలించడం ప్రారంభించారు. బుధవారం ఉదయం అయిదున్నర గంటల సమయంలో తార్నాక ప్రాంతంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, లాలా పేట ఫ్లై ఓవర్ కింద ఉన్న వాషింగ్ సెంటర్ సమీపంలో రెండు నంబర్ ప్లేట్స్ లేని రాయల్ ఎన్ఫీల్డ్ బైక్‌తో నలు గురు యువకులు అనుమానాస్పదంగా కన్పించారు. బైక్‌ల రిజిస్ట్రేషన్ పత్రాలను అడగ్గా లేకపోవడంతో పోలీసులు తనిఖీ చేసి, అవి చోరీకి గురైన బైకులుగా గుర్తించారు. వెంటనే వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించ గా, వారి చోరీల చిట్టా బయటపడింది. వారి నుంచి వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో ఓయూ ఇన్‌స్పెక్టర్ రమేష్ నాయక్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, డిటెక్టివ్ ఎస్సై భిక్షం, డిటెక్టివ్ సిబ్బంది రమాకాంత్, కిరణ్, సాయి, ప్రభాకర్, మల్లికార్జున్, గిరిబాబు, భవాని పాల్గొన్నారు.

డాక్టర్ అజయ్ అగర్వాల్‌కు ప్రతిష్టాత్మక 'భారత్ గౌరవ్' అవార్డు



నవతెలంగాణ-అంబర్‌పేట

నేషనల్ ఛాంబర్స్ ఆఫ్ పబ్లిక్ రిలేషన్స్, వైస్ చైర్మన్ అండ్ అడ్మిన్, వరల్డ్ కమ్యూనికేటర్స్ కౌన్సిల్ హెడ్ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ హెడ్, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ డాక్టర్ అజయ్ అగర్వాల్, బ్రిటీష్ పార్లమెంట్‌లో ఈ నెల 12వ తేదీన వివిధ దేశాల నుంచి హాజరుకానున్న ప్రముఖుల సమక్షంలో ప్రతిష్టాత్మక "భారత్ గౌరవ్" అవార్డును అందుకోనున్నారు. డాక్టర్ అగర్వాల్ అనేక సామాజిక అండ్ సాంస్కతిక సంస్థలతో అనుబంధం కలిగి ఉన్నారు. అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులను అందుకున్నారు. ఇటీవల అతను పీఆర్-ఏ టూల్ ఫర్ సక్సెస్" అనే పుస్తకాన్ని రాశారు. ఈ కార్యక్రమానికి, పోలాండ్, జపాన్, పోలాండ్, ఉజ్బెకిస్తాన్, ఇండియా, యుఎస్ఏ, యుకె, యూరప్, న్యూజిలాండ్ మరియు ఫ్రాన్స్‌లతో సహా ప్రపంచవ్యాప్తంగా 20 దేశాల నుండి అవార్డు గ్రహీతలు కూడా హాజరుకానున్నారు. భారత్ గౌరవ్ అవార్డు పదేండ్ల విజయాన్ని పురస్కరించుకుని ఈ 10వ ఎడిషన్ గ్రాండ్‌గా ఉండబోతోంది. డయాస్‌లోని ప్రముఖులు మిస్టర్ వీరేంద్ర శర్మ పార్లమెంటు సభ్యుడు యుకె, హౌస్ ఆఫ్ లార్డ్స్ బారోనెస్ సందీప్ వర్మ హౌస్ ఆఫ్ లార్డ్స్, రామి రేంజర్ యుకె. ఈ కార్యక్రమం ప్రతిష్టాత్మక బ్రిటీష్ పార్లమెంట్‌లో నిర్వహించబడుతుంది. అవార్డు గ్రహీతల విజయాలను గౌరవించడానికి ఒక ప్రత్యేకమైన, తగిన వేదికను అందిస్తుంది. ఈ సందర్భంగా పాల్గొనే వారందరికీ స్ఫూర్తిదాయకమైన, చిరస్మరణీయమైన అనుభవంగా ఉంటుంది.

'ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న మతతత్వ రాజకీయాలు'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న మతతత్వ రాజకీయాలను తరిమికొడదామని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నెర్లకంటి శ్రీకాంత్ యువతకు పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ 64వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం హిమాయత్‌నగర్‌లోని ఎన్.సత్యనారాయణరెడ్డి భవన్ ఎదుట ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ నేటి యువత జాతీయ సమగ్రత కోసం పాటు పడాలనీ, దేశం కోసం ప్రాణార్పణ చేసిన సర్దార్ భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు వారి ఆశయ సాధనకు 1959 మే 3న అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఢిల్లీలో ఆవిర్భవించిందనీ, 18 ఏండ్లు నిండిన యువతకు ఓటు హక్కు కోసం పోరాడి విజయం సాధించిన ఏకైక యువజన సంఘం ఏఐవైఎఫ్ అని చెప్పారు. కుల, మత, విచ్ఛిన్నకర వాదులకు ఎదురొడ్డి నిలిచిందనీ, అంటరానితనం, సాంఘిక దురాచారాలు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా యువతను పెడదోవ పట్టిస్తున్న మద్యపానం, అశ్లీల సాహిత్యం, అర్ధనగ్న సినిమాలకు వ్యతిరేకంగా 'క్విట్ అశ్లీలత' పేరుతో పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగిస్తుందన్నారు. భారతదేశ వ్యాప్తంగా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తూ, ఒక నిర్దిష్టమైన చట్టం ద్వారా ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా స్థానిక యువతకు 50 శాతం ఉపాధి అవకాశాలను కల్పిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల స్థాపన ద్వారా ఉద్యోగ హామీ సిద్ధిస్తుందనీ, నాణ్యమైన ఉత్పత్తి పెరుగుతుందన్నారు. ఇప్పుడు దేశమంతటా ఉన్న ప్రయివేటు, బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగాలు, ఉత్పత్తిలో నాణ్యత ఎండమావే అన్నారు. సమాజ ఆకాంక్షలకు అనుగుణంగా బహుళ జాతి కంపెనీలు వ్యవహరించడం లేదనీ, ప్రకృతి సహజ వనరులను దోపిడీ చేస్తూ ధనార్జనే ధ్యేయంగా ఈ బహుళజాతి కంపెనీలు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మత ఉన్మాదం హెచ్చుమీరిందనీ, ఈ విధానాలు దేశ సమగ్రతను దెబ్బ తీసేలా ఉన్నాయనీ, బీజేపీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ కాషాయ భావజాల విధానాలు, పోకడలను ప్రజలపై రుద్దడానికి తీవ్ర దుష్ట ప్రయత్నాలు చేస్తున్నారనీ, ఈ చర్యలు శాస్త్రీయ దృక్పథం కలిగిన నేటి యువత మతతత్వ రాజకీయాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ, రాష్ట్ర సమితి సభ్యులు మంత్రి శ్రీమాన్, ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చైతన్య యాదవ్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు రాజు, నర్సింహ, మజీద్ అలీఖాన్, మహమూద్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

'కామినేని'లో ఉచిత ఆస్తమా అవగాహనా శిబిరం

- ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు ఉచిత ఆస్తమా స్క్రీనింగ్ క్యాంపు



నవతెలంగాణ-అంబర్‌పేట

కామినేని హాస్పిటల్స్ ప్రతి ఏడాదీ జరుపుకునే ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా "అందరికీ ఆస్తమా వైద్యం" పేరుతో ఉచిత ఆస్తమా అవగాహన శిబిరాన్ని ప్రారంభించింది. ఈ గ్లోబల్ ఈవెంట్ ప్రధాన లక్ష్యం ఉబ్బసం, దాని లక్షణాలు ముందస్తుగా గుర్తించడం, దాని నిర్వహణ ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించడం. ఈ సందర్భంగా కామినేని హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సిఓఓ) డాక్టర్ గాయత్రి కామినేని మాటాడుతూ 'ఆస్తమా దేశంలో ఆస్తమా జీవితకాల రుగ్మత. చికిత్సను నిర్లక్ష్యం చేయటం వల్ల వ్యక్తి జీవితంలోని అన్ని రంగాల్లో నష్టపోవాల్సి వస్తుంది. తగినంతగా పని చేయలేక, శ్రద్ధ చూపలేక వృత్తి ఉద్యోగాల్లో వెనుకబడిపోవాల్సి వస్తుంది. శరీరం బలహీనంగా ఉండటం వల్ల వ్యక్తిగత అభిరుచులు, ఆనందాలకు దూరం కావాల్సి వస్తుంది. ఆస్తమా అంటే ఏమిటి? ఏ వయసులో ఇది ప్రారంభమవుతున్నది? ఆస్తమా రావటానికి కారణాలు ఏమిటి? ఎందువల్ల ఇది వ్యక్తి ప్రాణలతో చెలగాటం అడగలుగుతోంది? ఈ విషయాలు తెలుసుకుంటే ఆధునికి చికిత్సను ఎంచుకోవటం, వైద్యులు సూచించిన జాగ్రత్తలను పాటించటం ద్వారా ఆస్తమాను అదుపుచేసుకుని అది విధించే పరిమితుల నుంచి తేలికగా బయటపడటం సాధ్యపడుతుంది. ఆస్తమాతో బాధపడుతున్న వారిని ఆదుకోవడానికి కామినేని హాస్పిటల్ చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ ప్రపంచ ఆస్తమా దినోత్సవం, ఉబ్బసం గురించి అవగాహన పెంచడానికి, వారి శ్వాసకోశ ఆరోగ్యాన్ని నియంత్రించేలా ప్రజలను ప్రోత్సహించడానికి ఎల్బీనగర్‌లోని కామినేని హాస్పిటల్స్ ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు ఉచిత ఆస్తమా స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహిస్తోంది." అని తెలిపారు. నటుడు, రచయిత, దర్శకుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ " ఆస్తమా ప్రారంభ రోగనిర్ధారణ, సరైన నిర్వహణ ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడం, ఉబ్బసం సామాజిక, ఆర్థిక, రోగ ప్రభావ సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. కరోనా మహమ్మారి శ్వాసకోశ ఆరోగ్యం ప్రాముఖ్యతను గుర్తు చేయడమేగాక, శ్వాసకోశ ఆరోగ్య సంరక్షణ, పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది' అని తెలిపారు. కామినేని హాస్పిటల్స్ సీనియర్ పల్మోనాలజిస్ట్ డాక్టర్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ "ఆస్తమా, వంశపారంపర్యంగా సంక్రమించే జన్యువులు-పరిసరాల్లో వ్యాధిని ప్రేరేపించే అంశాల కలయిక గల ఓ సంక్లిష్టమైన వ్యాధి. దీన్ని నిరోధించటం ఓ సవాలు. జన్యు వుల వల్ల సంక్రమించగలిగినా పరిసర వాతావరణం ఇందులో చాలా ముఖ్యమైన పాత్రవహిస్తున్నందున ముందు జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా వంశపారంపర్యంగా వచ్చే అవకాశం ఉన్నవారు సహా ఇతరులూ ఈ వ్యాధిబారిన పడకుండా ఉండేందుకు వీలు కలుగుతుంది. వీటిలో కనీసం పక్షం రోజులకు ఒకసారి వేడి నీటితో దిండ్లు ఉతకడం, పెంపుడు జంతువులను పడక గదిలోని ఫర్నిచర్ నుండి దూరంగా ఉంచడం, కార్పెట్‌లు, బొమ్మలను ఉంచడం వంటివి ఉన్నాయి. పడకగది, ఇండోర్ తేమను నియంత్రించడం, ధూమపాన ప్రాంతాల కు దూరంగా ఉండటం, ఇళ్లలో ఫ్లోరింగ్, బాత్రూమ్‌లను శుభ్రం చేసేందుకు ఘాటైన క్లీనర్లను, ఆసిడులను వాడక పోవడం, మానసిక ఒత్తడిని అదుపులో ఉంచుకోవడం, బహిరంగ వ్యాయామ సమయంలో తీవ్రమైన ఉష్ణోగ్రతల కు దూరంగా ఉండడం, అస్తమా లక్షణాలు కనిపించినపుడు ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. ప్రారంభంలోనే వైద్యులను కలవటం వల్ల అస్తమాకు కారణాలను గుర్తించి చికిత్స చేయటం, జాగ్రత్తలను సూచించటం ద్వారా దాన్ని అదుపులో ఉంచటానికి వీలవుతుంది." అని తెలిపారు.

6న రవ్వా శ్రీహరి సంస్మరణ సభ

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ఈనెల 6తేదీ శనివారం సాయంత్రం 5 గంటలకు ప్రముఖ సంస్కృత విద్వాంసులు, ద్రావిడ విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య శ్రీహరి సంస్మరణ సభ జరుగుతుంది. పరిషత్తులోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగే ఈ సభలో రవ్వా శ్రీహరి కుటుంబ సభ్యులు, పరిషత్తు కార్యవర్గ సభ్యులు, ఇతర ప్రముఖులు పాల్గొని ఆయన సేవలను స్మరించి శ్రద్ధాంజలి ఘటిస్తారని పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య తెలిపారు.

'దళితబంధు' అవినీతి ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధనగర్ డివిజన్ పార్సిగుట్ట చౌరస్తాలో దళితబంధు అవినీతి ఎమ్మెల్యేలపై కేసీఆర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పార్సిగుట్ట చౌరస్తాలో మహాజన సోషలిస్టు పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం కో-ఆర్డినేటర్ డప్పు మల్లికా ర్జున ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సంఘీభావంగా విచ్చేసి పార్సిగుట్ట చౌరస్తాలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేసి నిరసన దీక్షను జాతీయ అధ్యక్షులు చిప్పల పల్లి సోమశేఖర్ ప్రారంభించి మాట్లాడారు. దళితబంధులో లంచాలు తీసుకుని అవినీతికి పాల్పడిన కొంతమంది బీఆంఎస్ ఎమ్మెల్యేల పేర్లు ఇంకా బయటపెట్టక పోవటం, వారిపై చర్యలు తీసుకోకపోవడం, పార్టీ నుంచి సస్పెండ్ చేయకపోవడం అంటే దళితులను ఇంకా మోసగించడమే అన్నారు. దళితబంధు అవినీతి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఇంకా శిక్షించకపోవడమే కేసీఆర్ దళిత వ్యతిరేక విధానాలకు నిదర్శనం అన్నారు. మొదటి నుంచి దళితులను మోసం చేస్తున్న వ్యక్తి కేసీఆర్ దళిత ద్రోహి అన్నారు. దళిత బంధును అవినీతి బంధుగా చేసిన కేసీఆర్‌కు దళితులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మందకృష్ణ మాదిగ పిలుపుతో అవినీతి ఎమ్మెల్యేలను శిక్షించేంత వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక నిరసనలు చేపడుతున్నట్టు తెలిపారు. కలెక్టరేట్ల ముందు ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు.

డిప్యూటీ మేయర్‌కు వినతి

నవతెలంగాణ-ఓయూ

తార్నాక డివిజన్ నాగార్జుననగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని వినతిపత్రం అందజేశారు. నాగార్జుననగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను, సందర్శకుల సౌకర్యార్థం కూర్చునే బెంచులను ఏర్పాటు చేయాలనీ, టాయిలెట్స్‌లను నిర్మించాలనీ, కాలనీవాసులకు అన్ని విధాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని విన్నవించుకున్నారు. డిప్యూటీ మేయర్ స్పందిస్తూ తక్షణమే సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పార్కుల అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పార్కుల అభివృద్ధికి సహకరిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో నాగార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



యంత్రంలో పడి యువకుడు మృతి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

యంత్రంలో పడి యువకుడు మృతి చెందిన ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హెటిరో ల్యాబ్స్‌లో బుధవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. కెమికల్స్ మిక్స్ చేసే యంత్రంలో ప్రొడక్షన్ ఆపరేటర్ మహేందర్ (28) ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. అయితే మహేందర్ మృతిని కంపెనీ యాజమాన్యం గోప్యంగా ఉంచింది. కంపెనీలోనికి మీడియాను అనుమతించలేదు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మహేందర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభించిన కార్పొరేటర్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నిరుద్యోగ యువత ఉపాధి దిశగా ముందుకు వెళ్లాలని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. జగద్గిరి నగర్‌లో బీఆర్ఎస్ యువ నాయకులు చిన్న ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటును బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. వారు మాట్లాడుతూ యువత విలువైన సమయాన్ని వృధా చేయకుండా ఉపాధి పొందాలని సూచించారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన నిర్వాహకుడు చిన్నాను అభినందించారు . నిరుద్యోగ యువత కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో ఉద్యోగ అవకాశాలు, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. అవి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్ ,నాయకులు టి .గిరి. డి. సంపత్ రెడ్డి, పి. మనోజ్. తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరినా పట్టించుకోరా..?



- హైదరాబాద్ కలెక్టరేట్‌లో మౌలిక సౌకర్యాలు కరువు
- స్లాబ్ కూలుతున్నా.. అలసత్వమెందుకు..
- పాత రంగారెడ్డి కలెక్టరేట్ భవనం సముదాయంలోకి మారేదేన్నడో..
- జనం అవస్థలు.. పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

నాంపల్లి-అబిడ్స్ రోడ్డులోని భవనంలో హైదరాబాద్ కలెక్టరేట్ భవనం కొనసాగుతోంది. ఇక్కడున్న మూడు భవనాల్లో రెండు శిథిలావస్థకు చేరాయి. ఎప్పుడూ కూలుతాయో తెలియని పరిస్థితి. మౌలిక సౌకర్యాలు లేవు. మరుగుదోడ్లు ఉన్నా.. నిర్వహణ పట్టించుకునే వారు కరువయ్యారు. ఫలితంగా కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు నానా ఇబ్బందులు తప్పడంలేదు. మరో భవనంలో కలెక్టర్, అదనపు కలెక్టర్, రెవెన్యూ విభాగాలు కొనసాగు తున్నాయి. గదులు ఇరుకుగా మారడంతో ఇబ్బం దులు పడుతున్నారు. ఇదిలావుంటే కలెక్టర్ ఛాంబర్ ఉండే అంతస్తులో ఎస్ఐసీ గది ఉంది. గతేడాది భారీ వర్షాల ధాటికి డీఐసీ అధికారి కూర్చునే గదిలోని స్లాబ్ ఒక్కసారిగా కూప్పకూలింది. ఆ అధికారికి తృటిలో ప్రమాదం తప్పింది. అది జరిగి కూడా సరిగ్గా ఏడాది కావస్తోన్న ఇప్పటికీ మరమ్మత్తు చేపట్టలేదు. ఇక శిథిల భవనాలకు చేరినా పైకప్పు నుంచి ఎప్పుడు ఏది ఊడి పడుతుందోనని ఉద్యోగులు భయపడుతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పనులు చేస్తున్నామని చెబుతు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత రంగారెడ్డి కలెక్టరేట్ భవనానికి సంబంధించిన మరమ్మతులు త్వరగా పూర్తిచేసి.. హైదరాబాద్ కలెక్టరేట్‌ను అక్కడి తరలించాలని వారు కోరుతున్నారు.

నగర శివారులోని కొంగరకలాన్‌లో నిర్మించిన సమీకృత భవన సముదాయంలోకి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ మారింది. ఈ భవనంలోకి వెళ్లికూడా దాదాపు ఎనిమిది నెలలు కావస్తోంది. ఇక అప్పటినుంచి లక్డీకాపూల్‌లోని భవనాలు ఖాళీగానే ఉన్నాయి. హైదరాబాద్ కలెక్టరేట్‌ను లక్డీకాపూల్‌కు తరలించాలని అధికారులు నిర్ణయించారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన కూడా పంపించారు. ప్రభుత్వం సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని సమాచారం. కానీ నిధులు మంజూరు చేయలేదు. ఫలితంగా తరలింపుపై స్పష్టత లేకుండా పోయింది.

నిధులు రాక..నిలిచిన మరమ్మతులు

ఇప్పటివరకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కొనసాగిన లక్డీకాపూల్‌లోని స్ఫూర్తి భవన్‌కు మరమ్మతులు చేయాల్సి ఉంది. ఇందుకు రూ.3 కోట్ల వరకు ఖర్చవు తుందని ఇంజనీరింగ్ అధికారులు అంచనా వేశారు. ఆరు నెలల క్రితమే ఇందుకు సంబంధించిన నివేదికను సంబంధిత అధికారులు కలెక్టర్‌కు సమర్పించారు. నేటికి నిధులు విడుదల కాక.. మరమ్మతులకు నోచుకోక భవనాలు వృథాగా పడి ఉన్నాయి. నిధుల విడుదల కోరుతూ హైదరాబాద్ జిల్లా నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదన వెళ్లినా.. ఇంకా విడుదల కాలేదని ఉద్యోగులు చెబుతున్నారు.

లక్డీకపూల్‌లో భవనాలు కటాయిస్తే ఒకే చోట అన్ని ఆఫీస్‌లు..



ప్రస్తుతం హైదరాబాద్ జిల్లాకు సంబంధించిన కార్యాలయాలు వేర్వేరు చోట్ల ఉన్నాయి. నాంపల్లి కలెక్టరేట్‌లో రెవెన్యూ, మహిళ శిశు సంక్షేమం, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, ఇంజనీరింగ్ విభాగం, సర్వేయర్, ప్లానింగ్, యువజన, మైనార్టీ సంక్షేమం వంటి కొన్ని శాఖలే ఉన్నాయి. విద్యాశాఖ(డీఈవో ఆఫీస్), ఇంటర్ విద్య, వైద్యారోగ్య, రిజిస్ట్రేషన్ శాఖ, గిరిజన శాఖ, బీసీ సంక్షేమం, ఇతర సంక్షేమ శాఖలు వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నాయి. చాలా శాఖలు కలెక్టరేట్ భవనంలో లేకపోవడంతో అదితెలియక వచ్చేవారు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. కనీసం అడిగితే సమాధానం చెప్పేవారు కూడా ఉండరు. హెల్ప్‌డెస్క్ లేదు. దీంతో కలెక్టరేట్‌కు వివిధ పనుల కోసం వచ్చే అర్జీదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. లక్డీకాపూల్‌లోని భవనాలు కేటాయిస్తే అన్ని శాఖలు ఒకే చోట ఉండేందుకు వీలుంటుంది. దీనివల్ల అర్జీదారులకు తిరిగే తిప్పలు తప్పుతాయి.



రక్షణ కల్పించాలి

- జలమండలి కార్యాలయం ముందు ఉద్యోగుల నిరసన
- బీజేపీ కార్పొరేటర్ల దాడిని ఖండించిన వివిధ యూనియన్ సంఘాలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి అధికారులకు, సిబ్బందికి రక్షణ కల్పించాలని జలమండలి ఉద్యోగులు డిమాండ్ చేశారు. మంగళవారం జలమండలి ప్రధాన కార్యాలయంపై బీజేపీ కార్పొరేటర్లు చేసిన దాడిపై జలమండలి వివిధ సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలి, తమకు రక్షణ కల్పించాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో బుధ



వారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రధాన కార్యాలయం, మూసాపేట్ సెక్షన్ కార్యాలయాల్లో కొందరు ప్రజాప్రతినిధులు దాడి చేయడం సరికాదన్నారు. దాడిని తాము తీవ్రంగా ఖండిస్తు న్నామన్నారు. సంస్థలో దాదాపు 30 శాతం మంది మహి ళలు పనిచేస్తున్నారని, ఇలాంటి ఘటనల వల్ల వారు భయాందోళనలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వృత్తి పరంగా ఎంత ఒత్తిడి ఉన్నప్పటికీ పని చేస్తున్నామన్నారన్నారు.

సిల్ట్ ని బయటకు తీసిన తర్వాత తడిగా ఉండటం వల్ల 24 గంటల వరకు దాన్ని అక్కడి నుంచి తొలగించలేమని పేర్కొన్నారు. అది పూర్తిగా ఎండిపోయిన తర్వాత సంబంధిత వాహనం వచ్చి తీసుకెళుతుందని దానికి కొంచెం సమయం పడుతుందన్నారు. కానీ అదే సిల్ట్ ని తీసుకువచ్చి కార్యాలయం ఆవరణలో పారబోయడం, అక్కడితో ఆగకుండా సంస్థ ఆస్తిని ధ్వంసం చేయడం దారుణమన్నారు. దానికి బదులు ప్రజాస్వామ్యంగా నిరసన చేసి తమ డిమాండులు చెప్పాల్సిందన్నారు. ఇలా వారి రాజకీయం చేయడం కోసమే తప్పా సమస్యలు పరిష్కరించాలన్న ఉద్దేశం కాదని పేర్కొన్నారు. గతంలో ఈ కార్యాలయం ముందు చాలా మంది శాంతియుతంగా నిరసనలు తెలియజేశారని, కానీ.. మంగళవారం బీజేపీ కార్పొరేటర్లు చేసింది అప్రజాస్వామికం అన్నారు. ఇది జలమండలిలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందిని అవమానపర్చడమేనన్నారు. తమ ఉద్యోగులు, సిబ్బంది, కార్మికులు భయపడుతున్నారన్నారు. జలమండలి పరిధిలో మురుగు నీటి నిర్వహణ కోసం 200 సివర్ క్లీనింగ్ యంత్రాలు, 15 హైడ్రాలిక్ సిల్ట్ గ్రాబర్ యంత్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. అంతేకాకుండా.. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సేఫ్టీ ప్రొటోకాల్ టీమ్ తనిఖీలు చేసి సమస్యలుంటే తగిన చర్యలు తీసుకుంటారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావత్తం కాకుండా కార్యాలయాల్లో రక్షణ కల్పించడానికి సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని ఎండీ దానకిశోర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం జలమండలి కార్యాలయంపై జరిగిన ఘటన విచారకరమని అన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు పార్టీలకతీతంగా అందరూ జలమండలి అధికారులు, సిబ్బందికి సహకరించాలని ఎండీ కోరారు. సిబ్బందికి తగిన సహకారమందిస్తే ఇంకా మంచి సేవలు అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. హైదరాబాద్ నగర ప్రజల అవసరాలు తీర్చడానికి తమ ఉద్యోగులు, సిబ్బంది కష్టపడి పనిచేస్తున్నారన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీజీఎంలు, డైరెక్టర్లతోపాటు అన్ని విభాగాలకు చెందిన ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించాలి

- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సలీమా



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలను కేటాయించాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి కేఎస్ సలీమా డిమాండ్ చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో భాగంగా బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యాలయం ఎదుట నిర్వహించిన దీక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం టీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు. ఫోర్త్ ఎస్టేట్‌గా చెప్పుకోబడే మీడియాపై రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తున్నదని, జర్నలిస్ట్ సంక్షేమానికి పాటుపడుతూ న్యాయపరమైన కోరికలను అమలు పరచాలని డిమాండ్ చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుమ్మడి ప్రసాద్ మాట్లాడుతూ.. సచివాలయం ప్రారంభోత్సవ కార్యాలయంలో అంతర్జాతీయ జాతీయ మీడియాలకు ఇచ్చిన ప్రాధాన్యత స్థానిక మీడియాకు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. జర్నలిస్టులు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ మీడియా రంగంలో రాణిస్తున్నారని దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల డిమాండ్లను నెరవేర్చాలని నేషనల్ కౌన్సిల్ మెంబర్ ఎంపల్లి పద్మారెడ్డి కోరారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు కోసం టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా సంతకాల సేకరణ, శాసనసభ్యులకు వినతి పత్రాలు, జిల్లా కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర కౌన్సిలింగ్ సభ్యులు యాదాపురం రవి, పటేల్ , నరసింహ యాదవులు అన్నారు. జర్నలిస్టుల పక్షాన నిలబడి పోరాడుతున్న ఏకైక యూనియన్ టీడబ్ల్యూజేఎఫ్ అని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి మండపాక కళ్యాణ చక్రవర్తి తెలిపారు. జర్నలిస్టుల న్యాయమైన కోరికలను నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున ఆందోళన, ఉద్యమ కార్యచరణ ఉంటుందని ట్రెజరర్ బిలిదే అశోక్ అన్నారు. అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజెఎఫ్ జిల్లా నాయకులు, సభ్యులు బెలిదే అశోక్, శివకుమార్, పి ఉపేందర్, మన్నే వినోద్, దేవేందర్ ,విష్ణు మోహన్, ఎన్ శివకుమార్ , డేవిడ్ రాజు, యాట రాజు, వినోద్ కుమార్, సాయి రాజ్, వెంకటేష్ , శ్రీనివాసరావు, నరేష్ , రాము , పరశురాం, నిరంత్, శీను ముఖేష్ గౌడ్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో వెంకటేశ్వరనగర్ అభివృద్ధి

- కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

నవతెలంగాణ - బాలానగర్



మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్‌ను అన్ని రంగాల్లో అభివద్ధి పరిచామని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. బస్తీలో రూ. 25 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో గత ప్రభుత్వాలు అభివద్ధికి ఆమడదూరంలో ఉంచి ప్రజలను ఇబ్బందులకు గురి చేశాయని, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాలు కల్పించారని తెలిపారు. ఈ సందర్భంగా బస్తీ ప్రజలు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఐడీపీఎల్ స్థలాన్ని పరిశీలించి ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు సహకారంతో కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో నూతన రోడ్లు, విద్యుత్, డ్రయినేజీ, త్రాగు నీటి పైపులైన్లు వంటి సదుపాయాలను కల్పించి 90 శాతం పనులతో అభివధి పరచారని చెప్పారు. ఎమ్మెల్యేకు, కార్పొరేటర్‌కు రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, వెంకటేష్, కవిత, స్వాతి, శంకర్ గౌడ్, రాంబద్రీ కిరణ్, రాముగౌడ్, గోపి సాగర్, మహేష్ సాగర్, డి. కృష్ణయ్య, హంసమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ రికార్డుల ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-శామీర్‌పేట



రికార్డులను సక్రమంగా నిర్వహించాలని లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని శామీర్ పేట ఎంపీఓ మంగతా యారు హెచ్చరిం చారు. బుధవారం మండలంలోని మురహరిపల్లి గ్రామపం చాయతీ కార్యాలయాన్ని ఎంపీవో ఆకస్మికంగా సంద ర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అంతకు ముందు గ్రామంలో పర్యటించి నర్సరీ, పల్లెప్రకతి వనం, వైకుంఠ దామాలను పరిశీలిం చారు. ఆమె మాట్లా డుతూ విధి నిర్వహ ణలో భాగంగా మురహరిపల్లిని సందర్శిం చినట్లు తెలిపారు. బిల్ కలెక్టర్ సాయి కుమార్ పాల్గొన్నారు.

దిల్‌ఖుష్ నగర్ అభివృద్ధికి నిరంతరం కృషి

నవతెలంగాణ-బాలానగర్



బాలానగర్ డివిజన్ పరిధిలోని దిల్‌కుష్‌నగర్‌లో నూతన డ్రయినేజీ లైన్ పూర్తి చేసుకున్న నేపథ్యంలో సీసీ రోడ్డు పనులను బుధవారం కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో అభివద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయడంతో అభివద్ధి పనులు దాదాపు పూర్తి చేసుకుంటున్నామన్నారు. దిల్‌ఖుష్ నగర్‌లో సమస్యల పరంగా ప్రజలకు ఇబ్బందులు ఏర్పడితే తన దష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాజా, సీనియర్ నాయకులు దేవులపల్లి కృష్ణమూర్తి జీహెచ్ఎంసీ ఏఈ మహమ్మద్ రషీద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు తోపాటు కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు మహమ్మద్ మోహ్సిన్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ జమీల్, బీఆర్ఎస్ కాలనీ అధ్యక్షులు సయ్యద్ సలీం, స్థానిక నాయకులు మహమ్మద్ సలావుద్దీన్, మహమ్మద్ ఫారూఖ్, మురళి, మహమ్మద్ అజీమ్, మహమ్మద్ తాఫిక్, వీరయ్య పాల్గొన్నారు.

న్యాయమూర్తిగా కిరణ్ కుమార్ బాధ్యతలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి కోర్టులో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా శంకర్ శ్రీదేవి విధులు నిర్వర్తిం చారు. అయితే ఈ మధ్య వారు బదిలీపై వెళ్లారు. కాగా ఆ స్థానం లోకి నూతనంగా కామా రెడ్డి జిల్లా నుంచి బీ కిరణ్ కుమార్ విచ్చేసి న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను మల్కాజిగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోటా రామచంద్ర రెడ్డి, వారి కమిటీ సభ్యులు అందరూ న్యాయమూర్తి ఛాంబర్‌లో కలిసి పూల మొక్కను అందజేశారు. పలువురు అసోసియేషన్ సభ్యులు న్యాయమూర్తిని అభినందిం చారు. ఈ మేరకు న్యాయమూర్తి కిరణ్ కుమార్ కమిటీ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజలను మోసం చేసి బీజేపీ ప్రభుత్వం మనుగడ సాధించలేదు

- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



దేశ ప్రజలను హామీల పేరుతో మోసం చేసే బీజేపీ ప్రభుత్వం భవిష్యత్తులో మనుగడ సాధించలేదని సీపీఐ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి ఈ. ఉమా మహేష్ అన్నారు. సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో బుధవారం 6వ రోజు గాజులరామరం డివిజన్ పరిధి లెనిన్ నగర్,అంబెద్కర్ నగర్‌లో ఇంటింటికి సీపీఐ, ప్రజా చైతన్య యాత్రను కొనసాగింది. ఈ పాదయాత్రకు స్థానిక శాఖ కార్యదర్శులు సాయిలు, యూసుఫ్‌లు నాయకత్వం వహించగా ముఖ్యఅ తిథిగా ఈ. ఉమా మహేష్ హాజరై మాట్లాడారు. ప్రధాని మోడీ ఒక్కోసారి ఒక్కవిధంగా మాట్లాడుతూ తమ అసలు స్వరూపం చూపిస్తున్నారని అందులో భాగంగానే మోడీ ఉచితాలు ఇవ్వొద్దు అని అంటే నేడు కర్నాటక రాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ అధ్యక్షుడు నడ్డా 3 గ్యాస్ సిలిండర్ లు ఉచితంగా ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీజేపీ నాయకులు ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు.. ప్రతి ఒక్కరి అకౌంట్లో 15 లక్షల రూపాయలు,ధరలు తగ్గిస్తామని,2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని,అవినీతి నిర్మూలిస్తామని చెప్పి నేడు వాటికి వ్యతిరేకంగా అందరి దగ్గరి నుంచి బ్యాంక్ అకౌంట్ పేరుతో డబ్బులు వేయించుకుని ప్రభుత్వ సంస్థలను అమ్ముకోవడం, ధరలు తగ్గించకుండా పెంచుకుంటూ పోవడం, సీబీఐ, ఈడీ దాడులు చేయించి అవినీతిపరులు తమ పార్టీలో చేరాక దాడులు మర్చిపోవడం ఇలా ఇచ్చిన అన్ని వాగ్దానాలకు వ్యతిరేకంగా పని చేస్తున్న ఘనత బీజేపీ కే దక్కిందని అన్నారు. బీజేపీకి,మోడీ నిజంగా మంచి చేసుంటే మతం, ప్రాంతం , దేవుడు, సైన్యం పేరు వాడుకోకుండా ఓట్లు అడగాలని హితువు పలికారు. గెలుపే లక్ష్యంగా కాకుండా ప్రజల కోసమే పని చేసే కమ్యూనిస్టులను ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి కరపత్రాలను పంచారు. వరదలా ప్రవహిస్తున్న డ్రయినేజీతో రోడ్డుపై వెళ్లలేని పరిస్థితులు లెనిన్ నగర్‌లో నెలకున్నాయని వెంటనే అధికారులు సమస్యను పరిష్కరించి ప్రజల బాధలను తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యవర్గ సభ్యులు హరినాథ్ రావు, వంగాల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి రాము,సీపీఐ నాయకులు అఫ్సర్, ధర్మేంద్ర, యాదన్న,ఇమామ్, నరేష్, కనకయ్య, నర్సింహా, శివ,సామెల్, మహబూబ్ పాల్గొన్నారు.



అర్హులందరికీ ఇండ్ల స్థలాలివ్వాలి

- సీఐటీయూ మండల కార్యదర్శి లింగస్వామి

నవతెలంగాణ-దుండిగల్

గండి మైసమ్మ దుండిగల్ మండలంలో ఉన్న ప్రభుత్వ భూములను ఇల్లు లేని నిరుపేదలకు కేటాయించాలని సీఐటీయూ దుండిగల్ మండల కార్యదర్శి బోడిగే లింగస్వామి తెలిపారు. సీపీఐ(ఎం), ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం గండిమైసమ్మ దుండిగల్ తాసిల్దార్‌కి వినతి పత్రం అందజేశారు.. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు లింగస్వామి, వీరమల్లు, మల్లేష్‌లు మాట్లాడుతూ.. ఈ మండలంలో చాలా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతంగా.. ఎకరాల ఎకరాలు కబ్జాలకు గురి అవుతున్నాయని, ఈ మండలంలో ఇండ్లు లేని నిరుపేదలు కిరాయిలు కట్టలేక చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో ప్రభుత్వమే అనేకమంది ప్రజలకు ఇండ్ల పట్టాలు ఇచ్చి వెనక్కి తగ్గిందని అటువంటి వారు వందల సంఖ్యలో ఉన్నారని వారికి స్థలాలను కేటాయించాలని కోరారు. లేనియెడల అతి తొందరలోనే ఇండ్లు లేని పేదలను సమీకరించి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భూ పోరాటం చేయక తప్పదన్నారు. మండలంలో ప్రభుత్వ భూములలో ఎర్రజెండాలు పాతి పేద ప్రజల చేత గుడిసెలు వేయించి వారికి అండగా నిలిచి భూ పోరాటం నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఒక పక్కన ప్రభుత్వ భూములను కబ్జాలు చేస్తా ఉంటే అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం), ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన డిప్యూటీ మేయర్

నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్ ఎస్‌వీఎస్ అపర్ణ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక కార్పొరేటర్ బాలాజీ నాయక్ , ఎలక్ట్రికల్ ఏఈ శాంతా కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ సలీం, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్రగిరి సతీష్, నాయకులు ఉంగరాల శ్రీనివాస్, మహిళా అధ్యక్షులు సంధ్యారాణి, ఎస్‌వీఎస్ అపర్ణ కాలనీ హెల్ఫర్ అసోసియేషన్ అధ్యక్షులు ఛాయా, ప్రధాన కార్యదర్శి ప్రతిమ, సుబ్రహ్మణ్యం, రాంభూపాల్ రెడ్డి, గౌరీ శంకర్ , కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

వరుణుడి ఆట

- లక్నో, చెన్నై మ్యాచ్ వర్షార్పణం
- ఆయుశ్ బదాని మెరుపు ఇన్నింగ్స్

ఇరు జట్లకు చెరో పాయింట్

ఐపీఎల్‌లో భారీ స్కోర్లు, స్వల్ప స్కోర్ల థ్రిల్లర్ల నడుమ వరుణుడు ఓ మ్యాచ్‌ను ఖాతాలో వేసుకున్నాడు. సూపర్‌జెయింట్స్, సూపర్‌కింగ్స్ నడుమ లీగ్ పోరుకు వర్షం ఆటంకం కలిగించింది. వర్షంతో ఆట ఆలస్యంగా ఆరంభం కాగా.. మ్యాచ్‌లో ఒక్క ఇన్నింగ్స్ కూడా పూర్తి కాలేదు. ఎడతెరిపి లేకుండా వరుణుడు మైదానాన్ని ముంచెత్తాడు. లక్నో, చెన్నై మ్యాచ్ ఫలితం తేలకుండా ముగిసింది.



నవతెలంగాణ-లక్నో :

గౌతం గంభీర్, విరాట్ కోహ్లి వాగ్వాదం అనంతరం.. ఎం.ఎస్ ధోని జట్టుతో లక్నో సూపర్‌జెయింట్స్ తలపడనుండటంతో అందరి ఆసక్తి ఈ మ్యాచ్‌పైనే కనిపించింది. గతంలో ఎం.ఎస్ ధోనిపై గౌతం గంభీర్ బహిరంగ విమర్శలు.. కోల్‌కత నైట్‌రైడర్స్ కెప్టెన్‌గా చెన్నై సూపర్‌కింగ్స్‌తో మ్యాచుల్లో రెట్టించిన భావోద్వేగాలతో కనిపించిన గౌతం గంభీర్ తాజా మ్యాచ్‌లో లక్నో మెంటార్‌గా ధోనీసేనతో అదే భావోద్వేగంతో బరిలోకి దిగుతాడనే అంచనాలు కనిపించాయి. అయితే, లక్నో సూపర్‌జెయింట్స్, చెన్నై సూపర్‌కింగ్స్ పోరు వర్షార్పణం అయ్యింది. వరుణుడు రంగ ప్రవేశం చేయటంతో లక్నో, చెన్నై మ్యాచ్ ఫలితం తేలకుండానే ముగిసింది. దీంతో లక్నో సూపర్‌జెయింట్స్, చెన్నై సూపర్‌కింగ్స్ చెరో పాయింట్‌ను పంచుకున్నాయి. పది మ్యాచ్‌లు ఆడిన చెన్నై సూపర్‌కింగ్స్, లక్నో సూపర్‌జెయింట్స్ ఐదేసి విజయాలు సాధించాయి. నాలుగు ఓటములు, తాజా మ్యాచ్‌లో ఫలితం రాలేదు. 11 పాయింట్లతో లక్నో సూపర్‌జెయింట్స్ మెరుగైన నెట్‌రన్‌రేట్‌తో పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలువగా... 11 పాయింట్లతో చెన్నై సూపర్‌కింగ్స్ పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో కొనసాగుతుంది.

బదాని బాదాడు : స్పిన్‌కు అనుకూలించే లక్నో పిచ్‌పై టాస్ నెగ్గిన చెన్నై సూపర్‌కింగ్స్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. లక్నో ఓపెనర్లు మనన్ వోహ్రా (10), కైల్ మేయర్స్ (14) తొలి మూడు ఓవర్ల పాటు వికెట్ కాపాడుకున్నారు. పవర్‌ప్లేలోనే బంతిని అందుకున్న మోయిన్ అలీ.. ఫామ్‌లో ఉన్న కైల్ మేయర్స్‌ను డగౌట్‌కు పంపించాడు. ఈ సీజన్లో వరుసగా రెండోసారి కైల్ మేయర్స్‌ను అలీ అవుట్ చేశాడు. మేయర్స్ నిష్క్రమణతో లక్నో సూపర్‌జెయింట్స్ బ్యాటర్లు చేతులెత్తేశారు. కరణ్ శర్మ (9), కృనాల్ పాండ్య (0), మార్కస్ స్టోయినిస్ (6)లు విఫలమయ్యారు. 44 పరుగులకే లక్నో సూపర్‌జెయింట్స్ ఐదు వికెట్లు కోల్పోయింది. స్వల్ప స్కోరుకే పరిమితమయ్యే ప్రమాదంలో పడింది. లక్నో పీకల్లోతు కష్టాల్లో కూరుకోగా ఆయుశ్ బదాని (59 నాటౌట్, 33 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), నికోలస్ పూరన్ (20, 31 బంతుల్లో) ఆరో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. పరుగుల వేటలో ఇతర బ్యాటర్లు తడబాటుకు గురైన వేళ ఆయుశ్ బదాని ధనాధన్ బాదేశాడు. నాలుగు సిక్సర్లు, రెండు బౌండరీలతో 30 బంతుల్లోనే అర్థ సెంచరీ పూర్తి చేశాడు. బిగ్ హిట్టర్ నికోలస్ పూరన్ సైతం బౌండరీ కోసం తంటాలు పడినా.. బదాని అలవోకగా బాదాడు. బదాని బాదుడుతో మ్యాచ్ చెన్నై సూపర్‌కింగ్స్ చేజారినట్టు అనిపించింది. 19.2 ఓవర్లలో లక్నో సూపర్‌జెయింట్స్ 7 వికెట్లకు 125 పరుగులు చేసింది. ఆ సమయంలో వరుణుడు మరోసారి మ్యాచ్‌కు అంతరాయం కలిగించాడు. అక్కడ్నుంచి వర్షం ఏమాత్రం తగ్గలేదు. దీంతో మ్యాచ్ మళ్లీ పున ప్రారంభం కాలేదు. వర్షం కారణంగా మ్యాచ్‌ను నిలిపివేస్తున్నట్టు ఫీల్డ్ అంపైర్లు ప్రకటించారు.

స్కోరు వివరాలు :

లక్నో సూపర్‌జెయింట్స్ : మనన్ వోహ్రా (బి) మహీశ్ తీక్షణ 10, కైల్ మేయర్స్ (సి)రుతురాజ్ గైక్వాడ్ (బి) మోయిన్ అలీ 14, కరణ్ శర్మ (సి,బి) మోయిన్ అలీ 9, కృనాల్ పాండ్య (సి) అజింక్య రహానె (బి) మహీశ్ తీక్షణ 0, మార్కస్ స్టోయినిస్ (బి) రవీంద్ర జడేజా 6, నికోలస్ పూరన్ (సి) మోయిన్ అలీ (బి) మథీశ పథీరణ 20, ఆయుశ్ బదాని నాటౌట్ 59, కృష్ణప్ప గౌతమ్ (సి) అజింక్య రహానె (బి) మథీశ పథీరణ 1, ఎక్స్‌ట్రాలు : 6, మొత్తం : (19.2 ఓవర్లలో 7 వికెట్లకు) 125.

వికెట్ల పతనం : 1-18, 2-27, 3-27, 4-34, 5-44, 6-103, 7-125.

బౌలింగ్ : దీపక్ చాహర్ 4-0-41-0, తుషార్ దేశ్‌పాండే 1-0-1-0, మోయిన్ అలీ 4-0-13-2, మహీశ్ తీక్షణ 4-0-37-2, రవీంద్ర జడేజా 3-0-11-1, మథీశ పథీరణ 3.2-0-22-2.

జరిమానా ఎవరు చెల్లిస్తారు?

చర్చనీయాంశంగా కోహ్లి, గంభీర్ 100 శాతం జరిమానా



ముంబయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 16 సీజన్‌లో ఆట కంటే ఆటేతర అంశాలు ప్రధాన శీర్షికలుగా నిలుస్తున్నాయి. అటువంటి ఘటనల్లో ముందు వరుసలో ఉండేది విరాట్ కోహ్లి, గౌతం గంభీర్ వివాదం. బెంగళూర్ చిన్నస్వామి స్టేడియంలో మొదలైన విరాట్ కోహ్లి, గౌతం గంభీర్ వైరం.. లక్నోలో మ్యాచ్ వరకు కొనసాగింది. లక్నోలో లక్నో సూపర్‌జెయింట్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మ్యాచ్‌కు ముందు సోషల్ మీడియాలో సైతం విరాట్-గంభీర్ ఫైట్‌పై ఆసక్తి కనిపించింది. వ్యాఖ్యాతలు, మాజీ క్రికెటర్లు సైతం లక్నో, బెంగళూర్ మ్యాచ్‌ను కోహ్లి, గంభీర్ పోరుగానే చూశారు. విరాట్ కోహ్లి-గౌతం గంభీర్ గొడవ అంచనాలను మించిపోయింది. ఓ వైపు ఐపీఎల్ మ్యాచుల సందర్భంగా అభిమానులు ఘర్షణకు దిగుతుండగా.. మరోవైపు మైదానంలోనే ఆటగాళ్లు బాహాబాహికి దిగటం ఆటకు బోలెడంత చెడ్డ పేరు.. ప్రాంఛైజీలకు మంచి కమర్షియల్ విలువలు తెచ్చిపెట్టాయి.

విరాట్ కోహ్లి, గౌతం గంభీర్ గొడవను తీవ్రంగా పరిగణించిన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) క్రమశిక్షణ నియామవళి కొరడా ఝులిపించింది. విరాట్ కోహ్లిపై 100 శాతం మ్యాచ్ ఫీజు జరిమానా, లక్నో మెంటార్ గౌతం గంభీర్ మ్యాచ్ ఫీజులో వంద శాతం కోత విధించారు. ఇక లక్నో ఛేదన సందర్భంగా కోహ్లిని కవ్వించిన ఆ జట్టు ఆటగాడు నవీన్ ఉల్ హాక్ మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత పెట్టారు. ఐపీఎల్ క్రమశిక్షణ నియామవళి ఆర్టికల్ 2.21 ప్రకారం గౌతం గంభీర్, విరాట్ కోహ్లి లెవల్ 2 తప్పిదానికి పాల్పడ్డారు. దీని ప్రకారం విరాట్ కోహ్లికి రూ.1.07 కోట్లు, గౌతం గంభీర్‌కు రూ.25 లక్షలు, నవీన్ ఉల్ హాక్‌కు రూ.1.7 లక్షల జరిమానా పడింది. ఆటగాళ్లకు విధించిన జరిమానాలను ఎవరు కడతారనే చర్చ ప్రస్తుతం ఎక్కువగా నడుస్తోంది. ఈ జరిమానాలను ఆటగాళ్లు తమ వేతనాల నుంచి చెల్లిస్తారా? లేదంటే ప్రాంఛైజీల తమ ఖాతా నుంచి చెల్లిస్తాయా?!

ఐపీఎల్‌లో విరాట్ కోహ్లి వేతనం రూ.15 కోట్లు. మ్యాచ్ ఫీజును సీజన్లో ఆడిన మ్యాచ్‌ల ఆధారంగా నిర్ణయిస్తారు. సీజన్ ముగిసిన అనంతరం జరిమానా మొత్తంపై స్పష్టత వస్తుంది. ఎలాగైనా విరాట్ కోహ్లి కాస్త అటు ఇటుగా రూ. కోటి జరిమానా చెల్లించాల్సిందే. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ ప్రాంఛైజీ ఈ జరిమానాను విరాట్ కోహ్లి తరఫున చెల్లించనుంది. లక్నో సూపర్‌జెయింట్స్ మెంటార్ గౌతం గంభీర్ మ్యాచ్ ఫీజును రూ.25 లక్షలుగా ఆ ప్రాంఛైజీ వర్గాలు అనధికారంగా తెలిపాయి. లక్నో, బెంగళూర్‌లు ప్లే ఆఫ్స్‌కు చేరుకుంటే మ్యాచ్ ఫీజు విలువ కాస్త తగ్గనుంది. లక్నో సూపర్‌జెయింట్స్ యాజమాన్యం సైతం గౌతం గంభీర్ తరఫున ఆ జరిమానా సొమ్ము కట్టనుంది.

సాధారణంగా ఐపీఎల్ సీజన్ ముగిసిన అనంతరం ప్రాంఛైజీలకు ఈ జరిమానాల మొత్తాన్ని బోర్డు పంపిస్తుంది. క్రమశిక్షణ ఉల్లంఘనలు, స్లో ఓవర్‌రేట్ జరిమానాలను కొన్ని ప్రాంఛైజీలు సొంతంగా చెల్లిస్తుండగా.. మరికొన్ని ప్రాంఛైజీలు ఆ మొత్తాన్ని ఆటగాళ్ల వేతనాల నుంచి చెల్లిస్తున్నాయి. మైదానంలో ఆటగాళ్ల ప్రవర్తన మెరుగయ్యేందుకు జరిమానాలను వారి వేతనాల నుంచి చెల్లించాలనే వాదన క్రికెట్ విశ్లేషకుల నుంచి వినిపిస్తోంది.

పుంజుకునేదెవరు?

సన్‌రైజర్స్‌తో నైట్‌రైడర్స్ ఢీ
మరో మ్యాచ్‌కు ముస్తాబైన ఉప్పల్

నవతెలంగాణ-హైదరాబాద్ :

ఆరంభంలో అద్భుత విజయాలతో అభిమానుల దృష్టిని తనవైపునకు తిప్పుకున్న జట్టు కోల్‌కత నైట్‌రైడర్స్. తొలుత ఓటమి పాలైనా..తర్వాత వరుస విజయాలతో అంచనాలను పెంచిన జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్. ప్రథమార్థం మ్యాచులు ముగిసిన అనంతరం ఫామ్, లయ తప్పిన జట్ల జాబితాలో ముందున్నాయి సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కత నైట్‌రైడర్స్. 9 మ్యాచుల్లో 3 విజయాలతో కోల్‌కత నైట్‌రైడ ర్స్ పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో నిలువగా..8 మ్యాచుల్లో 3 విజయాలతో సన్‌రైజర్స్ హైదరాబాద్ పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానంలో కొనసాగుతుంది. తాజాగా నేడు సన్‌రైజర్స్, నైట్‌రైడర్స్ ముఖా ముఖి సమరానికి సిద్ధమయ్యాయి. ఈ మ్యాచ్‌లో విజయంతో పాయింట్ల పట్టికలో ఎగబాకేందుకు ఇరు జట్లు దృష్టి సారించా యి. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో నేడు హైదరాబాద్, కోల్‌కత కీలక మ్యాచ్‌కు సిద్ధమయ్యాయి.

గాడిలో పడతారా? : సీజన్ ఆరంభంలో వరుస ఓటములకు సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటింగ్ వైఫల్యం కారణమైంది. కానీ కోల్‌కత నైట్‌రైడర్స్‌తో మ్యాచ్‌లో 200 ప్లస్ పరుగులు దంచికొట్టిన సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటింగ్ కష్టాలక్ చెక్ పెట్టింది. ఆ మ్యాచ్‌లో హైదరాబాద్ స్టార్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ శతకం సాధించాడు. కానీ ఆ మ్యాచ్ అనంతరం సన్‌రైజర్స్ కథ మళ్లీ మొదటికొచ్చింది. మరోసారి కోల్‌కత నైట్‌రైడర్స్‌తో తలపడనున్న సన్‌రైజర్స్ హైదరాబాద్.. మళ్లీ గాడిలో పడేందుకు ఎదురుచూస్తుంది. కెప్టెన్ ఎడెన్ మార్క్ రామ్, హ్యారీ బ్రూక్, హెన్రిచ్ క్లాసెన్‌లు బ్యాటింగ్ లైనప్‌లో కీలకం కానుండగా.. అభిషేక్ శర్మ, రాహుల్ త్రిపాఠి, మయాంక్ అగర్వాల్‌లు రాణిస్తే సన్‌రైజర్స్‌కు తిరుగుండదు. భువనేశ్వర్ కుమార్, తంగరసు నటరాజన్, మార్కో జాన్సెన్‌లు పేస్ విభాగంలో ఫామ్‌లో ఉన్నారు. మయాంక్ మార్కండె మాయజాలం జోరుగా సాగుతోం ది. చివరగా సన్‌రైజర్స్ హైదరాబాద్ రెండు మ్యాచుల్లోనూ ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడిం ది. సొంత మైదానంలో ఓడినా, కోట్ల స్టేడియంలో విజయం నమోదు చేసింది. ఉప్పల్‌లో జరిగిన చివరి రెండు మ్యాచుల్లో ఛేదనలో తడబాటుకు లోనైన సన్‌రైజర్స్ హైదరాబా ద్.. కోల్‌కత నైట్‌రైడర్స్‌తో మ్యాచ్‌తో తొలుత బ్యాటింగ్ చేసేందుకు మొగ్గుచూపేందుకు అవకాశం ఉంది. ఇక కోల్‌కత నైట్‌రైడర్స్ తాజా సీజన్లో అంచనాలను అందుకోలేదు. కీలక ఆటగాడు ఆండ్రీ రసెల్ ఇంకా ఫామ్ సాధించలేదు. అయినా, ఇతర ఆటగాళ్లు మెరుపు ప్రదర్శనలు నమోదు చేస్తున్నారు. నితీశ్ రానా, వెంకటేశ్ అయ్యర్, రింకూ సింగ్‌లు ఆకాశమే హద్దుగా చెలరేగుతున్నారు. కానీ ఏ మ్యాచ్‌లో బ్యాటర్లు సమిష్టిగా మెరవటం లేదు. ఇది కోల్‌కత నైట్‌రైడర్స్‌కు ప్రతికూలం గా మారింది. కోల్‌కత నైట్‌రైడర్స్ మరో బలం స్పిన్. సునీల్ నరైన్, వరుణ్ చక్రవర్తిల కు తోడు సుయాశ్ శర్మ రూపంలో మూడో మిస్టరీ స్పిన్నర్ అందుబాటులోకి వచ్చాడు. ఈ ముగ్గురి 12 ఓవర్లను కాచుకోవటం సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు నేడు అతిపెద్ద సవాల్.

నవచిత్రం


మెప్పించే వినూత్నమైన కథ



దృషికా చందర్, నిహాల్ కోదాటి

ఛార్మి ముఖ్య పాత్రధారిణిగా జెన్ నెక్ట్స్ మూవీస్ బ్యానర్‌పై తెరకెక్కించిన 'మంత్ర' సినిమా పెద్ద సెన్సెషనల్ హిట్‌గా నిలించింది. ఇదే బ్యానర్‌లో అనుపమ పరమేశ్వరన్‌తో 'బటర్ ఫ్లై' చిత్రాన్ని నిర్మించి మరో విజయాన్ని అందుకుంది. ఇదే బ్యానర్‌పై మంత్ర సినిమా రచయిత రవి ప్రకాశ్ బోడపాటి నూతన దర్శకత్వంలో తెరకెక్కిన థ్రిల్లర్.. 'ది స్టోరి ఆఫ్ ఏ బ్యూటిఫుల్ గర్ల్'. ఈ సినిమా ఈనెల12న ప్రపంచవ్యాప్తంగా రిలయన్స్ సంస్థ ద్వారా విడుదలకు రెడీ అయ్యింది. రవి ప్రకాష్ బోడపాటి రచన-దర్శకత్వంలో ప్రసాద్ తిరువల్లూరి, పుష్యమి ధవళేశ్వరపులు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రంలో నిహాల్ కోదాటి హీరోగా, దృషికా చందర్ హీరోయిన్‌గా నటించారు. మధునందన్, భార్గవ పోలుదాసు, భావన దుర్గం, సమర్థ యుగ్ అలాగే ప్రముఖ జర్నలిస్ట్ దేవి నాగావల్లీ, మెహెర్ శ్రీరామ్ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. చాలా వైవిధ్యమైన కథతో నేటితరం యువతకు నచ్చేలా ఈ సినిమాను తెరకెక్కించామని, యువతకు కావల్సిన అన్ని అంశాలతో పాటు ఓ మంచి సందేశం కూడా ఈ సినిమాలో ఉంటుందని మేకర్స్ తెలిపారు. నాన్నకు ప్రేమతో, సీతారామమ్ వంటి సినిమాలను విడుదల చేసిన ప్రతిష్టాత్మకమైన రిలయన్స్ ఎంటర్ టైన్మెంట్ సంస్థకి ఈ సినిమా ఎంతగానో నచ్చి.. ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేస్తుండటం సంతోషంగా ఉందని మేకర్స్ తెలిపారు.

మంచి సినిమా చూశామనే అనుభూతినిస్తుంది..



జగపతిబాబు

'లక్ష్యం', 'లౌక్యం' వంటి బ్లాక్ బస్టర్స్ తర్వాత గోపీచంద్, డైరెక్టర్ శ్రీవాస్ కలయికలో వస్తున్న హ్యాట్రిక్ మూవీ 'రామబాణం'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రానికి వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ఈనెల 5న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తున్న నేపథ్యంలో ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన జగపతి బాబు మీడియాతో మాట్లాడుతూ, "రామబాణం' ఒప్పుకోవడానికి కారణం ఇప్పుడన్నీ హారర్, యాక్షన్, థ్రిల్లర్స్ ఎక్కువగా వస్తున్నాయి. ఫ్యామిలీ డ్రామా వచ్చి చాలా కాలమైంది. అలాగే గోపీచంద్, శ్రీవాస్, నేను కలిసి 'లక్ష్యం' చేశాం.దీంతోపాటు ఇందులో అన్నదమ్ముల కాన్సెప్ట్ అద్భుతంగా కుదిరింది. ఇది చాలా మంచి ఉద్దేశంతో చేసిన సినిమా. హాయిగా ఓ మంచి సినిమా చూసామనే అనుభూతినిస్తుంది. పాత్ర పరంగా నాకు సంతృప్తినిచ్చిన చిత్రమిది. ఎందుకంటే ఇప్పటి వరకూ దాదాపు 70కి పైగా క్యారెక్టర్ రోల్స్ చేశాను. అయితే ఇందులో చెప్పుకోవడానికి ఏడెనిమిది సినిమాలే ఉన్నాయి. ముఖ్యంగా ఈ సెకెండ్ ఇన్నింగ్స్‌లో 'లెజెండ్', 'అరవింద సమేత', 'రంగస్థలం' చేసిన పాత్రలు చాలా తృప్తినిచ్చాయి. కొన్ని సరిగ్గా వాడుకోలేదనే చెప్పాలి. దర్శకుడు శ్రీవాస్ ఈ చిత్రాన్ని పవర్‌ఫుల్‌గా తెరకెక్కించాడు. అలాగే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాతలు మోస్ట్ కంఫర్టబుల్ ప్రొడ్యూసర్స్. సెకండ్ ఇన్నింగ్స్‌లో మార్కెట్, స్టార్ డమ్ పెరిగాయి. అలాగే నా జీవితమే పెరిగింది.(నవ్వుతూ) పాత్రల పరంగా గాడ్‌ఫాదర్, అలాగే 'గాయం'కు మరో స్థాయిలో ఉండే పాత్ర చేయాలని ఉంది' అని అన్నారు.

ప్రేక్షకాదరణ వల్లే సాధ్యమైంది..



అల్లరి నరేష్

కామెడీ పాత్రలు చాలా సునాయాసంగా చేసిన నాకు యాక్షన్ రోల్స్ చేయడం సవాల్‌గా అనిపించింది. అయితే క్రిష్ 'గమ్యం', సముద్రఖని 'శంభో శివ శంభో' ఇప్పుడు విజయ్ 'నాంది, ఉగ్రం'తో వచ్చింది. నన్ను దర్శకుడు నమ్మితే దాని రిజల్ట్ వేరేలా ఉంటుంది. ఇంత ఇంటెన్స్ రోల్ చేస్తానని కలలో కూడా అనుకోలేదు. ఈ క్రెడిట్ అంతా విజయ్‌కి వెళ్తుంది' అని హీరో నరేష్ అన్నారు. 'నాంది' వంటి విజయవంతమైన చిత్రాన్ని అందించిన అల్లరి నరేష్, డైరెక్టర్ విజయ్ కనకమేడల మరో యూనిక్, ఇంటెన్స్ మూవీ 'ఉగ్రం'తో వస్తున్నారు. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించారు. మిర్నా మీనన్ నాయిక. ఈనెల 5న సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో అల్లరి నరేష్ మీడియాతో ముచ్చటించారు.

'ఇందులో మూడు వేరియేషన్స్‌లో ఉండే పాత్రలో కనిపిస్తాను. ఈ చిత్ర ట్రైలర్‌కి మంచి రెస్పాన్స్ వస్తోంది. యాంగ్రీ మ్యాన్ పాత్రలో నన్ను ప్రేక్షకులు ఇష్టపడుతున్నారని అర్థమైంది. ఇందులో యాక్షన్ సహజంగా ఉంటుంది. దర్శకుడు విజయ్ ఏం కావాలో చాలా క్లారిటీగా తెలుసు. ఈ సినిమాలో తాను అనుకున్నది డెలివర్ చేశాడు. మీర్నా, కూతురుగా నటించిన ఊహ అద్భుతంగా చేశారు. మా నిర్మాతలు ఎక్కడా రాజీపడలేదు. ఇది నా 60వ సినిమా. ఇన్ని సినిమాలు కేవలం ప్రేక్షకుల ఆదరణ వల్లే సాధ్యమైంది. దర్శకత్వం చేసే ఆలోచన ఉంది. కానీ దానికి చాలా సమయం ఉంది. నాన్న (ఇవివి) చివరి రోజుల్లో అలీ బాబా అరడజను దొంగలకి సీక్వెల్‌గా అలీ బాబా డజను దొంగలు చేద్దామని అనుకున్నాం' అని నరేష్ చెప్పారు.

నటుడు, దర్శకుడు, నిర్మాత
మనోబాల కన్నుమూత



మనోబాల

ప్రముఖ తమిళ నటుడు, దర్శకుడు, నిర్మాత మనోబాల (69) చెన్నైలో తుదిశ్వాస విడిచారు. గత రెండు వారాలుగా కాలేయ సంబంధ సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్న ఆయన బుధవారం కన్నుమూశారు. 35 ఏండ్ల సినీ ప్రస్థానంలో ఆయన 450కిపైగా చిత్రాల్లో నటించారు. అలాగే పలు సీరియల్స్‌లోనూ నటించి మెప్పించారు. మనోబాలకు భార్య ఉష, కుమారుడు హరీష్ ఉన్నారు. భారతీరాజా 'పుతియ వర్పుగల్'తో కెరీర్‌ను ప్రారంభించిన ఆయన ఇటీవల విడుదలైన చిరంజీవి 'వాల్తేరు వీరయ్య'లోనూ కనిపించారు. నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా.. ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన మనోబాల మృతిపట్ల కమల్‌హాసన్, రజనీకాంత్ వంటి ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

థ్రిల్ చేసే అథర్వ



కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి

ప్రస్తుతం కంటెంట్ చిత్రాలకు ఎంతటి ఆదరణ ఉందో అందరికీ తెలిసిందే. అటు కమర్షియల్ చిత్రాలను ఆదరిస్తూనే, ఇటు ప్రయోగాత్మక చిత్రాలకూ తెలుగు ప్రేక్షకులు పెద్ద పీట వేస్తున్నారు. నూతన దర్శకులు కొత్త కొత్త కాన్సెప్ట్‌లతో ఆడియెన్స్ ముందుకు వస్తున్నారు. ఈ తరహాలోనే ఉన్న 'అథర్వ' సినిమా త్వరలోనే ఆడియెన్స్ ముందుకు రానుంది.

నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో పెగ్గో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా నటీ నటులుగా తెరకెక్కుతున్న సినిమా 'అథర్వ'. డిఫరెంట్ కాన్సెప్ట్‌ని టచ్ చేస్తూ క్రైమ్ థ్రిల్లర్ మూవీగా రూపొందుతున్న ఈ సినిమాకు మహేష్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. సుభాష్ నూతలపాటి నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. విజయ, ఝాన్సీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్‌గా వ్యవహరిస్తున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ప్రస్తుతం చివరి దశలో ఉన్నాయి. ఇప్పటికే విడుదల చేసిన టైటిల్ లోగో, మోషన్ పోస్టర్, టీజర్, ఫస్ట్ లుక్.. ఇలా అన్నింటికి మంచి రెస్పాన్స్ వచ్చింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా రాబోతోన్న ఈ మూవీకి సంబంధించిన అప్డేట్‌ను మేకర్లు తాజాగా అనౌన్స్ చేశారు. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ప్రస్తుతం చివరి దశలో ఉన్నాయని, ఈ సినిమాను జూన్‌లో పెద్ద ఎత్తున రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శక నిర్మాతలు ఈ అనౌన్స్‌మెంట్‌లో తెలిపారు.

సామాజిక ప్రయోజనం కోసం
మహిషాసురుడు



రిచా కర్లా

సామాజిక ప్రయోజనం, బాధ్యతలను దృష్టిలో పెట్టుకుని 'మహిషాసురుడు' చిత్రాన్ని నిర్మిస్తున్నామని మేకర్స్ తెలిపారు. అనిరుధ్, అపరాజిత సమర్పణలో శ్రీ శివరామ ఆర్ట్స్ పతాకంపై ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎస్.గురుప్రసాద్ ప్రధాన పాత్రలో వినోద్, రిచా కర్లా, ధరణి రెడ్డి హీరో హీరోయిన్లుగా ఈ సినిమా రూపొందుతోంది. రవికుమార్ గోనుగుంట దర్శకత్వం వహించిన ఈ చిత్ర ఆడియో బుధవారం ఫిలిం ఛాంబర్‌లో జరిగిన వేడుకలో విడుదలైంది. ముఖ్య అతిథులుగా విచ్చేసిన దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, తనికెళ్ళ భరణి, రేలంగి నరసింహారావు, గౌతం రాజు సంయుక్తంగా ఆడియోను విడుదల చేశారు.

ఈ సందర్భంగా ప్రధాన పాత్రధారి, నిర్మాత డాక్టర్ ఎస్.గురుప్రసాద్ మాట్లాడుతూ, 'ప్రాణాలను కాపాడే కోట్లాది రూపాయలు ఖర్చయ్యే వైద్య పరికరాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకునే బదులు వాటిని మన దేశంలోనే తయారు చేసుకుంటే తక్కువ ఖర్చుతో వైద్య సహాయం అందివచ్చు అనే పాయింట్‌తో ఈ సినిమాను తీశాం. మన దేశంలో పరిశోధనలు చేసే సైంటిస్ట్‌లకు తగినంత గుర్తింపు లేదనే వాస్తవ అంశాలను సమాజానికి, ప్రభుత్వాలకు తెలియజేయాలనే సంకల్పంతో, అలాగే ఫైనాన్స్ కంపెనీల ప్రలోభాలకు లొంగి డబ్బులు తీసుకొని, వాళ్ల ఉచ్చులో చిక్కుకొని బయటకు రాలేక ఎన్నో కుంటుబాలు ఆత్మహత్యలు చేసుకొంటున్నాయి అనే మరో అంశాన్ని కూడా ఈ చిత్రంలో చూపించాం' అని చెప్పారు.

'ఎంతో బిజీ కార్డియాలజిస్ట్ అయిన గురుప్రసాద్‌కు ఈ సినిమా చేయాల్సిన అవసరం లేదు. సమాజానికి మేలు చేయాలి, తక్కువ ఖర్చుతో వైద్య పరికరాలను మన దేశంలోనే తయారు చేసుకోగలిగితే ఎంతోమంది ప్రాణాలను కాపాడే వీలవుతుందన్న ఆయన తపనే ఈ చిత్ర నిర్మానికి మూలం. సినిమా చాలా బాగా వచ్చింది' అని దర్శకుడు అన్నారు.

పదేళ్ల కష్టం బలగంతో ఫలించింది



సంజయ్ కృష్ణ

పదేళ్ల కష్టం బలగంతో ఫలించిందని నటుడు సంజయ్ కృష్ణ చెప్పారు. ఈనెల 5న ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా సంజయ్‌కృష్ణ మాట్లాడుతూ, 'అమెరికాలో ఎంబీఏ చేసి, ఇండియాలో ఎల్ఎల్‌బీ చేశా. నటుడిగా చేసిన ప్రయత్నాల్లో తొలిసారి 'కాళి చరణ్'లో ఛాన్స్ వచ్చింది. తర్వాత 'అప్పట్లో ఒకడుండేవాడు'లో మంచి క్యారెక్టర్ రావడంతో 'కాటమ రాయుడు'లో నటించే ఛాన్స్ వచ్చింది. 'ఆచార్య, గని, అఖండ, భీమ్లానాయక్'.. అలా మొత్తం 32 సినిమాల్లో నటించినప్పటికీ సరైన బ్రేక్ రాలేదు. కానీ 'బలగం' పెద్ద హిట్ కావడంతో ఇన్నేళ్ల కష్టం ఫలించింది. ఈ మూవీ తర్వాత నాలుగైదు ప్రాజెక్ట్‌లు లైన్‌లో ఉన్నాయి. అలాగే ప్రస్తుతం నాగశౌర్య 'రంగబలి'లోనూ నటిస్తున్నా' అని చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ఉక్కు ఉద్యమంపై నిర్బంధం

ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు

- పలు జిల్లాల్లో నేతల గృహనిర్బంధం, అక్రమ అరెస్టులు


విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులను అరెస్టు చేసి తరలిస్తున్న పోలీసులు, (ఇన్‌సెట్‌లో) గాజువాకలో సిహెచ్.నర్సింగరావు, పల్లా శ్రీనివాసరావు తదితరులను అరెస్టు చేస్తున్న పోలీసులు

విశాఖ : ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక ఆధ్వర్యాన బుధవారం చేపట్టిన ఆందోళనపై ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించింది. పలు జిల్లాల్లో వామపక్ష పార్టీలు, కార్మిక, ప్రజాసంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. గృహ నిర్బంధాలకు పాల్పడ్డారు. రాస్తారోకోలను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. విజయవాడ బందరు రోడ్డులోని పశువుల ఆస్పత్రి నుండి వారధి వైపు వెళ్తున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, కె ప్రభాకర్‌రెడ్డి, ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పి.ప్రసాద్, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామన్న, సిపిఐ నాయకులు వీరభద్రరావు తదితరులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి భవానీపురం స్టేషన్‌కు తరలించారు. పోలీసు వాహనంలో విచక్షణారహితంగా ఎత్తిపడేయడంతో ఎస్ఎఫ్ఐ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు సోమేశ్వరరావు మోచేతికి ఇనుప రాడ్ గీసుకుపోయి రక్తస్రావమైంది. వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ నేతలు స్టేషన్లోనూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ తెలుగు ప్రజల బలిదానంతో ఏర్పడిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేట్‌పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకోవడం దారుణమన్నారు. ప్రయివేట్ స్టీల్ ప్లాంట్లకు సొంత ఉక్కు గనులు కేటాయించిన కేంద్రం... ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేటాయించకపోవడం తగదని తెలిపారు. వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణకు జరుగుతున్న ఉద్యమంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించడం శోచనీయమన్నారు. కేంద్రంతో పోరాడి ఉక్కు ఫ్యాక్టరీని కాపాడేందుకు కలిసి రావాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు విశాఖ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తుంటే, అదానీ పంపిన ప్రత్యేక విమానంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి భోగాపురం ఎయిర్‌పోర్ట్ శంకుస్థాపనకు వెళ్లడం సిగ్గుచేటన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిని భవానీపురం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పరామర్శించారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు ప్రతిపక్షాలు నిర్వహిస్తోన్న పోరాటానికి వైసిపి మద్దతు ఇవ్వాలని కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక నాయకులు వి.ఉమామహేశ్వరరావు, రావులపల్లి రవీంద్రనాథ్, సిపిఐ (ఎంఎల్) నాయకులు హరినాథ్ తదితరులను మంగళవారం రాత్రి నుండే పోలీసులు గృహనిర్బంధం చేశారు. గన్నవరం తదితర ప్రాంతాల్లో అఖిలపక్ష రైతు సంఘాలు, సిపిఎం, సిపిఐ, ప్రజా సంఘాల నేతలను అరెస్టు చేశారు. పలువురు నేతలను గృహ నిర్బంధంలో ఉంచారు. మరికొందరికి నోటీసులు ఇచ్చారు.

విశాఖలో పలుచోట్ల రాస్తారోకోలు జరిగాయి. మూడు కిలోమీటర్లు మేర ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడానికి ఎంతటి త్యాగానికైనా సిద్ధమన్నారు. గాజువాకలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సహా 16 మందిని, కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ బి.ఆదినారాయణ, పోరాట కో-కన్వీనర్ జె.అయోధ్యరాం తదితర కార్మిక నాయకులను, 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు సహా 26 మందిని, మద్దిలపాలెంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు సహా 25 మందిని, అనకాపల్లిలో కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీలు, ఆప్, కాంగ్రెస్ పార్టీ నాయకులను పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. పెదగంట్యాడ, గాజువాకలో జరిగిన కార్యక్రమాల్లో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రజల సంపద అని, దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయివేట్‌పరం కానివ్వబోమన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తదితరులను పోలీసులు గృహనిర్బంధం చేశారు. శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల వామపక్ష, సిఐటియు, ఎఐటియుసి నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. గృహ నిర్బంధం, ముందస్తు అరెస్టులకు పాల్పడ్డారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రాస్తారోకో చేస్తున్న వారిని పోలీసులు చెదరగొట్టే ప్రయత్నం చేశారు. దీంతో, నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై కూర్చుని నిరసన తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో సిఐటియు, ఎఐటియుసి, సిపిఎం, సిపిఐ నాయకులను, గుంటూరులో సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు పాశం రామారావు, జంగాల అజయ్‌కుమార్‌లను, పల్నాడు జిల్లా నర్సరావుపేటలో సిపిఎం జిల్లా గుంటూరు విజయకుమార్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణలను పోలీసులు అరెస్టు చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో రాస్తారోకో సందర్భంగా పోలీసులకు, కార్మిక సంఘాల నాయకులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో పోలీసులు అరెస్టులు, గృహ నిర్బంధాలకు పాల్పడ్డారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు జరిగాయి.

అక్రమ అరెస్టులను ఖండించిన సిపిఎం రాష్ట్ర కమిటీ

అక్రమ అరెస్టులను, గృహ నిర్బంధాలను సిపిఎం రాష్ట్ర కమిటీ ఒక ప్రకటనలో ఖండించింది. ఉద్యమానికి రాష్ట్ర ప్రభుత్వం నాయకత్వం వహించి ముందుకు నడపాల్సింది పోయి నిర్బంధానికి పూనుకోవడం సిగ్గుచేటని పేర్కొంది. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాడుతున్న వారిపై నిర్బంధం ప్రయోగించి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కుయుక్తులకు రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు పలకడం గర్హనీయమని విమర్శించింది. రాష్ట్ర ప్రజలు ఎన్నో త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను తెగనమ్మేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, వీటిని తిప్పికొట్టాలని కోరింది. ముఖ్యమంత్రి పర్యటన పేరుతో ఉత్తరాంధ్రలో ట్రేడ్ యూనియన్, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులలను ఎక్కడికక్కడ గృహ నిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండించింది. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది.

ఉన్నత విద్యా వ్యవస్థ పతనమే..!

ప్రమాణాలను దిగజారుస్తున్న కేంద్రం

- కోజికోడ్ సెమినార్‌లో ప్రముఖ ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్ విమర్శ



కోజికోడ్ : దేశంలో ఉన్నత విద్యా వ్యవస్థలో ప్రమాణాలను కేంద్ర ప్రభుత్వం దిగజారుస్తోందని ప్రముఖ ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. తిరువనంతపురంలోని ఏకేజీ సెంటర్ ఫర్ స్టడీ అండ్ రీసెర్చ్, కోజికోడ్‌లోని కేలూటన్ సెంటర్ ఫర్ స్టడీ అండ్ రీసెర్చ్ సంయుక్తంగా విద్యపై నిర్వహించిన మూడు రోజుల సెమినార్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థి ఏం తెలుసుకోవాలి, ఏం తెలుసుకోకూడదనే విషయంలో ఏకపక్ష జోక్యం చాలా ఎక్కువగా వుందని పట్నాయక్ తెలిపారు. "ఇటువంటి మార్పులు పాఠ్యపుస్తకాల్లో ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. చార్లెస్ డార్విన్ సిద్ధాంతం ఎక్కడా కనిపించదు, మొఘల్ సామ్రాజ్యం ఊసే వుండదు, దేశంలో దారిద్ర్యం మాటే లేదు. స్వాతంత్ర్యోద్యమంలో ప్రభావవంతమైన పాత్ర పోషించిన మౌలానా అబ్దుల్ కలామ్ అజాద్ గురించి చర్చే లేదు." అని ఆయన పేర్కొన్నారు.మరో స్థాయిలో చూసినట్లైతే, విద్యాబోధనతో అస్సలేమాత్రం సంబంధం లేని వ్యక్తులను యూనివర్శిటీల వైస్ ఛాన్సలర్లుగా లేదా ఫ్యాకల్టీ సభ్యులుగా చేస్తున్నారు. "ఢిల్లీ యూనివర్శిటీలో, ఏండ్ల తరబడి తాత్కాలిక హోదాలో బోధిస్తున్న అనుభవజ్ఞులైన వారి స్థానంలో ఆర్ఎస్ఎస్, బీజేపీలకు సన్నిహితులైన వారిని నియమిస్తున్నారు." అని ఆయన విమర్శించారు. కేంద్ర నూతన విద్యా విధానాన్ని ప్రస్తావిస్తూ, గత విద్యా విధానాల ప్రస్తావన లేకుండానే దీన్ని తీసుకువచ్చారని విమర్శించారు. "గతంలోని వాటికన్నా మెరుగైన రీతిలో తీసుకువస్తున్నామనే కాకుండా, విద్య పట్ల ప్రస్తుత గుత్తాధిపత్య ధోరణిని ప్రజల ముందు ప్రతిబింబించేలా ఈ విద్యా విధానం వుంది. భారత రాజకీయాల్లో ప్రస్తుత గుత్తాధిపత్యాన్ని కార్పొరేట్-హిందూత్వ కూటమి అనుసరిస్తోంది. నయా ఉదారవాదం, నయా ఫాసిజం మధ్య పొత్తు ద్వారా వ్యక్తమవుతున్న అంతర్జాతీయ పోకడల్లో ఇదొక భాగంగా కూడా వుంది." అని ఆయన పేర్కొన్నారు. రాజకీయాల్లో, సమాజంలో ఈ కూటమి స్థానాన్ని మరింత బలోపేతం చేయాలన్నదే ప్రస్తుత విధానం లక్ష్యంగా వుంది. "ఇటువంటి కూటమి సమాజంలోని ఏ విమర్శనాత్మక ఆలోచననైనా లేదా సృజనాత్మకతనైనా ధ్వంసం చేయగలదు. సమాజంలో విమర్శనాత్మకంగా ఆలోచించే వారిని అణగదొక్కడం వారిని జాతి వ్యతిరేక శక్తిగా పేర్కొనడం నయా ఉదారవాద, నయా ఫాసిస్ట్ కూటమి ప్రయోజనంగా వుంది. విద్యా కార్యకలాపాల పరిధి నుంచి సాధారణ ప్రజలు మినహాయించబడుతున్నారు. విశ్వవిద్యాలయాల కోసం నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష అనేది విశ్వవిద్యాలయ ప్రవేశ వ్యవస్థను ఒక వ్యాపార వస్తువుగా మార్చడానికి దారి తీస్తోందని అన్నారు. "మీకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష వుంటే, కోచింగ్ తరగతులు వుండాలి, దాని కోసం మీరు డబ్బు చెల్లించాలి, ఇంతా చేస్తే మీ తుది ఫలితాలు మీరు అడ్మిషన్ పొందడానికి సరిపడా వుండవు, నిరుపేద నేపథ్యం కలిగిన ఒక విద్యార్థి వద్ద కోచింగ్ క్లాస్‌లకు వెళ్లడానికి సరిపడా డబ్బు వుండదు" అని పట్నాయక్ పేర్కొన్నారు. రిజర్వేషన్ రేంజ్ అనేది విద్యా విధానంలో ప్రస్తావించని కారణంగా రిజర్వేషన్ ప్రయోజనాలను తిరస్కరించడం మరో అంశంగా వుందన్నారు.

ఆత్మగౌరవ పోరాటం

బీజేపీలో వ్యక్తులదే రాజ్యం

- అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే: సీనియర్ నేత జగదీశ్ శెట్టార్ వెల్లడి



బెంగళూరు : బీజేపీ ఆధిపత్య ధోరణులపై ఆగ్రహం వ్యక్తం చేసి ఆ పార్టీ వీడి కాంగ్రెస్‌లో చేరిన మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టార్ ఈ ఎన్నికల్లో తాను చేస్తున్న పోరాటం ఆత్మగౌరవ పోరాటం అని చెప్పారు. లింగాయత్‌లపై ఆధారపడని కేంద్ర నాయకత్వానికి కీలుబొమ్మగా ఉండే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని బిజెపి పగటి కలలు కంటోందని, అది నెరవేరబోదని ఆయన తెలిపారు. ఇక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై ఆయన స్పందిచారు. బీజేపీలో వ్యక్తులదే రాజ్యమని, ఈ దఫా ఎన్నికల్లో కాంగ్రెస్సే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన అన్నారు.

బీజేపీతో సుదీర్ఘకాలం పనిచేసిన మీరు కాంగ్రెస్‌లో ఎందుకు చేరారు?

» రాష్ట్రంలో బీజేపీ అభివృద్ధి కోసం ఎంతో కష్టపడి పనిచేశా. ప్రత్యేకించి ఉత్తర కర్నాటకలో గత 30 ఏండ్లుగా బీజేపీని బలోపేతం చేస్తూ వచ్చాను. వరుసగా ఆరు పర్యాయాలు కనీసం 25 వేలు ఓట్ల మెజార్టీ పైబడే విజయం సాధిస్తూ వచ్చాను. అయితే ఇదంతా పట్టించుకోని బీజేపీ అధిష్టానం చివరి క్షణంలో టిక్కెట్ ఇవ్వడం లేదని చెప్పేసింది. అది కూడా ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఇంతకంటే అవమానం ఉంటుందా? నా ప్రశ్నలకు బీజేపీ అధినేత జెపి నడ్డా సైతం సమాధానాలు ఇవ్వకుండా ముఖం చాటేశారు. అందుకే ఆత్మగౌరవం కోసం బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరా. ఇది ఆత్మగౌరవం కోసం చేస్తున్న పోరాటం.

పార్టీయే ముందు..వ్యక్తులు తర్వాత అని బీజేపీ అంటుంటుంది కదా?

» అదంతా ఒట్టిదే. బీజేపీ లో వ్యక్తులదే రాజ్యం. ఇక్కడే చూడండి పార్టీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అయిన బిఎల్ సంతోష్ ఇష్టానుసారం నడుస్తోంది. అతను ఏది చెప్పితే అదే ఫైనల్. పార్టీ అనేది తర్వాత అంశం. వ్యక్తులే ప్రధానం.

ఒకవేళ బీజేపీ గెలిస్తే ముఖ్యమంత్రి అభ్యర్థిగా పోటీలో ఉంటారనే ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై మీ అడ్డు తొలగించుకున్నారంటారా?

» అంతే కదా? అందుకనే టిక్కెట్ రాకుండా చేశారు. సీఎం బొమ్మై, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, సంతోష్ అందరూ రేసులో ఉన్నారు. బిఎస్ ఎడ్యూరప్ప తర్వాత లింగాయత్‌లలో నేనే సీనియర్ నేత. తప్పకుండా నాకే ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు ఎక్కువ. అందుకనే తప్పించారు. అయితే ముఖ్యమంత్రి పదవి నాకు వద్దు అని, రాతపూర్వకంగా కూడా రాసిస్తానన్నా వారు నమ్మలేదు.

ఇప్పుడు ఆర్ఎస్ఎస్‌తో మీ అనుబంధం కొనసాగుతుందా?

» ఆర్ఎస్ఎస్‌తో నాది సుదీర్ఘకాలం అనుబంధం. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరినందున ఆర్ఎస్ఎస్‌తో కొనసాగలేను. అక్కడితో నా సంబంధాలు తెగిపోయాయి. అయితే ఆర్ఎస్ఎస్ నేతలతో వ్యక్తిగతంగా ఉన్న అనుబంధం మాత్రమే కొనసాగుతుంది.

అయితే లింగాయత్‌లను కాంగ్రెస్ చులకనగా చూస్తోందన్న ఆరోపణ ఉంది కదా?

» ఆ విమర్శతో నేను అంగీకరించను. కాంగ్రెస్ సుమారు 50 మంది లింగాయత్‌లను ఈ ఎన్నికల్లో బరిలో నిలిపింది. కాంగ్రెస్ హయంలో ఎంబి పాటిల్ వంటి వారికి కీలక పదవులు ఇచ్చారు. వాస్తవానికి లింగాయత్‌లతో ఆధారపడని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నది బీజేపీ అజెండా లింగాయత్‌లను చులకనగా చూస్తున్నది బీజేపీ యే.

మీరు బీజేపీ వీడటం వల్ల ఈ ఎన్నికల్లో ప్రభావం ఏమిటి?

» బీజేపీని వీడటం వల్ల నా ప్రభావం కనీసం 20-22 స్థానాల్లో ఉంటుంది. అనేక జిల్లాల్లో చాలా మంది లింగాయత్ నేతలు ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరారు కూడా. అయితే నాకు మద్దతు ఇవ్వకుండా చేయాలని బీజేపీ అధిష్టానం నుంచి లింగాయత్ నేతలకు బెదిరింపులు వస్తున్నాయి. ఐటీ, ఈడీ దాడులు చేస్తామంటూ బెదిరిస్తున్నారు.

ఇది మీకు చావో రేవో తేల్చుకోవాల్సిన ఎన్నికలా?


» అదేం కాదు. మరో పదేళ్లు నేను క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగుతాను.

కాంగ్రెస్‌లో ప్రస్తుతం మీ పొజిషన్ ఏమిటి?

» నేను కాంగ్రెస్‌లో సామాన్య కార్యకర్తగా చేరాను. ఏదో పదవి ఆశించి కాదు. కార్యకర్తగానే కొనసాగుతాను. కాంగ్రెస్‌లో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి. ఎంతో పురోగతి ఉంది. కచ్చితంగా కర్నాటకలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్న విశ్వాసముంది.

మనీబిల్లులపై ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం

సీజేఐ డివై చంద్రచూడ్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు ద్రవ్య బిల్లులుగా చట్టాలను ఆమోదించడంతోపాటు కొన్ని రాజ్యాంగపరమైన కేసులను విచారించేందుకు ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలన్న అభ్యర్థనను పరిశీలిస్తామని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డివై చంద్రచూడ్ తెలిపారు. బుధవారం మనీ బిల్లులకు సంబంధించిన విషయాన్ని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ ప్రస్తావించారు. "మనీబిల్లుల సమస్య ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం అంశం" అని సింఘ్వీ అన్నారు. "ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్నాను. పరిశీలిస్తాను" అని సిజెఐ బదులిచ్చారు.మనీ బిల్లులు ప్రత్యేకంగా పన్నులు విధించడం, కన్సాలిడేటెడ్ ఫండ్ నుండి డబ్బును కేటాయించడం కోసం నిబంధనలను కలిగి ఉన్న బిల్లులు. వాటిని లోక్‌సభలో మాత్రమే ప్రవేశపెడతారు. రాజ్యసభ ద్రవ్య బిల్లులకు సవరణలను మాత్రమే సూచించగలదు. రాజ్యసభ ద్రవ్య బిల్లులపై చేసిన సిఫార్సులను లోక్‌సభ ఆమోదించాల్సిన అవసరం లేదు. ఆ సిఫారసులను తిరస్కరించవచ్చు. 2019 నవంబర్‌లో ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం, ఆర్థిక చట్టం-2017ను మనీ బిల్లుగా ఆమోదించడాన్ని విస్తృత ధర్మాసనం నిర్ణయించాలని ఆదేశించింది. ట్రిబ్యునళ్ల పనితీరును నియంత్రించే పథకాలను పునరుద్ధరించిన ఆర్థిక చట్టం-2017కు సవాలుతో సహా ట్రిబ్యునళ్ల పనితీరుకు సంబంధించిన పిటిషన్‌ల విచారణలో ధర్మాసనం ఈ ఆదేశాన్ని ఇచ్చింది. ఆ సందర్భంలో లోక్‌సభలో ఆమోదించబడిన బిల్లుకు సంబంధించి రాజ్యసభ చేసిన సూచనలన్నీ పక్కనపెడుతూ చేసిన చట్టం 2017 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది.మనీ బిల్లు రూపంలో ఆర్థిక చట్టాన్ని ఆమోదించడం పూర్తిగా సరికాదని, రాజ్యాంగాన్ని మోసం చేయడమేనని పిటిషనర్లు పేర్కొన్నారు. ఆధార్ చట్టాన్ని మనీ బిల్లుగా ఆమోదించడంపై గతంలో తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు ఆమోదించింది. ఆ నిర్ణయం కూడా ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనందే కాబట్టి, సుప్రీంకోర్టు 2019లో ఈ అంశాన్ని ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనానికి సూచించాలని నిర్ణయించింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, అప్పుడు న్యాయమూర్తిగా ఉన్న సీజేఐ చంద్రచూడ్ ఆధార్ కేసులో విభేదించారు. ఆధార్ చట్టాన్ని మనీ బిల్లుగా ఆమోదించలేరని అన్నారు.

బిజినెస్

నేడు గో ఫస్ట్ దివాలాపై విచారణ

- పిటిషన్ స్వీకరించిన ఎన్‌సిఎల్‌టి
- ఛార్జీలు పెంచే పనిలో ఇతర సంస్థలు




ముంబయి : చౌక ధరల విమానయాన సంస్థ గో ఫస్ట్ దివాలా పిటిషన్‌ను గురువారం నాడు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) విచారించనుంది. వాడియా గ్రూప్ యాజమాన్యంలోని ఆ సంస్థ నిధుల కొరత వల్ల మే 3, 4 తేదిల్లో విమానాలను రద్దు చేసుకుంది. స్వచ్ఛంద దివాలా పరిష్కార ప్రక్రియకు దరఖాస్తు చేసినట్లు ఆ కంపెనీ సిఇఒ మంగళవారం తెలిపారు. తక్షణ పరిష్కార చర్యల్లో భాగంగా ఏప్రిల్ 4న ముంబయి ఎన్‌సిఎల్‌టి బెంచ్ ఈ కేసును విచారించనుంది. దివాలా ప్రక్రియ ద్వారా గో ఫస్ట్‌కు పునర్జీవం పోయాలని భావిస్తున్నామని ఆ కంపెనీ సిఇఒ ఖోనా వెల్లడించారు. గో ఫస్ట్ విమాన సంస్థకు 55 విమానాలు ఉన్నాయి. భారత విమానయాన మార్కెట్‌లో దాదాపు 7 శాతం వాటా కలిగి ఉంది. కాగా.. అమెరికాకు చెందిన ప్రాట్ అండ్ విట్నీ (పిడబ్ల్యు) సంస్థ సకాలంలో ఇంజిన్లను సరఫరా చేయకపోవడం వల్లే ఆర్థిక సంక్షోభ ఇబ్బంది పరిస్థితులు నెలకొన్నాయని గో ఫస్ట్ ప్రధానంగా ఆరోపించింది. ఇంజిన్ల సమస్యలతో గో ఫస్ట్ సంస్థ 57 విమానాల్లో 28 కార్యకలాపాలను నిలిపివేయాల్సి వచ్చిందని.. దీంతో ఆర్థిక పరిస్థితులు మరింత గడ్డుగా మారాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఆరోపణలను పిడబ్ల్యు సంస్థ ఖండించింది. తమ వినియోగదారులకు డెలివరీ షెడ్యూల్ల విషయంలో ప్రాధాన్యతనిస్తూనే ఉన్నామని పేర్కొంది. గో ఫస్ట్ విమానాల రద్దుతో ఇతర విమానయాన కంపెనీలు తమ సర్వీసులను పెంచుకునే పనిలో పడ్డాయి. కొత్తగా 25 విమానాలను పునరుద్ధరించుకునేందుకు రూ.400 కోట్లు సమీకరించామని స్పైస్‌జెట్ వెల్లడించింది.

చార్జీలు పెరగొచ్చు

విద్యార్థులకు వేసవి సెలవులు కావడంతో పర్యాటక రంగం పుంజుకుంటుంది. మరోవైపు గో ఫస్ట్ విమానాల రద్దుతో రద్దీ పెరిగింది. వేసవి షెడ్యూల్‌లో భాగంగా మార్చి 26 నుంచి అక్టోబర్ 28 మధ్య గో ఫస్ట్ వారానికి 1538 విమాన సర్వీసులు నడపాల్సి ఉంది. ఇవి రద్దు కావడంతో ఆ అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి ఇతర విమానయాన కంపెనీలు ప్రణాళికలు రూపొందిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో చార్జీలు పెంచితే ప్రయాణికులపై మరింత భారం పడనుంది.

అదాని విల్మర్ లాభాలు 60% పతనం

- 5 శాతం పడిపోయిన షేర్



న్యూఢిల్లీ : అదాని గ్రూపులోని వంట నూనెల కంపెనీ అదాని విల్మర్ బలహీన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం (2022-23) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో రూ.93.6 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. ఇంతక్రితం ఏడాది ఇదే కాలంలో రూ.234.29 కోట్ల లాభాలు సాధించింది. దీంతో పోల్చితే గడిచిన క్యూ4 లాభాల్లో 60 శాతం పతనం చోటు చేసుకుంది. వంట నూనెల అమ్మకాలు తగ్గడంతో లాభాలు తగ్గాయి. క్రితం క్యూ4లో కంపెనీ రెవెన్యూ, అమ్మకాలు 7శాతం పతనమై రూ.13,872 కోట్లుగా నమోదయ్యాయి. 2021-22 ఇదే క్యూ4లో రూ.14,917 కోట్ల రెవెన్యూ సాధించింది. అదాని విల్మర్ నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించడంతో ఆ కంపెనీ షేర్ పడిపోయింది. బుధవారం బిఎస్ఇలో అదాని విల్మర్ షేర్ 4.30 శాతం పతనమై రూ.397.65 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఏకంగా 6.11 శాతం కోల్పోయి రూ.390.10 కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది.

పిన్ లేకుండానే ఫోన్‌పేతో చెల్లింపులు



బెంగళూరు : తమ యాప్‌లో యుపిఐ లైట్ ఫీచర్ సేవలను ప్రారంభించినట్లు ఫోన్ పే వెల్లడించింది. ఈ ఖాతాతో పిన్ ప్రవేశపెట్టకుండానే ఒకే ట్యాప్ ద్వారా రూ.200 కన్నా తక్కువ విలువ కలిగిన చెల్లింపులు చేయవచ్చని ఆ సంస్థ బుధవారం వెల్లడించింది. యుపిఐ లైట్ అన్ని ప్రధాన బ్యాంక్‌లకు మద్దతును ఇస్తుందని, అన్ని యుపిఐ మర్చంట్లు, క్యూఆర్‌లలోనూ అంగీకరించబడుతుందని తెలిపింది. ఈ ఫీచర్ అత్యంత రద్దీ వేళల్లో కిరాణా సరకులు, ప్రయాణాలు లాంటి తక్కువ విలువ కలిగిన లావాదేవీలకు మరింత వేగవంతమైన తక్షణ పేమెంట్ పరిష్కారాలకు వీలు కల్పిస్తుందని పేర్కొంది. వినియోగదారులు వారి లైట్ ఖాతాలో రూ.2,000 వరకు లోడ్ చేసుకుని, ఒకే ప్రయత్నంలో రూ.200 లేదా అంతకన్నా తక్కువ మొత్తం వరకు లావాదేవీలు జరపవచ్చని ఫోన్ పే కో-ఫౌండర్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ రాహుల్ చారి పేర్కొన్నారు. ఫోన్ పే యాప్ తెరిచి.. యాప్ హోమ్ స్క్రీన్‌లో యుపిఐ లైట్‌ను ఎనేబుల్ చేసుకోవడం ద్వారా ఈ సేవలు పొందవచ్చని ఆ సంస్థ తెలిపింది.

ఎన్ఎస్ఇలో విరించి లిస్టింగ్



హైదరాబాద్ : ఐటి, వైద్య, క్రెడిట్ కార్డ్ సేవలందించే విరించి లిమిటెడ్ బుధవారం నేషనల్ స్టాక్ ఎక్సేంజీ (ఎన్ఎస్ఇ)లో లిస్టింగ్ అయ్యింది. ముంబయిలోని ఎన్ఎస్ఇలో గంట మోగించే కార్యక్రమంతో ఈ మైలురాయిని సాధించినట్లు ఆ సంస్థ పేర్కొంది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న తమ సంస్థ ఎన్ఎస్ఇలో లిస్టింగ్ కావడం వల్లన మరింత ఎక్కువగా పెట్టుబడిదారులను చేరడానికి అవకాశం దక్కిందని విరించి లిమిటెడ్ తెలిపింది. ఈ కార్యక్రమానికి విరించి లిమిటెడ్ ప్రమోటర్లు మాధవి లత కొంపెల్ల, కుమారి. లోపముద్ర కొంపెల్లతో పాటూ వైస్ చైర్మన్ వి సత్యనారాయణ, సిఎఫ్ఒ శ్రీనివాస రావు తదితరులు హాజరయ్యారు.


చట్టప్రకారమే ఔటర్ ప్రయివేటుకు.. ఎలాంటి అవకతవకలు లేవు

- పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ వివరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఔటర్ రింగ్ రోడ్డు నిర్వహణను ప్రయివేటు సంస్థకు అప్పగించడంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారంనాడిక్కడి ఎమ్ఏయూడీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 158 కి.మీ., 8 దారుల విస్తీర్ణంతో వృత్తాకారంలో ఉన్న ఈ రహదారి 2006లో ప్రారంభమై 2018లో పూర్తి అయ్యిందని తెలిపారు. దీనిపై టోల్‌చార్జీలను జాతీయ రహదారుల సంస్థ నిర్ణయిస్తుందన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ నిర్ధారించిన టోల్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ (టీఓటీ) పద్ధతిలో దీన్ని 30 ఏండ్లకు లీజుకు ఇవ్వాలని 2022 ఆగస్టు 11న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదించిందని వివరించారు. దాని ప్రకారమే ఫ్రాన్స్‌కు చెందిన కన్సల్టెంట్ సంస్థను మధ్యవర్తిగా ఏర్పాటు చేసి అంతర్జాతీయ బిడ్స్‌ను ఆహ్వానించామన్నారు. దీనిలో నాలుగు సంస్థలు అర్హతపొందాయనీ, దానిలో ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ లిమిటెడ్ సంస్థ రూ.7,380 కోట్లకు అధిక బిడ్ కోడ్ చేసిందని చెప్పారు. నిబంధనల ప్రకారమే 2023 ఏప్రిల్ 27న ఆ సంస్థకు ఓఆర్ఆర్‌ను అప్పగించినట్టు తెలిపారు. ఈ బిడ్డింగ్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా కేంద్ర ప్రభుత్వ విధివిధానాలను అనుసరించే జరిగాయని ఆయన స్పష్టం చేశారు.

"బౌద్ధం... మానవ ధర్మం"



నరసింహ ప్రసాద్ గొర్రెపాటి

మనకో గొప్ప అలవాటుంది. ఎవరైనా ధైర్యం గురించి మాట్లాడగానే భగత్‌సింగ్ పుట్టిన నేల ఇది అనీ, అహింస గురించి అనగానే గాంధీ పుట్టిన దేశమని ఎలా అంటుంటామో ధర్మం అనే పదం రావడమే ఆలస్యం బుద్ధుడు, గౌతమ బుద్ధుడు నడయాడిన భూమి ఇదని తన్మయత్వంతో ఊగిపోతాం. వారందరి స్ఫూర్తి ఈ నేలపై ఈ మనుషులపై ఆవహించి ఉందని నూటికి నూటొక్క పాళ్ళు భ్రమిస్తాం. ఆ భ్రమే నిజమని నమ్ముతాం. ఆ నమ్మకాన్ని మించింది జగత్తులో మరొక్కటి లేదని ఎలుగెత్తి చాటుతాం.

బౌద్ధం ప్రేరణతో క్రీస్తుకు పూర్వం 2200 సంవత్సరాల కిందటే విదేశీ విద్యార్థులను ఆకర్షించే 18 విశ్వ విద్యాలయాలు ఇక్కడ ఏర్పడడంతో నాడు విశ్వగురువు అనిపించుకునే అర్హత దక్కించుకుందీ దేశం. దానికి కారణం బుద్ధుడు-బౌద్ధం. అలాంటి మార్గాన్ని కాదనుకుని కథలు, కూర్పులు, కల్పితాలతో సహవాసం చేసి అవే నమ్మకాలుగా అదే దిక్కుగా దిగజారిన మన జ్ఞానం మూఢ నమ్మకాలకు, అతిశయాలకు, ఆడంబరాలకు వేదికగా మారి ఒకవైపు విపరీతమైన వ్యక్తి పూజ, వ్యక్తి ఆరాధన, మరో వైపు జుగుప్సాకరరీతిలో వ్యక్తిత్వ హననాలతో సాగిపోతోంది.

తిష్ట వేసుకుని ఉన్న మూఢ నమ్మకాల ప్రభావం నుంచి మనుషుల్ని మేల్కొలిపి ప్రజలకు ప్రజ్ఞ, జ్ఞానం, శీలం, కారుణ్యంతో కూడిన విలువల గురించి బోధించి సమతా వాదం, సమభావం పెంపొందించింది బౌద్ధమే. దేవుడూ, అతీంద్రియ శక్తులు, అదృశ్య మహిమల స్థానంలో మనిషి నడవడికకు, నాగరికతకు, నియమాలకు, సంఘ జీవనానికి ప్రాధాన్యత కల్పించిన బౌద్ధానికి కేంద్రం మానవుడే. అందుకే దాస్య విమోచన గురించి, దుఃఖ నిరోధం గురించి, సమ సమాజాన్ని గురించి బోధించి, మూఢ నమ్మకాలకు తావులేకుండా మనిషిని మానవతా విలువల వైపు నడిపించే బౌద్ధం అన్ని మతాల కంటే ఉన్నతమైనది అన్నాడు కారల్ మార్క్స్.

బుద్ధుడు దైవభక్తికి ప్రాధాన్యత ఇవ్వలేదు. దానికి బదులుగా నైతిక విలువలకు ఇచ్చాడు. పుణ్యాల గురించి చిట్టి చిట్కాలు చెప్పలేదు. ధర్మం శరణం గచ్ఛామి అని ధర్మం గురించి చెప్పాడు. స్వర్గలోక ప్రాప్తికి సూక్ష్మ మార్గాలు చెప్పలేదు. అయితే సంఘం శరణం గచ్ఛామి అని సంఘం గొప్పదనం గురించి తెలియ పరిచాడు. సంతోషకరమైన జీవనానికి, విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి ఏం చేయాలో ఎలా ఉండాలో చెప్పిన మహనీయుడు బుద్ధుడు.

మానవ సంబంధాలు, మనుషుల కష్టాలు, బాధల గురించి చింత లేకుండా సంఘానికి దూరంగా ఉండే వారినే సన్యాసి అని సమాజం భావిస్తుంది. కానీ మనుషుల కష్టాలు, కన్నీళ్ళు, బాధలు, రోగాలు, చావుల గురించి మదనపడి వారికో పరిష్కారం చూపాలని సమాజ శ్రేయస్సు కోసం, బహుజన హితం కోసం, బహుజన సుఖం కోసం ఇంటినీ, కుటుంబాన్ని వదిలిన బుద్ధుడు తన మార్గం, తన మతం, దేవుడు, ఆత్మలకు సంబంధించినది కాదని, తన మతానికి కేంద్ర వస్తువు మనిషి అని, మనిషికీ మనిషికీ మధ్య తమ తమ జీవితాల్లో ఈ భూమి మీద పెనవేసుకున్న బంధం అని, దుఃఖాలు, కష్టాలు పేదరికంతో సతమతమవుతూ జీవిస్తున్న వారికి పరిష్కారం కోసం తెలిపిన అష్టాంగ మార్గం గురించి తెలుసుకుందాం.

1.సమ్యక్ దృష్టి : సరైన దృష్టి అంటే కేవలం కంటితో కంటికి కనబడేది మాత్రమే చూడటం కాదు. మనస్సుతోనూ చూడమన్న బౌద్ధం మనస్సుకు ఎంతో ప్రాముఖ్యత కలిగించి దానిని జ్ఞానేంద్రియంగా పరిగణించింది. మనస్సుతో చూడటం ద్వారానే సమ దృష్టి, తద్వారా సమానత్వం సంఘంలో ఏర్పడుతుందని తెలిపింది.

2.సరైన సంకల్పం: ఏ కార్యమైనా పూర్తి చేయటానికి సంకల్పమే ముఖ్యం. దానినే సంకల్ప బలం అని కూడా అంటుంటాం. అయితే ఆ సంకల్పం ధర్మబద్ధమైన పనులను మాత్రమే ఉపయోగించు కోవాలి. మరొకరికి కష్టం కలిగించే పనులపై మన సంకల్పం ఉండకూడదు.

3.సరైన వాక్కు : నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుంది అనే నానుడి మనందరికీ తెలిసిందే. ప్రాణుల్లో మాట్లాడగలిగే ప్రత్యేకత కేవలం మనుషులకే



ఉంది. పరుషంగా మాట్లాడడం, పొగడ్తలు కురిపించడం, అసత్యాలు, అర్థ సత్యాలు కాకుండా కేవలం సత్యాన్ని మాత్రమే చెప్పమంటుంది బౌద్ధం.

4.సరైన పని : మనం ఎంచుకున్న పని ధర్మబద్ధమై ఉండాలి. మనం చేస్తున్న పని వల్ల ఇతరులు ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ నష్టపోరాదు. దొంగతనం, అక్రమ వ్యాపారాలు, అనైతిక కార్యక్రమాలు వంటి వాటికి దూరంగా ఉండి ధర్మబద్ధమైన పనులు మాత్రమే చేయాలి.

5.సమైక్య జీవనం : జీవితంలో జరిగే సంఘటనలు యాదృచ్ఛికం కావచ్చు. కానీ జీవితం యాదృచ్ఛికం కాదు. జీవనంలో జీవం ఉండాలి. మన జీవనం గురించి, మన మనుగడ గురించి మరొకరికి నష్టం కలిగించకూడదు. జీవితాన్ని గడపడానికి సమకూరే ఆదాయం కూడా ధర్మబద్ధమై ఉండాలి.

6.సరైన వ్యాయామం : వ్యాయామం అంటే కేవలం శరీరానికే కాదు, శరీరంతో చేసే వ్యాయామం, శారీరక ఆరోగ్యం గురించి అయితే నిరంతరం మనలో వచ్చిపోతున్న అనేకానేక ఆలోచనలు, మనలో పుట్టే కోరికలను నిగ్రహించి, వాటిని సక్రమ మార్గంలోకి మళ్ళించడం ద్వారానే మానసిక ఆరోగ్యం పొందగలుగుతాము.

7.సమ్యక్ స్థితి - సరైన ఎరుక : మనం చేస్తున్న పని గురించి తెలుసుకుని పూర్తి ఏకాగ్రత కలిగి ఉండాలి. ధ్యానం చేస్తున్నప్పుడు ధ్యానం పైనే ధ్యాస కలిగి ఉండడం, వాహనం నడుపుతున్నప్పుడు దానికి సంబంధించిన విషయాలపైనే ఎరుక కలిగి ఉండటమే సరైన ఎరుక.

8.సమ్యక్ సమాధి : అలలు అలలుగా, ప్రకంపనలుగా నిరంతరం సంచరిస్తునే ఉన్న మనోవృత్తులన్నీ బంధించి, మనస్సును స్థిరంగా ఉంచగలగడమే ఈ సమ్యక్ సమాధి.

మనుషులకు జరుగుతున్న అన్యాయాలకు కారణం సాటి మనుషులే. మనుషులు తమ మనస్సును, ప్రవర్తనలను, ఆలోచనా విధానాలను మార్చుకోకుండా, సంఘంపై వారి బాధ్యతలు గుర్తెరగకుండా, మనుషుల మధ్య అవసరాలతో సంబంధంలేని ఆప్యాయతలు లేకుండా ఏదో ఊహించుకుని ఏవేవో ఆశించి చేసే పూజలు, ప్రార్థన లతో మనిషి జీవితం ఆనందమయం అవుతుందని ఆశించడం అమాయకత్వం. అందుకే తన బోధనల్లో నైతిక విలువలకూ, ధర్మ బద్ధమైన జీవనానికి ప్రాధాన్యతనిచ్చిన బౌద్ధం 2500 సంవత్సరాలు దాటినా నేటి సమాజానికి, నేటి కాలానికీ అన్వయించుకునేలానే కాదు, మరో 2500 సంవత్సరాలు దాటినా ఉన్నతంగానే ఉంటుంది.

(మే 5 బుద్ధ జయంతి)

సెల్:9440734501



కష్టాల నెలవు... కార్యదర్శుల కొలువు...

ఉన్నత చదువులు చదివి ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి ఉన్నత స్థానంలో నిలవాలనుకున్నారు. పల్లె ప్రజలకు సేవలు అందించడంతో పాటు పల్లెప్రగతికి పాటుపడాలనే ఆశయంతో గ్రామ కార్యదర్శి పదవిలో చేరారు. కానీ ఒక పక్క పనిభారం పెరగడం, మరోపక్క క్రమబద్ధీకరణపై ప్రభుత్వం కరుణ చూపకపోవడంతో ఉద్యోగ భద్రతలేక జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మూడేళ్ల ప్రొబేషనరీ పీరియడ్‌తో కొలువులోకి తీసుకున్న ప్రభుత్వం నాలుగేళ్లు గడుస్తున్న రెగ్యులరైజ్ చేయడంలేదు. నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న జీపీల్లో ఖాళీల కొరత ఉందని గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం 2018లో 9355 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించాలని నిర్ణయం తీసుకుంది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 2018 ఆగస్టులో నోటిఫికేషన్ వెలువరించింది. మూడేండ్ల ప్రొబిషనరీ సమయంలో రూ.15 వేల గౌరవ వేతనం, తెలంగాణ పంచాయతీ రాజ్‌చట్టం - 2018 ఆధారంగా పనితీరు అంచనా వేయడం వంటి షరతులతో ఈ నియమకాలు చేపట్టింది. 2018 అక్టోబర్ 10న పరీక్ష జరిపి ఎంపికైన వారిని ఏప్రిల్ 11, 2019 నుండి గ్రామ కార్యదర్శులుగా నియమించింది. 2022 ఏప్రిల్ 12 నాటికి మూడేళ్ల ప్రొఫెషనరీ పూర్తయిన కార్యదర్శుల క్రమబద్ధీకరణపై ప్రభుత్వం చొరవ చూపలేదు. తెలంగాణ రెగ్యులరైజేషన్ ఆఫ్ అపాయింట్ మెంట్ యాక్ట్‌కు విరుద్ధంగా ఉత్తర్వు నెంబర్ 26 ద్వారా ప్రొబేషనరీ పిరియడ్‌ను మరో ఏడాది పెంచింది. నోటిఫికేషన్‌లో ఇచ్చిన దాని ప్రకారం మూడేళ్ల తర్వాత గ్రేడ్-4 ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులరైజ్ చేస్తామని ప్రభుత్వం మాటిచ్చిన ఉద్యోగ భద్రత మాత్రం కల్పించలేకపోయింది. ఈ ఏడాది ఏప్రిల్ 12తో గ్రామ కార్యదర్శుల పదవీకాలం నాలుగేళ్లు పూర్తి అవుతుంది. జీవో నెంబర్ 26 రద్దు కోసం ఇప్పటికే గ్రామ కార్యదర్శులు హైకోర్టును ఆశ్రయించారు. ఎన్నికల సమయం కావడంతో సెర్ప్ ఉద్యోగులు క్రమబద్ధీకరించడంతో గ్రామ కార్యదర్శులు కూడా ప్రభుత్వ నిర్ణయం కోసం ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు.



అంకం నరేష్
6301650324

కష్టపడి చదువుల్లో రాణించి నేరుగా కొలువులను సంపాదించినా ఉద్యోగ నిర్వహణలో మితిమీరిన ఒత్తిడులు పెరగడంతో గ్రామ కార్యదర్శులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. గ్రామపంచాయతీ పరిధిలో రికార్డులు బడ్జెట్ నిర్వహణ, జనన మరణ పత్రాల జారి, ఆస్తిపన్ను వసూలు, వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాలు, స్వచ్ఛ భారత్ మిషన్, హరితహారం, ఆస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ మొదలైన 50రకాల విధులను నిర్వహిస్తున్నారు. రోజుకు 10 నుంచి 12 గంటలపాటు వెట్టి చాకిరి చేస్తున్నారు. వీటికి తోడు వీరి హయంలోనే డంపింగ్ యార్డులు వైకుంఠధామాలు పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికల నిర్మాణాలు జరిగాయి. కేంద్ర ప్రభుత్వం ఏటా ఇస్తున్న అవార్డుల్లో మెజార్టీ అవార్డులు రాష్ట్ర పంచాయతీలనే వరిస్తున్నాయి. రాష్ట్రంలో నాలుగు విడుతలుగా చేపట్టిన పల్లె ప్రగతిని విజయవంతం చేయడంలో గ్రామ కార్యదర్శులు కీలక పాత్ర పోషించారు. ఇంత చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గ్రామ కార్యదర్శుల క్రమబద్ధీకరణ పై ఎటువంటి నిర్ణయం తీసుకోవడం లేదు. స్థానిక రాజకీయాలలో నోటీసులు వేధింపులు భరించలేక ఇప్పటికే రాష్ట్రంలో దాదాపుగా 1500 మంది ఉద్యోగాలు వదిలేశారు. గుండెపోటు ఇతర అనారోగ్య సమ స్యలతో 40మంది వరకు గ్రామ కార్యదర్శులు మతిచెందారు. గత పీఆర్సీలో భాగంగా 30శాతం జీతాలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం తమపై కరుణ చూపించి రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు. ■

ఎం.ఫిల్ అర్హులను అనుమతించాలి

అసిస్టెంట్ ప్రొఫెసర్స్ (డిగ్రీ అధ్యాపకుల) పోస్టుల భర్తీకి సంబంధించి నేడు ప్రధానంగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ పాటు ఎన్‌ఈటీ (నెట్ - నేషనల్ ఎలిజిబిటీ టెస్ట్) లేదా ఎస్‌ఈటీ (సెట్-స్టేట్ ఎలిజిబిటీ టెస్ట్) లేదా పీహెచ్‌డీ (డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ)లను ప్రధాన విద్యా అర్హతలుగా పరిగణిస్తున్నారు. గతంలో నెట్, సెట్, పీహెచ్‌డీ విద్యార్హతలు కలిగి ఉండకున్ననూ సంబంధిత పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీతో పాటు మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ (ఎం.ఫిల్) విద్యార్హతలు కలిగి ఉన్న వారికి కూడా డిగ్రీ అధ్యాపకుల పరీక్షను రాయడానికి వెసులుబాటుని కల్పించారు. ఈ రకంగా గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎంఫిల్ అర్హతతో అర్హులైన అభ్యర్థులు డిగ్రీ లెక్చరర్ల పరీక్షకి హాజరయ్యారు. కాని నేడు తెలంగాణ రాష్ట్రంలో డిగ్రీ లెక్చరర్ల పరీక్షకి సబంధించి అర్హతల్లో ఎం.ఫిల్ ప్రస్తావన లేకపోవడం కడు విచారకరం. ఫలితంగా అనేక మంది ఎం.ఫిల్ అర్హులు తమను 'డిగ్రీ లెక్చరర్ల పరీక్షకు అనుమతించాలి" అనే న్యాయబద్ధమైన డిమాండ్ కోసం అభ్యర్థించడం గమనార్హం. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 2009 మార్గదర్శకాలను అనుసరించి 2009, జూలై 11 నాటికి ఎం.ఫిల్ కోర్సులో కేవలం రిజిస్ట్రేషన్ ప్రక్రియని పూర్తిచేసుకున్న వారికి కూడా అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో బోధించడానికి నెట్, సెట్, అసెట్ అర్హతల నుండి మినహాయింపు ఇచ్చారు. ఈ అంశానికి సంబంధించి భిన్న సందర్భాలలో అనేక సర్క్యులర్స్ వివరణాత్మకంగా వెలువడ్డాయి. కాని తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జారీ చేసిన గురుకుల డిగ్రీ అధ్యాపకుల వివరణాత్మక ప్రకటనల్లోనూ ముఖ్యంగా విద్యార్హతల విషయంలో ఎం.ఫిల్ విద్యార్హతని మినహాయించడం వలన నిర్దేశిత కాలం లో ఎంఫిల్‌లో నమోదైన లేదా అంతకుముందే ఎంఫిల్ కోర్సుని పూర్తి చేసిన అభ్యర్థులు ఉద్యోగ అవకాశాన్ని కోల్పోతున్నారు. ఈ రకంగా డిగ్రీ అధ్యా పకుల భర్తీలో ఎంఫిల్ డిగ్రీని విస్మరించడం ఏమాత్రం సహేతుకం కాదు.



జెజెసిపి బాబూరావు
9493319690



నిజానికి పీహెచ్‌డీ ప్రవేశాలలో నెట్, సెట్‌లతో పాటు ఎంఫిల్ అర్హతకి సమ ప్రాధాన్యం ఉంది. పీహెచ్‌డీ ప్రవేశాల ఇంటర్వ్యూలో ఎంఫిల్ అభ్యర్థులకు సైతం మినహాయింపుని ఇవ్వడం గమనార్హం. నిజానికి నెట్, అసెట్‌లు కొద్దిపాటి శ్రమతో క్వాలిఫై కావడం చాలా సులువు. వీటిలో కేవలం క్వాలిఫై అయితే డిగ్రీ లెక్చరర్లు, విశ్వవిద్యాలయాల స్థాయిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హత లభిస్తుంది. కాని ఎంఫిల్ పరిశోధకులు పరిశోధన చేసి పీహెచ్‌డీ మాదిరిగానే డిజర్టేషన్‌ని రూపొందిస్తారు. ఈ డిజర్టేషన్‌ని రూపొందించ డానికి ఎంఫిల్ పరిశోధకులు అనేక వ్యయ ప్రయాసలని అధిగమించి అనేక కొత్త విషయాలని వెలుగులోకి తీసుకొనిరావడంలో పీహెచ్‌డీ పరిశోధనలకు ఏమాత్రం తీసిపోరు. అయిననూ వారికి డిగ్రీ లెక్చరర్ల పరీక్షకు కూడా అనుమతించక పోవడం కడు విచారకరం. ఈ రకంగా డిగ్రీ లెక్చరర్ల పరీక్షకి పరిశోధనలో పీహెచ్‌డీ వారిని మాత్రమే అర్హులుగా చేసి ఎంఫిల్ వారిపై వేటు వేయడం ఏమాత్రం సముచితం కాదు.

డిగ్రీ లెక్చరర్ల భర్తీ ప్రక్రియలో సుదీర్ఘ ప్రక్రియతో ఎం.ఫిల్ కోర్సుని పూర్తి చేసిన వారిని విస్మరించడం వలన 2009 అంతకుముందు కాలంలో ఎంఫిల్ అర్హతని కలిగి ఉన్న పరిశోధకులు దాదాపు పుష్కరకాలం నాటికి అందివచ్చిన డిగ్రీ అధ్యాపకుల ఉద్యోగ అవకాశాన్ని కోల్పోయే ప్రమాదంలోకి నెట్టివేయబడ్డారు. ఈ రకంగా ఎంతో శ్రమించి పూర్తి చేసిన ఎంఫిల్ విద్యార్హతకి విలువ లేకుండా చేయడమే కాకుండా నిర్లక్ష్యానికి గురిచేయడం ఏమాత్రం సమంజసం కాదు. అందువలన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 2009 మార్గదర్శకాలను అనుసరించి నిర్దేశిత కాలం నాటి ఎంఫిల్ అభ్యర్థులకు డిగ్రీ లెక్చరర్స్ (డిఎల్) పరీక్షకు అనుమతించే దిశగా సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా నూతన విద్యావిధానం అమలులోకి రాని పూర్వకాలం వరకు ఎంఫిల్ కోర్సుని పూర్తి చేసిన పరిశోధకులను కూడా డిగ్రీ లెక్చరర్లు ఉద్యోగ పరీక్షకి అనుమతించాల్సిన అవసరం ఉంది. ■

కొలువుల కోసం కొట్లాడే సమయం వచ్చింది

- ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మెన్ పిడమర్తి రవి
- ప్రారంభమైన విద్యార్థి నిరుద్యోగ భరోసా బస్సు యాత్ర



నవతెలంగాణ-ఓయూ

కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పట్టిపీడిస్తుందని, కొలువుల కోసం మళ్లీ కొట్లాడే సమయం వచ్చిందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మెన్ పిడమర్తి రవి అన్నారు. విద్యార్థి నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తాను నిలబడి పోరాడుతానన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యార్థి సంఘాల జేఏసీ కన్వీనర్ మిడతనపల్లి విజయ్ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర యూనివర్సిటీల విద్యార్థి నిరుద్యోగ భరోసా బస్సు యాత్రను బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద పిడమర్తి రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వల్ల విద్యార్థులు ఆత్మస్థైర్యం కోల్పోయారన్నారు. ఆత్మస్థైర్యం కోల్పోవద్దని చదువుతూ కొట్లాడాలని సూచించారు.

నిరుద్యోగుల బాధలు ప్రభుత్వానికి కనిపించడం లేదన్నారు. నిరుద్యోగులు కూర్చుంటే న్యాయం జరగదని, కొలువుల కోసం కొట్లాడాలని సూచించారు. మిడతనపల్లి విజయ్ మాట్లాడు తూ.. పేపర్ లీకేజీకి కారకులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి టీఎస్‌పీఎస్సీని రద్దు చేయలని డిమాండ్ చేశారు. ఈ భరోసా యాత్ర తరువాత విద్యార్థి నిరుద్యోగుల సమస్యలు ముఖ్యమంత్రికి వినిపించేలా అన్ని విద్యార్థి, ప్రజా సంఘాలను కలుపుకొని బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర బీసీ సంఘం నాయకులు తుర్క నర్సింహా, చొప్పరి శంకర్ పిట్ల రమేష్ యాత్రకు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు రెడ్డి శ్రీనివాస్ ముదిరాజ్, ఆంజనేయులు ముదిరాజ్, వెంకట్ యాదవ్, వీర రాజు, మోహన్ నాయక్, వినోద్, రమేష్, జనార్ధన్ ముదిరాజ్, అశోక్, రవి, సురేష్, రాజేందర్, నవీన్, రామకృష్ణ, సురేందర్, రవీందర్, అజయ్ పాల్గొన్నారు.

వ్యక్తిగత హాజరు మినహాయింపునకు 'నో'

- రాహుల్‌కు రాంచీ కోర్టు షాక్

రాంచీ : పరువునష్టం కేసులో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన అభ్యర్థనను రాంచీ కోర్టు బుధవారం తోసిపుచ్చింది. దీంతో 'మోడీ ఇంటిపేరు'పై చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా దాఖలైన పరువునష్టం కేసులో రాహుల్‌కు మరోసారి చుక్కెదురు అయినట్లయింది. 2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కర్నాటకలోని కోలార్‌లో జరిగిన సభలో రాహుల్ ప్రసంగిస్తూ దేశంలో అత్యున్నత స్థాయిలో అవినీతి జరుగుతోందని విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని నరేంద్ర మోడీ, వ్యాపార వేత్తలు నీరవ్ మోడీ, లలిత్ మోడీ పేర్లను ప్రస్తావించిన విషయం తెలిసిందే.

దీనిపై జార్ఖండ్‌కు చెందిన ప్రదీప్ మోడీ అనే వ్యక్తి రాహుల్‌పై పరువు నష్టం కేసు వేశారు. బీజేపీకి చెందిన సూరత్ వెస్ట్ ఎమ్మెల్యే పూర్ణేష్ మోడీ కూడా మరో కేసు వేశారు. దీనిపై సూరత్ కోర్టు మార్చి 23న తీర్పు ఇస్తూ రాహుల్‌కు రెండేళ్ల జైలుశిక్ష విధించింది. దీంతో ఆయన లోక్ సభ సభ్యత్వాన్ని కోల్పోయారు. దీనిపై రాహుల్ గుజరాత్ హైకోర్టుకు వెళ్లినా ఆయనకు ఊరట లభించలేదు. ఇప్పుడు రాంచీ కోర్టులోనూ ఆయనకు ఎదురు దెబ్బ తగిలింది. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలన్న రాహుల్ అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది.

ఇంటిపనికే పరిమితం !

భారత్‌లో మహిళల పరిస్థితి దయనీయం

- పని ప్రదేశాలలో తగ్గిపోతున్న స్త్రీలు
- వేతన వ్యత్యాసాలూ ఎక్కువే
- ఔత్సాహికులకు ప్రోత్సాహం కరువు





న్యూఢిల్లీ: జీ-20 దేశాల కూటమికి నేతృత్వం వహిస్తున్నామంటూ గొప్పలు చెప్పుకుంటున్న భారత్‌లో మహిళల పరిస్థితి దయనీయంగా ఉంటోంది. వారు కేవలం ఇంటి పనులకే పరిమితం అవుతున్నారు. పని ప్రదేశాలలో మహిళల సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. పురుషులతో పోలిస్తే వేతన వ్యత్యాసమూ ఎక్కువే. ఔత్సాహిక పారిశ్రామిక వేత్త లుగా రాణించాలని అనుకుంటున్నా అనేక ప్రతిబంధకాలు ఎదురవుతున్నాయి.

> మహిళలకు దేశంలో లభిస్తున్న ఆర్థిక అవకాశాల విషయాన్ని పరిశీలిస్తే అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయన్న వాస్తవం స్పష్టమవుతోంది. మన దేశంలో ఔత్సాహిక పారి శ్రామికవేత్తలుగా ఎదగాలన్న ఆకాంక్ష పురుషుల కంటే మహిళలలోనే ఎక్కువగా ఉంది. అయితే అది కార్యరూపం దాల్చడం లేదు. మొత్తం 65 దేశాల సమాచారాన్ని తీసుకుంటే మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సూచికలో భారత్ స్థానం 57. వ్యాపారంలో యాజమాన్య బాధ్యత చేపట్టేందుకు మహిళలు అంతగా ఆసక్తి చూపడం లేదు. ఆర్థిక వనరులు లభించకపోవడమే దీనికి కారణం.

మన దేశం ప్రస్తుతం జీ-20 దేశాల అధ్యక్ష స్థానంలో ఉంది. ఈ సంవత్సరం నవంబర్ 30వ తేదీ వరకూ ఈ హోదాలో కొనసాగుతుంది. ఈ హోదాపై అటు కేంద్రం, ఇటు బీజేపీ పాలిత రాష్ట్రాలు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నాయి. ప్రకటనల రూపంలో కోట్లాది రూపాయలు కుమ్మరిస్తున్నాయి. 'సెంటర్ ఫర్ న్యూ ఎకనమిక్స్ స్టడీస్' (సీఎన్‌ఈఎస్) అనే సంస్థ జీ-20 దేశాల మధ్య జరిగే చర్చలలో ప్రస్తావనకు వచ్చే అంశాలపై అధ్యయనం నిర్వహించింది. దీని ప్రకారం 'మహిళల నేతృత్వం లో అభివృద్ధి ప్రణాళికలు' అనే అంశాన్ని కూడా చర్చల అజెండాలో చేర్చారు. ఈ నేపథ్యంలో మహిళలు, పురుషుల పనితీరు సూచికల విషయంలో మన దేశం పరిస్థితి ఎలా ఉందన్న విషయాన్ని తెలుసుకునేందుకు సీఎన్‌ఈఎస్ కొంత సమాచారాన్ని పరిశీలించింది. దేశంలో మహిళా కార్మికుల పాత్ర, మహిళలు-పురుషుల మధ్య పని విభజన, వేతన వ్యత్యాసాలు, మహిళలకు అందుబాటులో ఉన్న వ్యాపార అవకాశాలు అనే విషయాలపై సీఎన్‌ఈఎస్ ప్రధానంగా పరిశీలన జరిపింది. ఆ వివరాలు....

జర్మనీ, సౌదీ అరేబియా, రష్యా, మెక్సికో వంటి ఇతర జీ-20 దేశాలలో మహిళా కార్మికుల సంఖ్య పెరుగుతుంటే మన దేశంలో మాత్రం 2004 నుండి తగ్గిపోతోంది. ప్రపంచ ఆర్థిక ఫోరం నివేదిక-2022 ప్రకారం జీ-20 దేశాలలో మొత్తం కార్మిక శక్తిలో మహిళా కార్మికుల సంఖ్య 49.78 శాతం ఉంటే మన దేశంలో మాత్రం అత్యంత తక్కువగా 19.23 శాతమే ఉంది. ఇది చాలా అసాధారణం. మహిళలు ఇంటి సంరక్షణ బాధ్యత తీసుకోవడం ఇందుకు ప్రధాన కారణంగా కన్పిస్తోంది.

వారు ఎలాంటి వేతనం లేకుండానే తమ ఇళ్లలో రాత్రింబవళ్లూ చాకిరీ చేస్తున్నారు. ఇంటి బాగోగులు చూసుకోవడం, వృద్ధుల ఆలనాపాలనా చూడడం వంటి పనులకే పరిమితమవుతున్నారు. మహిళలు రోజుకు 297 నిమిషాల సమయం ఇంటి పనికి వెచ్చిస్తుంటే పురుషులు మాత్రం కేవలం 29 నిమిషాలే కేటాయిస్తున్నారు. అంటే 90.5 శాతం ఇంటి పని మహిళల పైనే పడుతోంది. జీ-20లోని ఇతర దేశాలలో 70.77 శాతం ఇంటి పనిని మహిళలు నిర్వర్తిస్తున్నారు. ఇటలీ మినహా యూరప్ దేశాలు, బ్రిటన్, అమెరికా, కెనడాలలో 61 శాతం ఇంటి పనులు మహిళలే చేసుకుంటున్నారు. భారత్ వంటి వర్ధమాన దేశాలలో మాత్రం ఇంటి పని భారమంతా మహిళల పైనే పడుతోంది. ఆసక్తికరమైన విషయమేమంటే ఇంటి పనులు చేస్తున్న పనివారిలో కూడా ఎక్కువగా మహిళలే ఉంటున్నారు. ఒకవేళ పనివారిని నియమించుకుంటున్నా ఇంటిలోని మహిళలు బయట పనులకు వెళ్లడం లేదు. బెంగళూరు, చెన్నై వంటి మెట్రోపాలిటన్ నగరాలలో 40 శాతం కుటుంబాలు ఇంటి పనులకు బయటి మహిళలను తీసుకుంటున్నాయి.

ఇక వేతన వ్యత్యాసం విషయానికి వస్తే 2022లో రూపొందించిన ఓ నివేదిక ప్రకారం భారతీయ మహిళలు సంవత్సరానికి 2130 డాలర్లు సంపాదిస్తుంటే పురుషులు 9900 డాలర్లు ఆర్జిస్తున్నారు. అంటే మహిళల కంటే పురుషుల ఆదాయం 79 శాతం అధికం. జీ-20లోని ఇతర దేశాలలో సగటు ఆదాయ వ్యత్యాసం 43 శాతమే. అంటే జీ-20 దేశాలన్నింటిలోనూ మన దేశంలోనే మహిళలు, పురుషుల మధ్య ఆదాయ వ్యత్యాసం ఎక్కువగా ఉంది.

ఈ పరిస్థితిని మార్చేందుకు సీఎన్‌ఈఎస్ పలు సూచనలు చేసింది. మహిళలకు ఉన్నత విద్యను అందించేందుకు కృషి చేయాలని, వివిధ రంగాలలో పనిచేసేందుకు మహిళలకు అవకాశాలు పెంచాలని, మహిళా పారిశ్రామికవేత్తలకు ఆర్థిక వనరులు లభించేలా చూడాలని సిఫార్సు చేసింది. సింగిల్‌విండో అనుమతులు, పన్ను రాయితీలు వంటి ఇతర చర్యల ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని సూచించింది.

31 మంది కృషి బ్యాంకు బాధితులకు డబ్బులు చెల్లించిన సీఐడీ

- మిగతా బాధితుల కోసం ఆరా తీస్తున్న అధికారులు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

కృషి బ్యాంకులో డిపాజిట్లు పెట్టి మోసపోయిన బాధితుల్లో కొందరికి రూ. 8 లక్షలను సీఐడీ అధికారులు చెల్లించారు. బుధవారం నాంపల్లి కోర్టులో జరిగిన ఒక కార్యక్రమంలో బ్యాంకు లిక్విడేచర్‌తో పాటు సంబంధిత మేజిస్ట్రేటు సమక్షంలో డిపాజిటర్లకు చెక్కులను అందజేశారు. 2001లో కృషి బ్యాంకు వందలాది మంది డిపాజిటర్లను మోసం చేసి బోర్డు తిప్పేసిన విషయం తెలిసిందే. ఆ కేసును విచారించిన సీఐడీ అధికారులు కోర్టు ఆదేశాల మేరకు సదరు బ్యాంకుకు చెందిన ఆస్తులను జప్తు చేయడం, వాటిలో కొన్ని ఆస్తులను కోర్టు ఆదేశాల మేరకు విక్రయించి రూ. 13 కోట్ల మేరకు కొందరు డిపాజిటర్లకు ఇవ్వాల్సిన డబ్బులను చెల్లించడం జరిగింది. తాజాగా మరికొన్ని ఆస్తులను విక్రయించగా వచ్చిన రూ.8,07000 లను 31 మంది బాధితులకు చెల్లించినట్టు సీఐడీ అదనపు డీజీ మహేశ్ భగవత్ తెలిపారు. ఇంకా వంద మంది వరకు బాధితులు మిగిలి ఉన్నారనీ, వారికి కూడా త్వరలోనే చెల్లిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

కేంద్ర ప్రభుత్వమే పంట నష్టపరిహారమివ్వాలి

కౌలురైతులకూ నష్టపరిహారం ఇవ్వాలి :సీపీఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రాల మీద నెపం నెట్టకుండా చిత్తశుద్ధితో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన బాధ్యతగా తక్షణమే పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. కేంద్రం, రాష్ట్రం బీమా పథకం నిలిపేయడం దురదృష్టకరమని అన్నారు. కౌలు రైతుల పంటలకు కూడా పంట నష్టపరిహారమివ్వాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గత మూడు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా 10 లక్షల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిందని తెలిపారు. మార్చిలో కురిసిన అకాల వర్షాల కారణంగా ఆరు లక్షల ఎకరాల వరి పంటకు నష్టం చేకూరిందని పేర్కొన్నారు. ఈ పంటలకు ఎకరాకు రూ.10 వేలు ఇస్తామంటూ పంటలను పరిశీలించి నప్పుడు స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారని గుర్తు చేశారు. కానీ ఇప్పటికీ ఆ పంటల నష్ట పరిహారం అందలేదని పేర్కొన్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఎకరాల మామిడి, ఆరు లక్షల ఎకరాల మొక్క జొన్న, ఇతర పంటలు నష్టపోయాయని వివరించారు. తేమ శాతంతో నిమిత్తం లేకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామంటూ సీఎం కేసీఆర్ ప్రకటించినా 17 శాతం తేమ వస్తేనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తా మంటూ కింది స్థాయి అధికారులు అంటున్నారని తెలిపారు.

అదానీ ఆడిటర్ పదవికి షా ధంధారియా గుడ్‌బై

న్యూఢిల్లీ : అదానీ టోటల్ గ్యాస్ సంస్థకు చట్టబద్ధమైన ఆడిటర్‌గా వ్యవహరిస్తున్న షా ధంధారియా అండ్ కంపెనీ ఆ బాధ్యతల నుంచి వైదొలిగింది. హిండెన్‌బర్గ్ నివేదిక ఈ కంపెనీ పైన కూడా అనుమానాలు వ్యక్తం చేసింది. అదానీ గ్రూప్‌లోని పలు సంస్థలకు షా ధంధారియా అండ్ కంపెనీ, ధర్మేష్ పారిఖ్ అండ్ కంపెనీలు ఆడిటర్లుగా వ్యవహరిస్తున్నాయి. ఈ రెండు కంపెనీలకు ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.84 కోట్లు చెల్లించగా, అదానీ గ్రూప్ రూ.7 కోట్లు చెల్లించింది. ఈ రెండు సంస్థల సామర్థ్యాన్ని హిండెన్‌బర్గ్ నివేదిక ప్రశ్నించింది. 'షా ధంధారియాకు ప్రస్తుతం వెబ్‌సైట్ ఏదీ లేదు. ఈ సంస్థకు కేవలం నలుగురు భాగస్వాములు, 11 మంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. ఈ కంపెనీ తన కార్యాలయానికి రూ. 32 వేల నెలసరి అద్దె చెల్లించింది' అని హిండెన్‌బర్గ్ తెలిపింది. ఈ సంస్థ భాగస్వాములకు పెద్దగా అనుభవం కూడా లేదనీ, దేశంలోని అతి పెద్ద కంపెనీల ఖాతాలను తనిఖీ చేసే సామర్థ్యం వారికి లేదని నివేదిక ఎత్తిచూపింది. కాగా సరైన ఆడిట్ ఆధారాలు సంపాదించలేకపోవడం వల్ల తాము రాజీనామా చేయలేదని షా ధంధారియా సంస్థ తెలిపింది. తమ రాజీనామాకు ఏ ఇతర కారణాలూ లేవని కూడా చెప్పింది. ఇతర బాధ్యతలు ఉండడం వల్లనే అదానీ గ్రూప్‌కు రాజీనామా చేశామని వివరణ ఇచ్చింది. షా ధంధారియా కంపెనీ స్థానంలో ఆడిటర్‌గా వాల్టర్ చందియాక్ అండ్ కంపెనీని అదానీ గ్రూప్ నియమించింది.

177 మంది ల్యాబ్ టెక్నీషియన్ల క్రమబద్ధీకరణ

- సర్కారుకు కృతజ్ఞతలు : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇచ్చిన హామీ మేరకు 177 మంది కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్ల సేవలను రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. ఈ మేరకు బుధవారం వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంచాల రవీందర్, కాంట్రాక్టు క్రమబద్ధీకరణ బాధ్యులు నగేష్, రామారావు, జ్యోతి, శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చొరవతో క్రమబద్ధీకరించారని వారు కొనియాడారు. హామీని నిలబెట్టుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి జీవితాంతం రుణపడి ఉంటామని చెప్పారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు మాట నిలుపుకోలేదనీ, కానీ ల్యాబ్ టెక్నీషియన్లను అక్కున చేర్చుకుని వారు ఆత్మగౌరవంతో జీవించేలా బీఆర్ఎస్ సర్కారు నిర్ణయం తీసుకుందని హర్షం వ్యక్తం చేశారు. నూతన సచివాలయం ప్రారంభం రోజునే సీఎం కేసీఆర్ సంతకం చేయడం, ఆ మేరకు జీవో విడుదల అయిందని ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం

- ఆందోళన చెందొద్దు :పౌరసరఫరాల సంస్థ చైర్మెన్ సర్దార్ రవీందర్ సింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అకాల వర్షాలతో తడిచిన ధాన్యం విషయంలో అన్ని విధాల ఆదుకుంటామనీ, ఆందోళన చెందొద్దని పౌరసరఫరాల సంస్థ చైర్మెన్ సర్దార్ రవీందర్ సింగ్ రైతాంగాన్ని కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని పౌరసరఫరాల భవన్‌లో అకాల వర్షాలపై ఆయన సమీక్షించారు. ధాన్యం కొనుగోలు, తరలింపు, తడిసిన ధాన్యం, గన్నీ సంచులు తదితర అంశాలపై చర్చించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైసు మిల్లులకు తరలించాలనీ, మిల్లర్లు వెంటనే అన్‌లోడింగ్ చేసుకుని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అదేశించారు. కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలన్ని కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సీజన్లో ఇప్పటివరకు ఒక లక్ష మంది రైతుల నుంచి రూ.1,710కోట్ల విలువ చేసి 8.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అకాల వర్షాల నేపథ్యంలో హైదరాబాదులోని పౌరసరఫరాల భవన్లో టోల్ ఫ్రీ నెంబర్ 1967, 1800 4250 0333 నెంబర్లు ఏర్పాటు చేసినట్టు ప్రకటించారు. వీటికి కాల్ చేసి రైతులు తమ సమస్యలను, ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని సూచించారు.

బీజేపీ నేతలది అబద్ధాల బతుకు

- రైతులపై ప్రేముంటే కేంద్రం నుంచి ఎకరాకు రూ. 10 వేలు తెండి : టీఎస్ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సహా ఆ పార్టీ నేతలందరిదీ అబద్ధాల బతుకు అని టీఎస్ఆర్టీసీ చైర్మెన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. ఆపార్టీ నేతలకు రైతుల పై ఏమాత్రం ప్రేమ ఉన్నా పంట నష్టపోయిన రైతులకు కేంద్రం నుంచి ఎకరానికి రూ. 10 వేలు తేవాలని డిమాండ్ చేశారు. బుధవారంనాడాయన బీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. సీఎం కేసీఆర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు భరోసా ఇచ్చారనీ, తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొంటామని ప్రకటించారని చెప్పారు. వడగండ్ల వానలో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారని అన్నారు. వాస్తవాలను ఒప్పుకునే ధైర్యం లేని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తీవ్ర అసహనాన్ని ప్రదర్శిస్తూ, నోటికొచ్చినట్టు అవాకులు చెవాకులు పేలుతున్నారనీ, ఈ చర్యల్ని చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. చేతనైతే రాష్ట్రంలోని రైతుల కోసం కేంద్రం నుంచి ఏ సహాయం తెచ్చారో చెప్పాలని నిలదీశారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతుల కోసం సీఎం కేసీఆర్ ప్రభుత్వం రూ. 154 కోట్లను విడుదల చేసిందని గుర్తుచేశారు.

పిచ్చిచేష్టలు మానుకోండి

- ఆకతాయికి టీఎస్ఆర్టీసీ ఎమ్‌డీ సజ్జనార్ హితవు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నడిరోడ్డుపై కారు, ఆటో, స్కూటర్ వంటి వాహనాలు ఆగిపోతే వాటిని వెనుక నుంచి మరో వాహనం సాయంతో కాలుతో నెట్టుకుంటూ వెళ్తుంటారు. అయితే తానో బాహుబలిని అనిపించుకోవడం కోసం ఓ యువకుడు మిధానీ డిపోకు చెందిన టీఎస్ఆర్టీసీ బస్సు (104-ఎ రూట్) వేగంగా వెళ్తుంటే, దాని వెనుకనుంచి ఒక కాలుతో బస్సును తోస్తున్నట్టు వీడియో షూట్ చేయించుకున్నాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై టీఎస్ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్ ఘాటుగా స్పందించారు. సోషల్ మీడియాలో పాపులారిటీ కోసం ఇలాంటి పిచ్చి పనులు చేయొద్దంటూ హితవు చెప్పారు. 'వెర్రి వేయి విధాలు అంటే ఇదే! సోషల్ మీడియాలో పాపులారిటీ కోసం రోడ్లపై ఇలాంటి పిచ్చి వేషాలు వేయకండి. ప్రమాదాల బారినపడి మీ తల్లితండ్రులకు శోకాన్ని మిగల్చకండి' అంటూ సజ్జనార్ ట్వీట్ చేశారు. దీంతో ఈ ట్వీట్ కూడా ట్రెండింగ్‌గా మారింది.

డబ్బులిచ్చినోళ్లకే డబుల్ ఇండ్లు ఇచ్చిండ్రు..

బండి లేదా డబ్బులు ఇస్తేనే.. ఇల్లంటున్న ప్రజాప్రతినిధులు

- ఇండ్ల కేటాయింపు సభలో ఆశావహుల ఆరోపణలు
- కొత్తపల్లిలో పేదింటి సొంత కలకు తూట్లు



నవతెలంగాణ - స్టేషన్ ఘన్‌పూర్

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్రప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను డబ్బులిచ్చినోళ్లకే ఇస్తున్నరని, రూ.20వేల నుంచి రూ.30 వేల వరకు ఇవ్వాలని, లేదా బండి కొనిస్తే ఇల్లు ఇప్పిస్తామని స్థానిక ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారని ఆశావహులు గ్రామసభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో నిర్మించిన 30 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను లబ్దిదారులకు ఇచ్చేందుకు బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ ఇండ్ల కోసం 210 మంది దరఖాస్తు చేసుకోగా, ఎంపికలో అధికారులు 38మంది లబ్దిదారులను ఎంపిక చేసి, గ్రామసభ నిర్వహించి, డ్రా పద్ధతిలో ఎస్సీలకు 21, బీసీలకు 7, మైనార్టీలకు 2 కేటాయించారు. కాగా గ్రామంలో కొందరు ఆశావాహులు తామూ అర్హులమేనంటూ గ్రామ సభ అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట స్థానిక ప్రజా ప్రతినిధులను అడ్డుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు నిలువ నీడ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఇదివరకూ రెండు సార్లు గ్రామ సభ నిర్వహించి తమ పేర్లను ఖరారు చేసినట్టు చెప్పారని, మూడో గ్రామసభ వచ్చే సరికి తమ పేర్లు జాడ లేకుండా పోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సర్పంచ్, వార్డు సభ్యులు అంతా కలిసి అధికారులతో కుమ్మక్కై కొందరి చేతివాటం కారణంగా తమకు అన్యాయం జరిగిందంటూ ఆగ్రహంతో తిట్ల దండకం ఎత్తుకున్నారు. తాము బండి (ద్వి చక్ర వాహనం) కొనిస్తే.. ఇల్లు ఇప్పిస్తానని చెప్పి తమ పిల్లలతో స్థానిక సర్పంచ్ లక్షల రూపాయలు ఖర్చు చేయించారని గ్రామస్తుడు గండి సమ్మక్క, కొమురయ్య దంపతులు ఆరోపించారు. ఉద్యోగం లేక తమ కుమారుడు అంజనేయులు పొట్ట చేతపట్టుకొని పట్నం వెళ్లి జీవనం సాగిస్తున్నాడని, గతంలో రెండు సభల్లోనూ తమ కొడుకు పేరు ఉన్నా ఇప్పుడు తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఇందిరమ్మ ఇండ్లు వచ్చిన వారికి మరలా ఇండ్లు ఇచ్చారని ఆరోపించారు. ఇప్పటికైనా అసలైన లబ్దిదారులకు లబ్దిదారులకు ఇండ్లు కేటాయించాలని, లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

గ్రామస్తుల ఆరోపణలపై తహసీల్దార్ పూల్‌సింగ్‌ను వివరణ కోరగా.. తమ దృష్టికి అలాంటివేమీ రాలేదని తెలిపారు. డబల్ ఇండ్ల కేటాయింపు పారదర్శకంగా చేపట్టామని, ఇలాంటివి ఉపేక్షించమని స్పష్టంచేశారు. క్షేత్రస్థాయిలో అర్హులైన వారిని ఎంపిక చేసి ఇచ్చామన్నారు. రెండో దషాగా.. మరి కొంతమంది ఇండ్లు లేని నిరుపేదలకు గ్రామంలో 28 గుంటల ప్రభుత్వ భూమిలో స్థలంతో పాటు, కేసీఆర్ ప్రకటించిన గహలక్ష్మి పథకం కింద రూ. 3లక్షలు అందించే ప్రయత్నం చేస్తామని తెలిపారు.

దేశంలోనే నిజమైన రైతు నాయకుడు సీఎం కేసీఆరే

ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ-నంగునూరు

దేశంలోనే నిజమైన రైతు నాయకుడు సీఎం కేసీఆరేనని, రైతు కోసం సకాలంలో ఎరువులు, కరెంట్, సాగునీరు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని, తక్కువ రోజుల్లో పంటలు చేతికి వచ్చే హైబ్రిడ్ విత్తనాలు వినియోగించేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు రైతులకు అవగాహన కల్పించాలని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట తరహాలో నంగునూరులో నాలుగు లైన్ల రహదారిపై బట్టర్ ఫ్లై లైట్లు ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. బుధవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. నంగునూరు మండలం కొనాయపల్లి గ్రామంలో దుద్దెడ- బంధారం, కొనాయపల్లి- ముండ్రాయి గ్రామాలను కలుపుకుని వెళ్లే డబుల్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సీఎం కేసీఆర్‌కు సెంటిమెంట్ ఆలయమైన కొనాయపల్లి వెంకటేశ్వరాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంగునూరు మండలం నర్మెట సీతారాముల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సుదర్శన హెూమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంగునూరులో బట్టర్ ఫ్లై వెలుగులో నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నూతన తహసీల్దార్ కార్యాలయం, ఇరిగేషన్ గెస్ట్ హౌస్ భవనం, మండల పరిషత్తు కార్యాలయ భవనాలను ప్రారంభించారు. అనంతరం నంగునూరు ఎంపీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నంగునూరు మండలంలో రూ.307 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.200 కోట్లతో నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాళేశ్వరం నీళ్లతో వాగు అవతలి గ్రామాలకు అందేలా ఏర్పాటు చేశామన్నారు. వడగండ్ల వాన వల్ల నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేలు అందిస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అకాల వర్షాలు, వడగండ్ల వానలతో 80 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అంచనా వేశామని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుకు అన్ని రకాల సబ్సిడీలు ప్రభుత్వం ఇస్తున్నదని, దాని కోసం బడ్జెట్లో వెయ్యి కోట్లు పెట్టామన్నారు. నంగునూరు మీదుగా వెళ్తున్న ఔటర్ రింగురోడ్డుతో నంగునూరు దశ దిశ మారుతుందని తెలిపారు. గత కాంగ్రెస్ హయాంలో గతుకులమయం, మన ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో అన్నింటా బతుకులమయంగా మారిందన్నారు. బతుకు దెరువు కోసం బయటకు వెళ్లే వాళ్లు, ఇవాళ పక్క రాష్ట్రాల వారికి తెలంగాణలో ఉపాధి కల్పిస్తూ బతుకుతున్నారని వెల్లడించారు. కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మెన్ రోజాశర్మ, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జెడ్పీటీసీ తడిసిన ఉమావెంకట్ రెడ్డి, ఎంపీపీ జాప అరుణా దేవి, ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ దిలీప్ నాయక్, ఇంచార్జి ఎంపీడీవో వేణుగోపాల్, గ్రామ సర్పంచ్ చౌడుచర్ల మమతా జయపాల్ రెడ్డి, మండల ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖలన్నీ ఆస్తిపన్ను బకాయిలు చెల్లించాలి

ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయాలి : ఎఫ్‌ఎఫ్‌జీజీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు ఆస్తిపన్ను బకాయిలు చెల్లించేలా రాష్ట్ర సర్కారు ఉత్తర్వులు ఇవ్వాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కోరింది. బుధవారం ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి ఎఫ్‌ఎఫ్‌జీజీ కార్యదర్శి యం.పద్మనాభరెడ్డి లేఖ రాశారు. 'ఏప్రిల్ నెలలో ఇంటిపన్ను చెల్లించిన వారికి పన్నులో ఐదు శాతం రిబేట్ ఇస్తామని జీహెచ్‌ఎంసీ ప్రకటించింది. ఆ తర్వాత హైదరాబాద్ నగరంలోని సుమారు 8 లక్షల మంది రూ.786.75 కోట్ల ఆస్తిపన్ను చెల్లించారు. వాటితో తమకు కావలసిన పౌరసేవలు ముఖ్యంగా నాలాలు, రోడ్ల మరమ్మత్తు వంటివి చేపడుతారని ఆశించారు. కానీ, వాస్తవంలో ఆ పన్ను డబ్బు ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్నేండ్లుగా పన్ను కట్టకపోవడంతో రూ. 5935 కోట్లు(రాష్ట్ర సర్కారు రూ.5560 కోట్లు, కేంద్ర ప్రభుత్వం రూ.371 కోట్లు) బకాయి పడ్డాయి. గతంలో సీఎస్‌కు ఇదే అంశంపై లేఖ రాస్తే ఆయా శాఖల అధికారులకు పన్నులు చెల్లించాలని ఆదేశించారు. కొన్ని శాఖలే రూ.8 కోట్ల మేర పన్ను కట్టాయి. మిగతావి వసూలు కావాల్సి ఉంది. రాష్ట్ర సర్కారు హైదరాబాద్ నగరపాలక సంస్థపై కక్ష కట్టినట్టుగా వ్యవహరిస్తున్నది. ఎటువంటి కేటాయింపులు లేక నగరపాలక సంస్థను అప్పుల ఊబిలోకి దింపింది. ఇప్పటివరకు చేసిన అప్పులపై రోజుకు రూ.2 కోట్ల వడ్డీ చెల్లింపులు జరుగుతున్నాయని వినిపిస్తున్నది. రాష్ట్ర పన్నుల వసూలులో 80 శాతం నగరపాలక సంస్థ పరిధిలో నుంచే వస్తున్నాయి. అయినా, రాష్ట్ర ప్రభుత్వం నగరపాలక సంస్థకు ఎటువంటి బడ్జెట్ కేటాయింపులు లేవు. నిధుల లేమితో జీహెచ్‌ఎంసీ ప్రజలకు కావలసిన పౌరసేవలు అందించడం లేదు' అని లేఖలో పేర్కొన్నారు.

విరబూసిన మే పుష్పాలు

- చూడటానికి తరలివచ్చిన జనం



నవతెలంగాణ-శాయంపేట

హన్మకొండ జిల్లాలోని ఓ ఇంటిలో ఒకేరోజు 57 మే పుష్పాలు విరబూయడంతో స్థానికులు పువ్వులను చూడటానికి భారీగా తరలివచ్చారు. శాయంపేట మండలం పెద్దకొడెపాక గ్రామానికి చెందిన వన ప్రేమికుడు కోమనేని రఘు ఇంటి ఆవరణలో అరుదైన మే పుష్పాలు (ఫుట్‌బాల్ లిల్లీ ఫ్లవర్ - స్కాడోక్సస్ మల్టీఫ్లోరస్) ఒకే రోజు వీరబుశాయి. ఈ పుష్పాల గడ్డను 18 ఏండ్ల కిందట ఆఫ్రికా దేశం నుంచి దిగుమతి చేసుకున్నామని తెలిపారు. ప్రతి ఏడాది మే నెలలో పువ్వు విరబూసిన రోజు నుంచి సుమారు 20 రోజుల వరకు వాడి పోకుండా ఉండటం వీటి ప్రత్యేకత అన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

- ఆటో అండ్ మోటార్ క్యాబ్ డ్రైవర్స్ వెల్ఫేర్ సొసైటీ నాయకులు
- ఆర్టీఏ కార్యాలయం ముందు ధర్నా



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఆటో స్క్రాప్ స్కాంలో అవినీతికి పాల్పడిన అధికారులను విధుల నుంచి తొలగించాలని సిటీ ఆటో అండ్ మోటార్ క్యాబ్ డ్రైవర్స్ వెల్ఫేర్ సొసైటీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ర్యాలీగా రవాణా శాఖ కార్యాలయం వద్దకు చేరుకున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లు నిరసనకు దిగారు. రవాణాశాఖలో అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చే వేతనాలతో పనిచేస్తున్న అధికారులు రూ.100 కోట్ల అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. దాంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడటంతో వేలాదిమంది డ్రైవర్ల జీవితాలు ఆగం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ధర్నా చేస్తున్న పలువురు డ్రైవర్లను పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో అక్తర్ అహ్మద్, హాసం మక్కే తదితరులు పాల్గొన్నారు.

అల్పపీడనం ఎఫెక్ట్.. పెరగనున్న ఉష్ణోగ్రతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ నెల ఆరోతేదీ నాటికి ఉపరితల ఆవర్తనం ఏర్పడి ఏడో తేదీ నాటికి అది అల్పపీడనంగా మారే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. ఇది ఎనిమిదో తేదీ నాటికి తీవ్ర అల్పపీడనంగా కేంద్రీకృతమయ్యే అవకాశముందనీ, మధ్య బంగాళాఖాతం వైపు కదులుతూ తీవ్రమయ్యే అవకాశముందని సూచించారు. దీని ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశముందని పేర్కొన్నారు. రాబోయే 48 గంటల పాటు జీహెచ్‌ఎంసీ పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వాన, ఎక్కువ ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశాలున్నాయి. బుధవారం రాత్రి 9 గంటల వరకు రాష్ట్రంలో 120కిపైగా ప్రాంతాల్లో వర్షం కురిసింది.

మత్స్యకారబంధు అమలు చేయాలి


- ముదిరాజ్ ఎంప్లాయీస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతుబంధు తరహాలో మత్స్యకారబంధు అమలు చేయాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ మత్స్యరంగ అభివృద్ధి కోసం గతంలో ఎన్నడూ లేనంతగా పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారి సంక్షేమం కోసం సామూహిక ప్రమాద బీమా పథకం కింద ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం ఉన్నప్పటికీ అమలులో ప్రభావం చూపడం లేదని పేర్కొన్నారు. మత్స్య సహకార సంఘాలలో నమోదు చేసిన సభ్యులందరికీ బీమా పథకం వర్తింపు ప్రకటనలకే పరిమితమైందని తెలిపారు. రైతుబీమా తరహాలోనే ప్రత్యేకంగా మత్స్యకారుల బీమా అమలు చేయాలని కోరారు. నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ (జాతీయ మత్స్య అభివృద్ధి) బోర్డు, ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (జీఏఐఎస్) కింద తీసుకొచ్చిన గ్రూపు బీమాలో మత్స్యకారులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. కేవలం ప్రాథమిక సహకార సంఘంలో సభ్యులై ఉంటే బీమా వర్తిస్తుందంటూ నిబంధనలున్నా అమలు కావడం లేదని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ వెంటనే స్పందించి రైతు బంధు తరహాలో మత్స్యకార కుటుంబాలకు వేగవంతంగా బీమా చెల్లించేలా విధి విధానాలను రూపొందించాలని కోరారు. నోడల్ ఏజెన్సీలతో అయ్యేదేమీ లేదని, ప్రభుత్వమే పూనుకుని స్వతహాగా స్థానిక అధికారుల నివేదికలతో మత్స్యకార బీమా బాధిత కుటుంబానికి తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మేడారం మహా జాతర- 2024 తేదీలు ఖరారు

- పూజర్ల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు



నవతెలంగాణ - ములుగు

ఆసియాలోనే అతిపెద్ద ఆదివాసీ జాతరగా పేరుగాంచిన సామక్క సారలమ్మ మేడారం జాతర - 2024 తేదీలను ఆలయ పూజరులు ప్రకటించారు. బుధవారం ములుగు జిల్లా తాడ్వాయి పరిధి మేడారంలోనిసమ్మక్క-సారలమ్మ గద్దెల సమీపంలో పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తేదీలను ఖరారు చేసి ప్రకటించారు. 2024 ఫిబ్రవరి 14వ తేదీన (బుధవారం) మండమేలగడం మొదలవుతుందని తెలిపారు. 21న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజును గద్దెకు తీసుకువస్తారని, 22.02.2024(గురువారం)న సమ్మక్కను గద్దె వద్దకు తీసుకొస్తారని, 23.02.2024(శుక్రవారం)న భక్తులు మొక్కులు తీర్చుకుంటారని వెల్లడించారు. 24.02.2024(శనివారం)న దేవతల వనప్రవేశం, 28.02.2024(బుధవారం) తిరుగువారం జాతర, పూజలతో జాతర ముగుస్తుందని తెలిపారు.

అకాల వర్షాలతో పంట నష్టాలు

పరిహారం చెల్లించండి


- ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు నివారించండి :సీఎం కేసీఆర్‌కు తెలంగాణ రైతు సంఘం లేఖ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అకాల వర్షాలు, వడగండ్ల వానలతో పంటలకు తీవ్రమైన నష్టం జరిగిందని తెలంగాణ రైతు సంఘం తెలిపింది. వరి, పత్తి, మొక్కజొన్న, ముతక ధాన్యాలు, మామిడి, కూరగాయల పంటలు పెద్దఎత్తున నష్టపోయాయని పేర్కొంది. కల్లాలోని ధాన్యం తడిసిపోయిందని గుర్తు చేసింది. ఎకరానికి రూ.50 వేలు పెట్టుబడి పెట్టిన రైతులు వానలతో పూర్తిగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేసింది.1500 కోళ్ళు, 150 గొర్రెలు, 13 దుక్కిటెడ్లు మృత్యువాత పడ్డాయని పేర్కొంది. వెంటనే పరిహారం చెల్లించాలనీ, ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు నివారించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాదరావు, సహాయ కార్యదర్శి మూడ్‌శోభన్...బుధవారం ఈమేరకు సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. అకాల వర్షాలకు 10 లక్షల ఎకరాల్లో రూ.1800 కోట్ల విలువ గల పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. అంతకు ముందు ఫిబ్రవరిలో అకాల వర్షాల్లో ఐదు లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఇంత నష్టం గతంలో ఎప్పుడు వాటిల్లలేదనీ, మొత్తంగా రూ. 4850 కోట్ల పంటల నష్టం జరిగిందనే అంచనా వేశారని గుర్తు చేశారు. ఎకరాకు రూ.10 వేలు ఇస్తామని ప్రకటిం చారని తెలిపారు. 15వ ఫైనాన్స్ కమిషన్ 2022-23కి ప్రకృతి వైపరీత్యాల పరిహారానికి కేంద్ర ప్రభుత్వం రూ.472 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.157 కోట్లు మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలనీ, 2022-23 సంవత్సరానికి కేంద్రం రూ.495 కోట్లు, రాష్ట్రం రూ.165 కోట్లు విడుదల చేయాలని కోరారు. ఈ మొత్తం రూ. 1289 కోట్లవుతాయని తెలిపారు. కనీసం ఈ నిధులను రైతులకు ఎకరాకు రూ.20 వేల చొప్పున పరిహారం చెల్లించడం కొంతమేరకు ఉపశమనం కలుగు తున్నదని పేర్కొన్నారు. భూపేంద్రసింగ్ హుడా కమిషన్ కూడా ఇదే అంశంపై సిఫార్సులు చేసిందని తెలిపారు.



తడిసిన ధాన్యం కొంటామన్నారు... మార్కెట్లలో తూకాలు వేయడం లేదు



తడిసిన ధాన్యాన్ని చివరిగింజ వరకు కొనుగోలు చేస్తామని ప్రకటించారనీ, మార్కెట్‌కు వచ్చిన ధాన్యాన్ని వారాల తరబడి తూకాలు వేయడం లేదని పేర్కొన్నారు. టార్పాలిన్‌గానీ, ఎలాంటి రక్షణ వ్యవస్థగానీ మార్కెట్ యార్డుల్లో లేదని తెలిపారు. ప్రమాణాల ప్రకారం తేమ ఉన్నప్పటికి మిల్లర్లు తగాదాలు పెట్టి, తూకం వేసిన తర్వాత 40 కిలోల బస్తాకు 4 కేజీలు కోత పెడుతున్నారని వివరించారు. వ్యవహారమంతా మార్కెట్ కమిటీలకు, ఐకేపీ, సొసైటీలకు మిల్లర్లకు తెలిసి జరుగుతున్నదని ఫిర్యాదు చేశారు. మొక్కజొన్నలు కొనుగోలు చేస్తామని ప్రకటించడం హర్షనీయమని పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరలు ప్రకటించిన ముతక ధాన్యాలను మొక్కజొన్నలు, రాగులు, సజ్జలు, కొర్రలు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రైతులు నష్టపోకుండా మద్దతు ధరలపై రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని కోరారు. రెవెన్యూ, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలతోపాటు మార్కెట్ కమిటీలు సమన్వయంతో వ్యవహరించి, రైతు ప్రయోజనాలను రక్షించాలని కోరారు. సమస్య పరిష్కరానికి తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు.